# విషయసూచిక


౧. ఆంధ్రుడా! ... ౫౩
౨. కాపరమేద్చేదెట్లా? ... ౫౫
—దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి
౩. లావుగా ఉండడాన్ని గురించి ... ౫౭
—ఎ. శేషాచలపతి బి. ఏ.
౪. ముసల్దాణ్ణి వరించింది... ౬౧
—టేకుమళ్ళ కామేశ్వరరావు బి. ఏ.
౫. మాతృవధ ... ౬౫
—చిట్టి సుందరరావు
౬. పెళ్ళి చెడగొట్టినఅవధాని ... ౬౯
—పురాణం కుమారరాఘవశాస్త్రి బి. ఏ.
౭. దోమతెరవచ్చిననాటిరాత్రి ... ౭౪
—కడియాల కామేశ్వరరావు
౮. జిజ్ఞాస ... ౭౯
౯. ఆంధ్రభూమి పుస్తకపీఠము ... ౮౦
౧౦. వరదానము ... ౮౨
—రావు వెంకటరంగనాయకులు
౧౧. హెర్స్ఫోర్డు ... ౮౫
౧౨. మణిమాల ... ౯౧
౧౩. ఇన్సూరెన్సు విషయములు ... ౯౩
౧౪. సంపాదకుని విన్నపములు ... ౯౫



కృతజ్ఞత.

ఈ సంచికయందు ప్రచురితములైన సినీమాచిత్రములు వేసేరీయందలి చమారి యాటాకీస్ వారు దయతో నొసంగినవి.



## ఆంధ్రభూమి

ఏడాది చందా రు. 1—8—0

విడిసంచిక రెండు అణాలు.



## 40 ఔన్సుల నెత్తురు

40 ఔన్సుల రక్తమునుండి కాని ఒక ఔన్సు వీర్యము ఉత్పత్తి కాదని శాస్త్రవేత్తలు చెప్పుచున్నారు దీనినిబట్టి వీర్యము ఎంత విలువయైనదో తెలిసికొనవచ్చును. అట్టివీర్యము మాత్రములోగాని, స్వప్నములోగాని పోవుచున్నచో ఇక పురుషునకు ఇహలోకసుఖ మెక్కడ? వీర్యనష్ట లక్షణములు ఏమాత్రము కనిపించినను అశ్రద్ధ చేయక మాకువ్రాసి మా సలహాను పొంది వానిని వెంటనే తొలగించుకొనుడు. ఉత్తర ప్రత్యుత్తరములు అతి రహస్యముగ ఉంచబడును.

రత్న పురుష డిపో
2/40 పెద్దినాయని వీధి,
మదరాసు.



## మొమ్మాయి-జీవన్

శ్రేష్ఠమైన హిరానీ మొమ్మాయితో మహత్తర శక్తిమంతములైన అనేక ఓషధులు చేర్చి చేయబడినది. రక్తవృద్ధిని, ధాతుపుష్టిని, జవసత్త్వములను కల్గించును శుక్రనష్టము, శీఘ్రస్ఖలనము, కీళ్ళనొప్పులను నివారించి వజ్రకాయము నొసంగును.

(20 రోజులకు) సీసా 1-కి రు 2-0-0.

పోస్టేజీ ప్రత్యేకము.

ఆంధ్ర కెమికల్ అండ్
ఫార్మస్యూటికల్ వర్క్సు. (గిజిష్టర్డు).
గాంధినగరం, బెజవాడ.

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

# ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ,

లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :— బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :

మ-రా-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

స్వల్ప ప్రీమియములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమిషనక్ యియ్య బడును.

ప్రత్యేకసౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు.
2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును,
3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు,
4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి,
5. పట్టాదారులకు ఋణము లియ్యబడును,
6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును.
7 ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును.
8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

జననభీమా శిశు పోషణకు గొప్ప సహాయకారి.

పూర్తి వివరములకు :

సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్,

ఆంధ్రప్రావిడెంటుకంపెనీ,

గాంధినగర్, బెజవాడ.



ఈస్టిండియా ఫిలింకంపెనీవారి 'ఇంద్రసభ' లోని ఒకనటి.



'నలదమయంతి' అను ఫిలిములోని దమయంతి వనవిహారము.

స్థాపితము ౧౯౩౩. సాలుచందా రు. 1—8—0.

# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు సచిత్రాంధ్ర మాసపత్రిక

సంపుటము : ౪. యువ, శ్రావణము : ఆగష్టు 1935. సంచిక : ౨.

## ఆంధ్రుడా!

ఆంధ్రుడా! నీప్రాక్తనవైభవము కొలదిఇడరానిది. నీవు విశ్వామిత్రుడవై సృష్టికి ప్రతిసృష్టి గావించితివి. నీవు వీరాధివీరుడవై మగధ మాళవ సౌరాష్ట్ర దేశములందును, పాండ్య చోళ రాష్ట్రములందును, సింహళద్వీపమునందును విహారముసల్పి రణకండూతి తీర్చుకొంటివి. నీవు ఆపస్తంబుడవై కర్మభూమియగు భారతదేశమున గార్హస్థ్య ధర్మ నిర్ణయము గావించితివి. నీవు శాలివాహనుడవై శకమును నిర్మించితివి. అది నేడు భారతదేశమునందలి విశేషభాగముననే గాక సయాము, కాంబోడియా దేశములందుకూడ ప్రచారమునందున్నది. నీవు సిద్ధనాగార్జునుడవై తిబెత్తుదేశమునకు మహాయానశాఖకు చెందిన బౌద్ధమతభిక్ష పెట్టితివి. నీవు సిద్ధహస్తుడవై విదేశీయులకుకూడ ఆహాపుట్టునట్లు అజంతాచిత్రములను అక్షరరమ్యరూపమున కల్పించితివి. నీవు సాహసికనావికుడవై ఉల్లోలకల్లోలమగు ఉదధిని సునాయాసముగ ఉత్తరించి బర్మా, సుమిత్రా, జావా మొదలగు ప్రదేశములకు ఆర్యనాగరికతాజ్యోతిని ప్రసరింప జేసితివి. నీవు భవభూతివై ఉత్తరరామచరిత్ర రచియించి సంస్కృతసారస్వతమున కరుణరసమును పరమావధిని జేర్చితివి. నీవు పండితరాయలవై సంస్కృతసారస్వతజిజ్ఞాసువుల నెల్ల రసగంగాలహరిలో తెప్పలు తేల్చితివి. నీవు త్యాగరాయలవై గానమహిమచే అరవవారినెల్ల ఆంధ్రభాషాముగ్ధులనుగ నొనర్చితివి. మావిచివురులు మెసవిన పుంస్కోకిలమువలె నీవు గోదావరీమధురసలిలములను గ్రోలి స్వరయుక్తముగ వేదమంత్రములను పఠించి మోక్షముల్లరువంటి విజాతీయపండితునిచేతనే గాక ప్రాచ్యపండితప్రకాండుడగు భండార్కరుచేతకూడ శతధా శ్లాఘింపబడియున్నావు.

కాని ఇవి అన్నియు ఒకనాటిసంగతులు. నేటిసంగతులు కావు. నేడు నీస్థితి యెట్లున్నది ఒకపరి పర్యాలోచింపుము. బర్మాదేశమున నీవిప్పుడు కోరంగివై రిక్షా లాగుచున్నావు. భారతదేశపు కుబేరపట్టణమగు బొంబాయియందు నీవు 'కామాటీ' యను నామమున పిలువబడుచున్నావు. నైజాములో తెలంగాణముననే నీ తెలుగులదీప్తి లేదు. నీవు గాయకులనుగా దిద్ది

తీర్చిన అరవవారి జన్మదేశమున నీకు ముచ్చటకైన ఒక ప్రత్యేకపాఠశాల లేదు. రాజధానీ నగరమగు మదరాసునందే నీ ప్రాభవమునకు దగిన పలుకుబడి నీకు లేదు. సరిహద్దు తగాదాలో నీవు ఉత్కళులచేతులందు పూర్తిగ చిత్తు అయితివి. బళ్లారిప్రాంతమున నీమీదకు దూసుకొని వచ్చుచున్న కన్నడులను కన్నడించుచున్నావు. ఏల ఇట్లు బ్రతికి చెడుచున్నావు? ఈ అలసతకు, అశ్రద్ధకు అంత్యక్రియలు లేనేలేవా?

ఒకప్పుడు నీ రక్తమును ఉద్వేలితమొనర్చి నిన్ను కార్యశూరునిగా, కావ్యగీతిప్రియునిగా నొనర్చిన గోదావరి, కృష్ణ, పినాకిని, తుంగభద్ర మున్నగు నదులు జీవనశోషముల్ గనక ఇంకను నీదేశమున ప్రవహించుచునే యున్నవి. ఒకప్పుడు నిన్ను మతావేశపరునిగా, సిద్ధహస్తునిగా గావించిన శ్రీశైలమల్లికార్జునలింగము, భద్రగిరి రామచంద్రప్రభువు, తిరుపతి వెంకటేశ్వరస్వామి మున్నగు దేవతాసార్వభౌములు తమ భక్తపాలనదీక్షను డిందుపాటొందింపక ఇంకను నీదేశమున వెలసియే యున్నారు. అయినను నీవిప్పుడు అప్పటి కార్యశూరుడవు కావు; అప్పటి కావ్యగీతిప్రియుడవుగావు; అప్పటి మతావేశపరుడవు కావు; అప్పటి సిద్ధహస్తుడవు కావు. కారణమేమి? అప్పటి అనుగుణపుంజమంతయు నశించి ఆచరణస్థితి నందని ఆవేశము, జాతీయతనిలుపని చదువు, మతపు లోతునుబాతును గుర్తింపని నిర్లిప్తత, సిద్ధిపై లక్ష్యములేని సంకల్పము, ఉద్దేశమును ఉద్ఘాటితము చేయజాలని ఉద్రేకము, ఫలముపై దృష్టిలేని ఉత్సాహము అను క్రొత్త దుర్గుణములు నీకు హత్తినవి.

ఇట్టి క్రొత్త దుర్గుణములు హత్తినవి కావుననే నీవు వెంకటప్పయ్యవంటి దేశభక్తుని, నాగేశ్వరరావువంటి దేశోద్ధారకుని, ప్రకాశమువంటి సాహసికుని, పట్టాభివంటి ప్రజ్ఞానిధిని, రామదాసుపంతులువంటి ఆర్థికవేత్తను, రామచంద్రరావువంటి రాజ్యాంగవేత్తను, సుబ్బారావు పంతులువంటి ప్రతిభాశాలిని పురస్కరించుకొని నడచియు, రెండు పుష్కరములకు పైగా ఆందోళనము జరపియు ప్రత్యేకరాష్ట్రమును సంపాదించుకొనలేక పోయినావు. ఇకనైన అన్యచింతలుమాని జాగుచేయక ఆత్మపరీక్ష గావించుకొందువుగాక!

నీకు తిరిగి బలముకలుగుగాక! ఆ బలము పూర్వమునకువలెనే మోరకుదనమునకు దారిచూపకుండునుగాక! నీకు మరల శౌర్యము కలుగుగాక! ఆశౌర్యము పూర్వమునకు వలెనే ఉగ్రసుందరమగునుగాక! నీకు తిరిగి ప్రతిభ కలుగుగాక! ఆ ప్రతిభ పూర్వమునకు వలెనే దర్పముచే పతితము కాకుండును గాక! నీకు మరల ప్రాభవము కలుగుగాక! ఆప్రాభవము పూర్వమునకువలెనే హింసాకళంకితముకాకుండునుగాక! నీకు తిరిగి ప్రజ్ఞకలుగుగాక! ఆ ప్రజ్ఞ పూర్వమునకువలెనే నీ ప్రియవాదితనమునకు పట్టుసారువ యగునుగాక!

రాష్ట్రవిషయమున నీవు చేపట్టిన ప్రయత్నము ఫలోదయాంతము కావలయును, నీవు తలంచిన తలంపు పచేళిమము కావలయును, నీవు సంకల్పించిన సంకల్పము సిద్ధినొందవలయును. అప్పుడే విశ్వామిత్రుని కాలమునుండి నేటివఱకు కడచన్న ఆంధ్రమహాపురుషులకెల్లరకు ఆత్మశాంతి యొనగూడును. వారియంశమగు ఈ ధరిత్రిని వారి సంతతివారమగు మనము ప్రత్యేకముగ ననుభవించుచో వారి ఆనందమునకు అవధియుండునా? ఆంధ్రుడా? వారి ఆనందమునకు అవధియుండునా?

# కాపరమేడ్చేదెట్లా?

ప్రకాశం! నీవుచెప్పిన పండ్లపొడి ఆమె చేత వాడించాను.

ప్రకా—గుణమేమైనా ఉందా? సుబ్బారావు!

సుబ్బా—రెండోనాడే నాగా.

ప్రకా—కారణం?

సుబ్బా—దానిలోని జాజికాయ వెగటువాసనట. వాడితే, వాంతివచ్చేటట్లు ఉన్నదంట.

ప్రకా—తనకంపు తనకింపు.

సుబ్బా—తాను నా పండ్లపొడిని వెగటువాసన అని విడిచేస్తే, నేను దీంతో కాపురమేడ్చే దెట్లా?

ప్రకా—ధర్మపత్నిగదా! పెండ్లినాడు నీవేమని ప్రమాణం జేసినావు?

సుబ్బా—నా కామంత్రాలఅర్థం తెలియదు. అసలు, నేను వాటిని పలకనే పలకలేదు.

ప్రకా—కాని, పిల్ల మీయింట్లో ఉందిగా?

సుబ్బా—పెళ్ళికూతురి అందచందాలు, వంశగౌరవాలు, ఆస్తిపాస్తులు పెద్దవాళ్ళు చూస్తారేగాని, నోటివాసన చూడరుగదా!

ప్రకా—అన్నీ ఒక్కచోటే? అట్లాగైతే, చాలామందికి పెళ్ళిళ్ళుగావే!

సుబ్బా—తల్లిదండ్రులు శ్రద్ధవహిస్తే, పెళ్ళిళ్ళు నిల్వవు.

ప్రకా—అయితే, నీవు ఆసక్తిగైకోక, పెళ్ళాన్ని వదులుతానంటావేం?

సుబ్బా—తల్లిదండ్రు లది నిష్కళంకప్రేమ, ప్రియులదో ఉద్వేగమైంది. ఓర్పుతక్కువ.

ప్రకా—ఓర్పు దెచ్చుకోవాలె.

సుబ్బా—చెబితే వింటేనా?

ప్రకా—మరొకమందు మార్చిచూడు.

సుబ్బా—ఈలాంటివి స్వల్పాలని తోసివెయ్యక, వారి తల్లిదండ్రులు చికిత్సజేస్తే బాగుండును. మొక్కై వంగనిది మానై వంగుతుందా?

ప్రకా—మానవమాత్రులకు (తిర్యగ్జంతువుల సంగతి చెప్పనేల) అంతో ఇంతో ఇది వుందిగదా?

సుబ్బా—అందానికి కండ్లెట్లా ఆకర్షకములో,

ప్రకా—అట్లాగే, విముఖత్వానికి నోటికంపూనా?

సుబ్బా—పాటకపుజనులు (పనిపాట్లు చేసేవారు) నాలుగైదు దినాలు విప్పినగుడ్డ (కూటికిలేక) కట్టుచుండినా ఆరోగ్యంగా ఉంటారు.

ప్రకా—దీనికి విరుగుడు వ్యాయామ మంటావా?

సుబ్బా—పరిశ్రమ, దానితోపాటు వెలుతురు, గాలి, దీర్ఘవ్యాధైతే మందూ

మాకు, అన్నీ కావాలి.

ప్రకా—అయితే, స్త్రీలు పరిశుభ్రముగా వుంటే, సౌందర్యముతో పనిలేదా?

సుబ్బా—రూపసైనా, దుర్గంధవతైతే దాని మొఖము చూడరు (ఒకసారి తెలిసికొన్న పిమ్మటనైనా). ప్రపంచములో ఎవరిని గురించైనా "అందకత్తైనా కాదు. ఎట్లా వుంచుకొన్నాడు దీనిని" అని మనము ఆశ్చర్యముతో అంటాము కదూ?

ప్రకా—మందులు, మాయలు దీనికి కారణము కాదంటావా?

సుబ్బా—చూడు, శ్రీకృష్ణునివలలో వేసికోవడానికి సత్యభామ ద్రౌపదిని (అయిదుగురుభర్తల అనురాగము పొందినది కాబట్టి) మంత్రౌషధము లడిగితే ఏమి చెప్పినది?

ప్రకా—మందూ మాకు సంగతి ప్రియులకు తెలిస్తే వున్నప్రేమ కాస్త ఊడుతుంది, కాబట్టి పతిశుశ్రూష చేయమన్నది.

సుబ్బా—వేశ్యల, వ్యభిచారిణుల విషయము గూడ నింతే. కాని, వీరిని ప్రేమించడానికి కారణము?

ప్రకా—డబ్బు దండుగకు, మంచ మెక్కుటకు.

సుబ్బా—కాదు. కాదు. వారు తమ దుర్గంధములు యితరులు గ్రహించనటుల కప్పిపుచ్చి కపటప్రేమచే విటుల నాకర్షించుచుందురు. వారు తమ దుర్గంధములు ఇతరులు గ్రహింపజాలనటుల వర్తించెదరు. కావుననే "హాని (వేశ్య - మునికుమారవేషధారి) వదనంబువలన వెల్వడు సుగంధి మధురభాషణములకు నిజాస్య మాసన్నము జేసి యొక్కమృదుశబ్దము జేసి"న స్త్రీ పురుషభేదము తెలియని ఋశ్యశృంగుడు ఆశ్రమధర్మమును విడచి దానివెంట బడెను. ఇక విటాకర్షణము చెప్పనేల?

ప్రకా—అయితే, గృహలక్ష్ములనుగూడ కపటవర్తనుల కమ్మనెదవా?

సుబ్బా—సందేహమేమి? 'శయనేషురంభా' అని భార్యనుగురించి వూరక జెప్పారా పెద్దలు? వశీకరుడైన శ్రీకృష్ణుని తులిపిచేష్టలు (బహుభార్యాలంపటత్వము) మాన్పుటకు సత్యభామ ప్రయత్నించలేదా? సామాన్యుల సంగతి వేరే చెప్పవలెనా? ఇంతకూ వీరికి కపటవర్తనము పనిలే, చలాకీ కావాలి.

ప్రకా—ఇంకేమి, భోగమువారివద్ద కులకాంతలకు శిక్షయిప్పిస్తే బాగుండును!

సుబ్బా—వాత్స్యాయనుడు చెప్పనేచెప్పినాడు. సద్వినియోగమునకు ఏ విద్య నేర్చినా తప్పులేదు.

ప్రకా—కొంపముంచావు. అతని కామసూత్రములు ప్రకృతివిరుద్ధములు.

సుబ్బా—ఏవి విరుద్ధములో, ఏవికావో, పాఠకులు లోకానుభవమువలన నిశ్చయించుకోవలెను.

ప్రకా—చెత్తలోనుండి మంచిని ఏరుకోమంటావు?

సుబ్బా—రాళ్ళలోనుండి రత్నముల నేరుకొనడములే. ఇంతెందుకు బ్రహ్మ ఈ దుర్గంధము నెందుకు సృజించాలి? 'అధరామృత'మని మనచే ఎంగిలికి పేరుపెట్టించాడు. దానిని గ్రోలి అజరామరణులమగుటకు తిప్పలుబడుతూ కడపట కులతత్వవిచారము గూడ మనమీడ్చి పారేస్తే, దానికిగూడ ఆయనతల ఊపుచున్నాడు.

ప్రకా—అయితే, ఆడవారినింత అల్లరిచేస్తివే

మగవారి కీపరిమళము లేదా!

సుబ్బా—లేకేమి, ఒక్క భార్య విషయము బాగా తెలుస్తుంది. రక్తసంబదీకులు అక్క చెల్లెండ్రవిషయము ఒకమాదిరి. కాని నిత్యం, ప్రొద్దస్తమానం మొగస్నేహితులతో కాలంగడపే మనబాధ చెప్పాలనా? ఎవరికైనా తన క్రిందినొకర్ల కీవ్యాధి వుంటే ఇక ప్రత్యక్షనరకమే.

ప్రకా—దీనికి విరుగుడు టూత్ పేస్టులు, పండ్ల పొడులు వున్నవిగా?

సుబ్బా—ఇవి పొట్టకూటి పేస్టులేగాని, గుణ మెవరికి యిస్తున్నవి? వీటి నిరంతరోప యోగమునకైన చిక్కు లేగదా. మన కింత పేచి.

ప్రకా—అయితే, ఒక గోషాయి చిటకా సంపాదిస్తే బాగుండునే?

సుబ్బా—ఆడవారి దుర్గంధానికి మనమేడిస్తే, మగధీరులకంపుకు ఆడవాళ్ళేడ్చి సంసారము చేయకపోతే వెళ్ళిన గోసిపాతరాయల్లు వీరు. వీరు మందులు కనిపెట్టక పోగా, ఆడవాళ్లు దుర్గంధపూరితులని ప్రచారము జేస్తూ, మనకొంపలుదీస్తున్నారు.

ప్రకా—కాదు, కాదు. మత్స్యగంధివాసనను, మంచుకల్పించో, (పైన నీళ్లుచల్లి స్నానముచేయించో) తన పైకందువానిచ్చో, సన్యాసి పరాశరుడు పోగొట్టలే?

సుబ్బా—ఆయన సన్యాసెట్లయినాడు? భారతానికంతా ఆయన సంసారి.

ప్రకా—అయితే దీనికి మందేలేదా?

సుబ్బా—లేకేమి, అజీర్ణము కలిగించని భోజనము. నిద్రబోయి లేచినప్పుడల్లా, లవంగ చెక్క పొడితో దంతధావనము. దీర్ఘవ్యాధైతే అపుడపుడు లవంగాలు నమిలి ఊసెయ్యడము......

ప్రకా—ఈ విషయములో ఘుట్టిపరిశోధనజేసి, ఫలితం ప్రకటించడానికా? ఇంతరాద్ధాంతం.

సుబ్బా—పూర్తిగా చెప్పనివ్వావోయి. దినమూ పదిపదిహేను నిమిషాలు సర్వాంగసౌందర్యానికి వ్యాయామము. ముఖవర్చస్సుకు, ఋతుదోషములకు చన్నీళ్ళస్నానం, నిత్యముపుతికిన వస్త్రములు—కావాలి. అప్పుడు సంసారస్వర్గము.

ప్రకా—దీంతో యీ దోషము రూపుమాసి పోతుందా?

సుబ్బా—రూపుమాసి పోకపోయినా, సహజసౌందర్యానికి నాగరకతవలె, వుల్లాసముగా వుంటుంది.

ప్రకా—మానవులకే దుర్గంధము సహజముగదా?

సుబ్బా—సహజమైనా, తారతమ్యాలు లేకపోలేదు. కావున సహజానికి నాగరకత జేర్చవలెనంటాను.

ప్రకా—గోరంతను కొండంతగా దూషిస్తావోయి.

సుబ్బా—ఇది ప్రకృతినైజము. సముద్రము లోపడ్డ పుల్లను అది బైటికి నెట్టడములే?

ప్రకా—రాయివేస్తె నెట్టివేస్తుందా?

సుబ్బా—దుర్గంధప్రతిక్రియలు చేస్తే నేను సంసారము చేయనన్నానా?

ప్రకా—బ్రతికించావు.

[అని నిష్క్రమించును.]

—దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి.

# లావుగా ఉండడాన్ని గురించి

[ఒక స్థూలకాయుని స్వగతము]

నేను పుట్టినప్పుడు చాలా సన్నంగా వుండేవాడినట. కాని ఈ మధ్య నేను చాలా లావు ఎక్కేను. ఈ లావుకి కారణం అన్నప్రాశన అయిన మరునాటినుంచీ నేను భోజనవిషయంలో కొంచమేనా పిసినారితనం లేక చాలా వుదారంగాను వుదాత్తంగాను ప్రవర్తించడమే. మితంగా తినాలి అనే శరీరశాస్త్రవేత్తల శాసనం చదువుకోకపూర్వం నేను ఎరగను; చదువుకున్నతరువాత ఆ శాసనాన్ని పాటించడానికి తగినసత్తా—ఇంతలావుగా వుండికూడా—నాకు లేకపోయింది.

ఆరోజుకి ఆరోజు నేను లావెక్కుతూవున్న సంగతి నాకు చాలా రోజులవరకూగాని తెలిసిందికాదు. నా పెళ్లిలో సవారీమోసిన చాకలాళ్ల విసవిసల్తో కొంత నాకు ఆత్మజ్ఞానం కలిగింది. నిజంగా నా పొట్ట కొంచెం ముందుకు తోసి వచ్చిందనీ, మామూలుగా కనిపించే మనుష్యుల్లోకంటే నాలో ఒక విలక్షణమైన మాంససంబంధమైన తేజస్సు వుందని నాకు అవగతం అయింది.

పొట్టపెరిగినకొద్దీ ఆయాసంకూడా పెరుగుతుంది. చలనశక్తి చాలాభాగం తగ్గిపోతుంది. గమనించినకొద్దీ నాలో ఈ లక్షణాలు నాకు కూడా కనిపించడం ప్రారంభించేయి. అందుతో నాలో ఒకవిధమైన బిడియం ప్రవేశించింది. నేను రోడ్డమ్మటే సాధ్యమైనంత చురుగ్గానే పోతూఉండేవాడిని. కాని చాలామంది నన్ను దిగతొక్కి ముందుకు సాగిపొయ్యేవారు. నాది నత్తనడకంటూ రేమోనని లోపల ప్రాణాలు పీచుపీచుమంటూ ఉండేవి. నాకేసి చూచిన ప్రతిమనిషీ నన్నుగురించి డబుల్ పన్నా మనిషి అని మనసులో అనుకుంటున్నాడని నాకు అనుమానంగా ఉండేది. వెనకాలనుంచి ఎవరో 'బద్దూం! బద్దూం!' అని పిలుస్తూన్నట్లు అయేది. ఇందునుంచే నేను సాధారణంగా ఇల్లుకదలి వచ్చేవాడినికాను.

ఇంట్లో ఉంటేమాత్రం నాకు ఈఒంటెతో ఏమన్నా సుఖమున్నదనుకున్నారా? నేను చేయవలసినపన్లు అన్నింట్లోకి భోజనమే నాకు చాలా యిష్టమైనపని. గోడకో స్తంభానికో ఆనుకుని కూర్చోకపోతే ఆ యిష్టమైనపనిని చేయలేకపోయేవాడిని. సాధారణమానవులందరూ పీటమీద తాము, కిందనేలమీద విస్తరి ఈ పద్ధతిలో భోజనం చేస్తారు. అసాధారుణ్ణి అయిన నాకు నేలమీదకూర్చుని, విస్తరి ఎత్తు పీటమీద పెట్టుకుని భోజనంచెయ్యడం సుకరం అనిపించేది. ఇట్టి లోకాతీతవిషయం నా దగ్గర చూపట్టినందుకు నాకు లోపల చాలా గర్వంగానే ఉండేదికాని మాయింట్లో ఎవరికికూడా ఇది ఆమోదకరంగా ఉండలేదని తోస్తుంది. మా యింట్లో ఉన్న రెండు కుర్చీలుకూడా క్రమంగా నన్ను తమలోకి తీసుకొనలేకపోయేవి. బలవంతంగా కూర్చున్నానో కంఠాభరణంలోని సుబ్బిసెట్టిమాదిరిగా ఇతరుల సాయములేనిదే ఇవతలికి ఊడివచ్చేవాడిని కాదు. మా యింట్లో ఉన్నమంచాలు నాకు తప్ప ప్రతీవాళ్ళకి స్వాగతంయిచ్చేవి. నేనంటే వాటికి హడలు. నన్నుచూసేసరికి వాటికి కంపవాతం పుట్టుకొస్తుంది. రోగగ్రస్తాలయిన ఆ మంచాల్ని నేను అంటడంమానేశాను. మా

వాళ్లుకూడా దీనికి చాలా హర్షించారు. హర్షించి కంపవాతం మొదలైన రోగాలులేని మంచం ఒకటి ప్రత్యేకంగా నాకోసం చేయించారు.

రోడ్డుమీద, ఇంట్లోను ఇల్లాఉంది. ఇక ప్రయాణాల్లోనూ ఈ మాదిరిగా ఏదో విడ్డూరంగానే ఉండేది. ఓపట్టాన్ని నాకు బండి ఎవరూ కట్టేవారుకారు. నాకేసి ఎగాదిగాచూసి బండివాళ్ళు 'నాగుర్రం బక్కగుర్రంస్వామీ.' అనో 'నా బండి కమాన్లు పాతవండి' అనో అనేవారు. ఎదటివాడి మనస్సు కష్టపెట్టడం ఎందుకనే జిజ్ఞాస చాటుమాటులేని ఈమోటు మనుష్యులకు ఏమి ఉంటుంది కనక! అల్లాంటి సమయాల్లో నాకు చాలాకోపంవచ్చేది. ఇంత శరీరాన్ని భరిస్తున్నట్లే నేను ఆ కోపాన్నికూడా ఎట్లాగో భరించేవాడిని. ఖర్మంచాలక అంతకుతగ్గ బొంతగా ఏదో ఒకబండి నేను ఎక్కేసరికి అందులోకి మరివ్వరూ ఇతరులు ఎక్కేవారుకారు. బండివాడు వాళ్ళని బతిమాలేవాడు, కొందరు 'తిన్నగా మా స్వరూపాలు ఇంటికి చేర్చనియ్యవా ఏమిటి' అని నిర్మొగమాటంగా చెప్పి వేరే ప్రయత్నంలో పడేవారు. మరికొందరు ఇంకా ఆ బండిలో చోటేదోయ్ అని ముసిముసి నవ్వులు నవ్వుకునేవారు. ఈ అవస్థలు పడలేక అందరి రేటు నేను ఒక్కణ్ణే యిచ్చి బండితోలించేవాడిని. ఇంతటితో అయినా గప్‌చిప్‌గా అయ్యేది కాదు. నా చెయ్యి కొంచెం ముందు ఆనిస్తే ముందుబరువనీ, నా కాలు కొంచెం వెనక్కు చాపితే వెనకబరువనీ బండితోలినంతసేపు బండివాళ్ళు నన్ను వేపుకుతినేవారు. రైల్లో ఆ మాత్రపు ఈ మాత్రపుచోటు నాకు సరిపోయేదికాదు. నేను ఒక పెట్టెలోంచి దిగిపోతే ఆపెట్టెఅంతా ఖాళీఅయిపోయినట్లు ప్యాసెం జర్లు సంతోషించేవారని నా అనుమానం. రేవులుదాటేటప్పుడు నావ నేనున్న సైడుకు ఒరిగితే పడవ్వాడు మిగిలిన అందర్నివదిలేసి నాకేసిచూసి కొంచెం ఆ సైడుకు సర్దుకోండి బాబూ అనేవాడు. ఈ మాదిరిగా ఎన్నని చెప్పను?

ఈ స్థితి నాకే భరింపరాందిగా అయింది. లావుతగ్గడానికి సాధనం ఏమీ లేదా అని ఆలోచనసాగించేను. మనసిచ్చిన ఒకమిత్రుని సలహా అపేక్షించాను. అతడు రోజూ దండేలు తియ్యమన్నాడు. చాలా నిక్కచ్చిగా ప్రయత్నించాను. దండేలు తియ్యబోయే సరికల్లా పొట్ట భూమిమీద ఆనేది. చేతులమీద కాళ్ళమీద లేవలేక పోయేవాడిని. అప్పటి నాతీరు నాకే అసహ్యంవేసి ఇక జన్మజన్మేపి దండేలు తీయకూడదనుకున్నా. తినడం చేతనేకదా ఈ పుష్టి పోనీ తినడం తగ్గిద్దామా అని ఆలోచన తోచింది. ఒకమిత్రుడు ఉప్పు బొత్తిగా వదిలేయడం మంచిదన్నాడు. 'ఉప్పేపస రుచుల కెల్ల' అనే చౌడప్పపద్యం జ్ఞాపకం వచ్చింది. నోరూరింది. ఉప్పుచప్పని మెతుకులు తినలేమురా బాబూ అనిపించింది. మరొ ఒక మిత్రుడు ఉపవాసాలుండమన్నాడు. ఈ పద్ధతి నాకేమీ నచ్చలేదు. ఉపవాసమే! నే నింతవరకు ఒక్క ఉపవాసంకూడా ఉండలేదు. ఏం దారి? అలవాటులేని పనిచేయకూడదని తోచింది. ఒక ప్రకృతిచికిత్సకునిసలహా అడిగితే ఆతడు తొట్టిస్నానం చెయ్యమన్నాడు. నావంటిమనిషికి సరిపొయ్యేతొట్టి మా పూళ్లోదొరకలేదు. పట్నం వ్రాసి తెప్పిద్దామనుకుంటున్నాను. కాని తొట్టిస్నానంవిషయంలో మొదటఉన్న ఉత్సాహం ఇప్పుడు ఎందుచేతో దిగనారిపోయింది.

లావెక్కడంమాత్రం తగ్గలేదు. అది

క్రమాభివృద్ధి అందుతూనే ఉన్నది. అల్లోపతిక్ వైద్యుణ్ణి సలహా అడిగాను. విశేషంగా అలసటపడ్డంచేత కలిగినవాపు అని ఊరుకున్నాడు. ఆయుర్వేదవైద్యుడిసలహా తీసుకొన్నాను. ఇది ఒకరోగం, దీన్ని మదాత్యయరోగం అంటారు, కొవ్వు శరీరంలో ఎక్కువయింది, వ్యాయామం, జాగరణ, లంఘనం మొదలైన ప్రక్రియలచే ఉపచరించాలి అని చెప్పేడు. ఆచరణసాధ్యమైంది ఒక్కటి కూడా లేదు. మంచుని కరిగించే సూర్యుడు కూడా ఈ కొవ్వుని కరిగించలేకపోవడం ఆశ్చర్యమైందే. చెమట ఎక్కువగానే పడుతుంది. కాని శరీరంమాత్రం తియ్యదు. కట్లుకట్టిద్దామా అనుకుంటే నాలావు చూడండోయి అని నోటీసుబోర్డు కట్టినట్లు అవుతుందని అనిపించింది. పస్తుఉండడమే దీనికి పరహంసక్రియ అని చాలామంది అంటున్నారు. కాని నేటిపస్తు 'రేపటిఆకలి' ఎక్కువచేయడానికే పనికివస్తుందికాని లావుతగ్గించడానికి ఎంతమాత్రం పనికిరాదని నాకు గట్టినమ్మకం కుదిరింది.

అవరోధింపచాలని దాన్ని అనుభవించడమే మంచిదని తుదకు తోచింది. స్థౌల్యంతో నిత్యానుభవం ఎక్కువైన కొద్దీ దానిలాభాలు కూడా కొన్ని నాకు కనిపిస్తున్నాయి. లావుగావున్నవాళ్ళని స్త్రీలు లావుగా (జాస్తీగా) ప్రేమిస్తారని పెద్దలు చెపుతారు. ఈ పెద్దలమాట ముమ్మాటికి సత్యమని తోస్తుంది. బక్కపలచటి మనుష్యులదగ్గర రహస్యాలుదాగవు. వాళ్ళ ఎముకల్నే వాళ్లు దాచుకోలేరు. కాగలించుకుంటే ఎముకలు గుచ్చుకునే మగాణ్ని ఏఆడది ప్రేమిస్తుంది చెప్పండి? నా చిన్నతనంలో మాయింటిపక్క ఒక తాసిల్దారుగారు కాపరం ఉండేవారు. ఆయన భార్య నాయిప్పటి లావునుబట్టి నా అప్పగారు లాగుండేది. సర్కీటుకు వెళ్ళినప్పుడల్లా ఆయన పరుపుపట్టి కెళ్ళితే భార్యను, భార్యను తీసికెళ్ళితే పరుపును తీసికెళ్ళడం మానేసేవాడు. అనగా పరుపు అలభ్యమైనపుడు ఆయనకు ఆయన లావుమాటి భార్య ప్రతివస్తువుగా ఉండేదన్నమాట. నాలుగు మూడు నెల్లల్లో కాపరానికి రాబోతూ ఉన్న నా భార్యకూడా నన్ను—ఆ తాసిల్దారుగారు తన భార్యను ఉపయోగించుకొన్నట్లు—పరుపుగా ఉపయోగించుకొని చాలా సంతోషిస్తుందని నమ్ముతున్నాను లావుగా ఉన్నవాళ్ళ పక్షంలో వారు భార్యలకు పరుపుగా ఉపయోగపడ్డం ఒకటే లాభంకాదు. లావుగా ఉన్నమనిషికే విగ్రహపుష్టి అనేది వర్తిస్తుంది. చూడండి ఉస్మాన్ సాహెబ్ గారి విగ్రహపుష్టి మదరాసు కౌన్సిలుకు ఎంతనిండుగా ఉండేదో? నేడు షౌకతాలీగారి విగ్రహపుష్టి ఢిల్లీ ఎసెంబ్లీ సభను ఎంతరంజకంగా చేస్తోందో గమనించండి. విగ్రహపుష్టిగలవాళ్ళకి ఎందులో అయినా అగ్రతాంబూలమే. విఘ్నేశ్వరుడు తన లంబోదరత్వాన్నిబట్టేకదా మనఅందరిచేతా ప్రతీశుభకార్యమప్పుడూ ప్రధమపూజలందుతూ ఉన్నాడు. అసలు ప్రపంచకంలో లావుమాటివాళ్ళంతా కొద్దో గొప్పో విఘ్నేశ్వరాంశతోటే —లంబోదరాంశతోటేఅనడం ప్రకరణాన్ని బట్టి ఉచితంగా వుంటుంది—అవతరించినవారని ఒప్పుకునితీరాలి. అట్టి దేవాంశాసంభూతుల్ని అపహాస్యంచేసినా, అవమానంచేసినా మనుషులు ఎండిపోయి వట్టి ఎముకలపుట్టలై చీపురుపుల్లలకంటె సన్నంగాను, దర్భపుల్లలకంటె గరుగ్గాను వుండిపోతారు.

—ఎ. శేషాచలపతి, బి.ఏ.

# ముసలాణ్ణి వరించింది

తలుపుసందులోంచి చూస్తున్నారు...ఎవరుచెప్మా! ...ఓహో! తెలిసింది! చేతిలోని కాగితాలు కిందపడేసి ఎందుకేనా మంచిదని వెళ్లిచూశాను. నేనూ రావడంచూచి తటుక్కున మావంటయింటివైపు పారిపోయింది. ఆ పిల్లే! జానకే!...ఇది అప్పుడే మూడోసారి, ఈ మోస్తరుగా చూడడం, నేను చూస్తూవుండగా. నేను చూడకుండా వున్నప్పుడు ఎన్నిసార్లు చూసిందో ఏమిటో!... ఏదయినా ఇది యింతకంటే ముదరనియ్యకూడదు, ముదరనిస్తే చాలా ప్రమాదం. ఏదో చికిత్స వేగిరం చెయ్యాలి అని మనస్సులో అనుకున్నాను.

జానకి మా యింటిపక్కవాళ్ల పిల్ల. రెండు మూడేళ్లాయే వాళ్లు మా యింటిపక్కని వుంటున్నారు. జానక్కి పదకొండేళ్లు వుంటాయి. చక్కదనం వేరే చెప్పనక్కర్లేదు. బంగారపుబొమ్మ. నిలుచున్న చోటే వెన్నెల కాస్తుంది. చురుకైనపిల్ల. రవ్వంత పెంకితనం కూడా వుంది. చిన్నతనం, అంచేత ఈ కాస్త పెంకితనమున్నూ. పెద్దయితే దానంతటదే పోతుంది. జానకి ఇప్పుడు రెండోఫారం చదువుతూంది హైస్కూల్లో. ఆ పిల్ల తండ్రి బ్రహ్మసామాజికుడుకాదు కాని, పిల్లలికి వేగిరం పెళ్లి చేసే అలవాటు లేదు. అంచేత జానక్కి ఇంకా పెళ్లి చెయ్యలేదు.

నేను అనేకసార్లు చూశాను...ఆ పిల్ల మనస్సు నామీదే వుంది. నేను ఏమీ ఎరగనట్టుగా వూరుకుంటాను, ఇంతట్లో ఏమీ ప్రమాదం లేదుకదా అని...ఒక రోజున నేను ఆ పిల్లను ఉత్తనే పలకరించాను, కంగించి చూద్దామని. వచ్చేచిరునవ్వ ఆపుకుంటూ, లేని చిట్లింపుమొహం తెచ్చుకొని, యిష్టం లేనట్టుగా కనపడుతూ, నే నడిగిన ప్రశ్నలన్నిటికీ జవాబు చెప్పింది, అంతే కాదు అడగని సంగతులుకూడా చెప్పింది. ఇదంతాకూడా చిట్లింపు మొహంతోనే చెప్పింది. అదే ప్రేమలక్షణం ... చిన్నపిల్ల? పాపం, దానికేం తెలుసు, నేను ముసలివాణ్ణి అనుకుంటూందేమో! నేను కనపడడంకూడా అలాగే కనపడతాను, ఇరవైయేళ్ళలోపు మనిషిలాగ కనపడతాను. అసలు వయస్సుమాత్రం ముప్పైయైదేళ్ళపైగా వుంది. నాకంటే మా ఆవిడ ముసలిదిగా కనపడుతుంది. నేను ఇరవైయేళ్ళవాడిలాగా అది ముప్పైయైదేళ్ళదానిలాగా కనపడతాము. భగవంతుడు నాకీ విచిత్రమైన లేతదనం ఇచ్చాడు. ఇప్పటికి నాతలమీద ఒక్క వెంట్రుకేనా నెరవలేదు. అదీ నా లేతదనం. మాకీ మధ్యే ఒక ఆడపిల్ల కలిగింది. మా ఆవిడ కాపరానికి వచ్చి అప్పుడే పదిహేనేళ్లయింది. సంతానం కొంత ఆలస్యం...జానికి మనస్సు నా మీదే వుంది. ఒకమారు వాళ్లయింట్లో జిలేబీలు చేసుకున్నారు. జిలేబీలు తెచ్చి మా ఆవిడచేతికి యిచ్చి నా కిమ్మని చెప్పింది జానకి. మా ఆవిడికికూడా మా రహస్యం తెలుసు. అంచేత "ఏమండోయి! మీ చిన్నపెళ్లాం జిలేబీలు పట్టుకొచ్చి యిచ్చింది. మిమ్మల్నే తినమంది అన్నీను. నన్నొక్క ముక్కేనా ముట్టుకోమనలేదు. అంతా మీరే తినండి" అనిచెప్పి "ఆ పిల్ల ఎంత ఆప్యాయంగా తెచ్చి యిచ్చిందో పాపం" అనిచెప్పి తాను ఒక్కముక్కేనా తినకుండా అన్నీ నాకే యిచ్చేసింది. తర్వాత మా ఆవిడ నాకు చెప్పింది ఆ పిల్ల ఇంట్లో తల్లితో దెబ్బలాడి నాకు జిలేబీలు తెచ్చి యిచ్చిందని. మరొకమారు వాళ్ల ఇంట్లో మరేవో చేసుకున్నారు. అవికూడా నా కిమ్మని చెప్పి మా యింట్లో యిచ్చింది. అవీ ఈమోస్తరుగానే దెబ్బలాడి తెచ్చియిచ్చిందిట... అటుతర్వాత ఒకమాటు వాళ్లింట్లో శుభకార్యం జరిగింది. ఆ పిల్ల అప్పచెల్లెలికి చంటి పిల్లాడు కలిగాడు. బారసాల చేశారు. ఆ రోజున నన్ను ఆశీర్వచనానికీ, భోజనానికీ పిల్చారు. వెళ్లాను. నేను ఆశీర్వచనానికి వెళ్లినప్పుడు జానకి వాళ్ల అప్పదగ్గిర కూచుంది. నేను రావడం చూసింది. అంతే. అక్కడ నేను వున్నంతసేపూ మళ్లా ఆ చుట్టు పక్కలికి రాలేదు. భోజనంవేళప్పుడూ అంతే. నేను రావడం చూసి పారిపోయింది. ఇది అంతా

ఆరు నెల్ల కిందటి సంగతి. ఏదో చిన్న పిల్లకదా, పోనీ దానికేంతెలుసు, ఏదో సరదా అని నేనూ వూరుకుంటున్నాను......వాళ్ల ఇంటి కెవరో ఒక కొత్తాయన వచ్చాడట. ఆయన భోంచేస్తూ జానకి తండ్రిని చూచి "ఏమండోయి మీ పిల్లకి సంబంధం వెతుక్కొచ్చాన" న్నాడుట. ఆ మాట్టుగ ఆ పిల్ల "నేను లక్ష్మణరావు గారిని తప్ప (అంటే నన్నుతప్ప) మరొకర్ని పెళ్లాడను" అందిట. జానకితల్లి హాస్యంగా "సంబంధం చాలా బాగావుంది. పెండరాడే చేసెయ్య వలసిందే. లక్ష్మణ రావుగారికి నలభై ఏళ్ళకంటే ఎక్కువలేవు. ఆయన పెళ్ళానికైనా ముప్పైయేదేళ్ళే. చిన్న చంటిపిల్ల కూడాను, పాపం. బాగా నేవుంది. ఈ సంబంధం పోనియ్యకూడదు. మన పిల్లను ఇచ్చెయ్యొచ్చు. ఇద్దరూ చిలకా గోరింకల్లాగ వుంటారు" అందిట. అందరూ నవ్వుతున్నారు. కాని జానకిక్కి మాత్రం కోపం వచ్చింది. భోంచెయ్యనంది. ఎంతో బలవంతం మీదకాని ఆ పూట భోంచెయ్యలేదు. రాత్రి ఆకలిలేదని చెప్పి అన్నం తినడం మానేసింది. ఇది అంతా మూడు నెల్ల కిందటి సంగతి. జానకి ఏ కొత్త గుడ్డ కట్టుకున్నా, లేక ఏ కొత్త వస్తువు పెట్టుకున్నా మా యింటికి వచ్చి నా కంటపడి మరీ వెళ్ళిపోతుంది.......ఇవాళ తలుపుసందు లోంచి చూసినప్పుడు నాకు కొంచెం భయంవేసింది. ఇది యింక ముదర నియ్యకూడదు. ముదరనిస్తే ప్రమాదం రావచ్చు. ఉదాసీనత ఇంక పనికిరాదు అని గట్టిగా మనస్సుకి అనిపించింది.

వారంరోజు లయింది. రోజు రోజుకూ అశ్రద్ధ అయిపోయింది. మామూలు ఉదాసీనతలో పడిపోయాను. మళ్ళా ఆ మాటే మరిచిపోయాను. ఇలాగ వుండగా ఒకరోజు ఆదివారంనాడు జానకి ఏదో పళ్ళెంతో పదార్థాలు తీసుకొచ్చి నా ముందర పెట్టి నిలుచుంది. నేను తలఎత్తి చూశాను. "ఏమిటి అమ్మాయీ' అవి" అని అడిగాను.

"ఏమీలేదు. మా అమ్మ మీ కిమ్మంది. తీసుకొచ్చాను" అంది జానకి.

"సరే! ఏమిటో చెప్పు చూదాం,"

"మా ఇంట్లో కాజాలు చేసుకున్నాం. ఇవి తీసుకెళ్లి మీకు ఇమ్మంది మా అమ్మ" అంది జానకి తల వంచుకొని. దాని నిజస్థితి నాకు తెలుసు. కాని ఏమీ ఎరగనట్టుగా "అయితే ఇంటిలో యిచ్చెయ్యి" అన్నాను నేను. అందుకు జానకి "అలాగు కాదు. మీకే ఇమ్మంది మా అమ్మ" అంది.

"సరే అయితే అక్కడ పెట్టు తీసుకుంటాను".

"మీరే తీసుకోండి" అని ఆ పళ్లెం అక్కడ పెట్టింది.

"నేనే తీసుకుంటాను" అని చెప్పి ఆ పళ్లెంలోంచి తామరాకుపొట్లం తీసుకుని బల్లమీద పెట్టాను.

"ఇప్పుడే తింట రా" అని అడిగింది జానకి.

"ఇప్పుడు కాదు. మధ్యాహ్నం. ఫలహారం వేళప్పుడు తింటాను" అని చెప్పాను నేను. పళ్ళెం తీసుకు వెళ్ళిపోయింది జానకి. నేనూ మా ఆవిణ్ణి పిలిచాను. పిలిచి చెప్పాను "ఫలహారం తెచ్చి యిచ్చింది జానకి. వాళ్ళ అమ్మ పంపించిందిట" అని. "వాళ్ళమ్మ పంపించడ మేమిటి! అబద్ధం. అదే వాళ్ళమ్మతో దెబ్బలాడి తీసుకొచ్చి యిచ్చి వుంటుంది" అంది మా ఆవిడ......ఆ తర్వాత ఒక రోజున మా ఆవిడ వాళ్ళింటికి వెళ్ళింది. అప్పుడు మాటమీద మాటవచ్చి "ఏమండోయి అత్తగారూ' మీరు పంపినకాజాలు అందేయిమాకు" అందిట, జానకితల్లితో. అందుకు జానకితల్లి "ఏమమ్మాయి! నేను పంపించట మేమిటి! నా మొహం. మా పిల్లే దెబ్బలాడి మీ యింటికి పట్టుకెళ్ళింది. వేగిరం మీరీ సవితిని తెచ్చుకుంటేనే సరి లేకపోతే మనని బతకనియ్యదు" అందిట. "తప్పే ముందమ్మా! మీ పిల్లకు నేను చాకిరీ చేస్తూవుంటాను. మీ పిల్లను నేను పువ్వుల్లో పెట్టి పెంచుతాను" అందిట మా ఆవిడ. ఈ సంభాషణ అంతా జానకి వింటూనే వుందిట. ఆ తర్వాత మా ఆవిడె చెప్పిందినాకు.

నా మనస్సులో మరింత నిశ్చయ మేర్పడింది, ఆ పిల్ల మనస్సు మార్చాలి, లేకపోతే ఏదేనా ప్రమాదం రావచ్చు, ఆలస్యంవల్ల నష్టమే కాని లాభంలేదు అని. సమయం కోసం చూస్తున్నాను...ఒక రోజున జానక్కి

మా యింటికి వచ్చింది. నేను "జానకీ!" అని పిలిచాను. జానకి ఆపాదమస్తకం కంపించింది. వెనక్కి తిరిగి చూచింది. "ఇలాగరా అమ్మా!" అన్నాను నేను. వచ్చి నిలబడింది. "దానిమీద కూచో" అని కుర్చీ చూపించాను. కుర్చీమీద కూచుంది. ఆకబురూ ఈ కబురూ చాలాసేపు చెప్పి చివరికి "నా కెన్నేళ్ళు వుంటాయను కుంటావు నువ్వు" అన్నాను.

"ఏమో!" అంది జానకి సిగ్గుతో.

"అయినా చెబుదూ చూద్దాం" అన్నాను సరదాతో నేను.

ఆ పిల్ల సిగ్గుపడి వూరుకుంది. జవాబు చెప్పలేదు. అప్పుడు నేను అన్నాను "నాకు ముప్పైయైదేళ్ళపైన వున్నాయి" అని.

"అబ్బ" అంది జానకి పరాకుగా.

ఆ పిల్ల ప్రకటించిన భావానికి అనుకూలంగా నేను "నేను కనబడేటంత చిన్నవాణ్ణి అనుకుంటున్నావు కమోసు నువ్వు. ఏళ్ళు తక్కువలేవు నాకు. ముప్పైయైదు పైన వున్నాయి. ఈ యీడు కప్పిడే అంతా ముసిలివాళ్ళు అయిపోతారు. నేను ఇంకా ఏదో ఇలాగ వున్నాను" అన్నాను.

"మీకు అన్నిఏళ్ళులేవు" అంది జానకి నిశ్చయంతో.

నేను రెండోమాట మాటాడకుండా ట్రంకుపెట్టె దగ్గరికి వెళ్ళి నా మెట్రిక్యులేషన్ సర్టిఫికేటీ పుస్తకం తీసుకువచ్చి జానకికి చూపించాను. చూసి వూరుకుంది. ఆ తర్వాత "నీ కెన్నేళ్ళున్నాయి" అని అడిగాను నేను.

"పన్నెండేళ్ళు" అంది జానకి.

"నా దగ్గిర నువ్వు చంటిపిల్ల వన్నమాట."

జవాబు చెప్పలేదు జానకి.

"ఏమంటావు?"

జవాబు చెప్పలేదు

మౌనం అర్ధాంగీకారమని నేను మనస్సులో అనుకుని "మా ఆవిడ కెన్నేళ్ళు వుంటాయను కుంటావు నువ్వు" అన్నాను.

"ఏమో!" అంది జానకి.

"అయినా చెబుదూ చూదాం"

"ఏమో!" అని తలవంచుకుంది.

"ముప్పైయేళ్ళున్నాయి" అన్నాను నేను.

"అబ్బ!" అంది జానకి ఆశ్చర్యంతో.

"నాకంటే అయిదేళ్ళే చిన్న. కాపరానికి వచ్చి అప్పిడే పదిహేనేళ్ళయింది."

"అబ్బ!" అంది జానకి మళ్ళా.

"చూశావామరి. మే మిద్దరం చిన్నపిల్లల మనుకుంటున్నావు కమోసు నువ్వు. మేము కనపడడం చిన్నపిల్లల లాగే కనపడతాములే. కాని ఇద్దరం ముసిలాళ్ళమే" అన్నాను నేను.

"........"

"మాకు పిల్లలు కలగడం ఆలస్యం. ఇప్పుడు చూశావుకాదూ, ఆ చంటి పిల్ల. మాకు వేగిరమే పిల్లలు కలిగివుంటే ఈ పాటికి పదిహేనేళ్ళ పిల్లో, పిల్లాడో వుండివుండును."

"అబ్బ!" అందిజానకి.

"నీ కంటే మూడేళ్ళ పెద్దపిల్లో, పిల్లాడో మాకు వుండివుండును."

"ఊఁ"

ఆ తర్వాత కొంచెంసేపు వూరుకున్నాను నేను. ఊరుకుని మళ్ళా "ఎవళ్ళైనా పెళ్ళాంవుండగా తిరిగి పెళ్ళి చేసుకుంటే ఆ పిల్లకని ఎలాగవుంటుంది", అని అడిగాను వుద్దేశంతో అడగనట్టుగా.

"స్వర్గానికి వెళ్ళి నా సవితిపోరు తప్పదు అన్నట్టుగా వుంటుంది" అంది జానకి నిర్భయంగా.

స్త్రీజాతి నైజగుణం చూపించావు కదా అని మనస్సులో అనుకుని "అలాగు ఎవళ్ళైనా పెళ్ళి చేసుకో వచ్చా" అని ప్రశ్నించాను.

"కూడదు" అని ధీమాగా జవాబు చెప్పింది.

"పెళ్ళాం బతికివున్న వాడిని ఎవడినేనా నువ్వు పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగాను.

"ఊఁఊఁ" అంది జానకి.

ఇన్ని తెలిసిన పిల్ల నామీద ప్రేమ ఎలాగ కనపరచింది అని నాకు ఆశ్చర్యం వెయ్యలేదు. ఎంచేతంటే

ప్రేమ గుడ్డిది. ప్రేమకు ఇంత ఆలోచన వుండదు. ఆ తర్వాత నేను "నేను చెప్పిందంతా నీకు నచ్చిందా" అని అడిగాను.

"నచ్చింది" అంది జానకి.

ఇంక ఇప్పుడు మాట్లాడవలసిన సంగతులు లేవని నేను "ఇప్పుడే చేసుకోవలసిన పని ఒకటి వుంది. మనం మళ్ళా ఎప్పుడేనా మాట్లాడదాం. ఇప్పటికి వెళతావా" అని అన్నాను.

"అలాగే" అని జానకి వెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు మాత్రం ఆపిల్ల మొహంలో ఏ భావమూ వున్నట్టు నాకు కనపడలేదు.

ఆ తర్వాత జానకి మళ్ళా మా యింటికి అనేక సార్లు వచ్చింది. ఏదో వూరికే వచ్చి వెళ్ళేది అంతే వెనకటి మోస్తరుగా ఏమీ ప్రేమచిహ్నాలు కనపరచలేదు. నా వాదన ఆపిల్ల మనస్సుమీద పని చేసిందికదా అనీ, ఇంతకీ ముదిర నియ్యకుండా ఆపేను కదా అనీ చాలా సంతోషించాను.

రెండేళ్ళయింది. ఈ మధ్య సంగతులు నేను చెప్పలేను. అవి తలుపుకు వచ్చినప్పుడే నా తల ఎందుకు వెయ్యిచెక్కలు కాదు అని ఆశ్చర్యం, విచారం వేస్తూవుంటాయి నాకు. నా గృహలక్ష్మి ఏడాదిక్రిందట వెళ్ళిపోయింది. బతికినది అది, చచ్చినది నేనుగా వుంటున్నాను. ఒక్కొక్కప్పుడు ఇల్లు, వాకిలీ, ప్రపంచం, తిండీ, తిప్పలూ ఎరగకుండా గంటలకొద్దీ అలాగే ఏదో లోకంలో వుండిపోతాను. చంటిపిల్ల కేకతో మెలుకువ వస్తుంది. మళ్ళా బతికి వున్నాను కదా అని విచారిస్తాను. భగవంతుడు దయాస్వభావుడని నేను వెనక అనుకుంటూవుండే వాణ్ణి. ఇప్పుడు వాడంత నిర్దయుడు లేడని నాకు అనిపిస్తూంది. ఉన్నన్నాళ్ళూ అనుభవించక తప్పదు.

మా చంటిపిల్లను ఒక నౌకరీ మనిషి చూస్తూవుంటాడు. మా బంధువులు వస్తూవుంటారు. నా సంసార భారం కొన్నాళ్ళు మోసి పోతూవుంటారు. కాని ఎవరు మట్టుకు తమ సంసారాలు విడిచిపెట్టి నా సంసారం చక్కబెట్టగలరు? ఎప్పుడేనా జానకి వస్తూవుంటుంది. "ఏమి చెయ్యను ? బావా !" అని అడుగుతుంది. నేను చెప్పకుండానే పనులు చేసుకు వెళ్ళిపోతూవుంటుంది. ఒక్కొక్కప్పుడు వంటకూడా చేసి వెళ్ళిపోతుంది. నాకి ప్రపంచంలో ఎవ రేమిసహాయం చేసినా నశించిపోయిన ఆనందం తిరిగి తెప్పించలేరు.

అది పోయి ఏడాది అయింది. కాలం నిలిచిపోదు. తిన్నా తినకపోయినా కాలం వెళ్ళిపోతూ నేవుంటుంది. ఇంటిపక్కనే వుండడంవల్ల జానకి తరుచు వస్తూవుంటుంది. నేను ఎంతబతిమాలుకున్నా సరే తను చెయ్యదలుచుకున్న పని చెయ్యకమానదు. కాని వాళ్ళవాళ్ళు 'అమ్మాయీ ! తరుచు వాళ్ళయింటికి వెళ్ళకమ్మా, ఆవిడ ఎలాగా లేదుకదా' అని అంటూవుంటారుట. ఒక్కొక్కప్పుడు అంతకంటే గట్టిగాకూడా కూకలేస్తూవుంటారుట. ఈ సంగతి నాకు జానకే చెప్పింది. చెప్పి కన్నీళ్ళు కార్చింది. నేనూ 'అమ్మాయీ! తరుచు మాయింటికి రాకమ్మా. మంచిపనికాదు. మీ తల్లిదండ్రులు చెప్పినమాట బాగానేవుంది. నీ బాగుకోసమే చెప్పారు' అని సలహా చెప్పాను. కాని జానకి కన్నీళ్ళు కార్చి వూరుకునేది జవాబు చెప్పేదికాదు. రావడం మట్టుకు మానేదికాదు.

జానకి వెనకటిపిల్లలాగ లేదు. మళ్ళా మునపటిలాగే ప్రేమచిహ్నాలు కనబడుతున్నాయి. ఆ పిల్లను రావద్దని నేను చెప్పలేకపోయాను. ఎన్నిసార్లని చెప్పడం. మొండిపిల్ల, కఠినత్వంవల్ల దానిమనసు మరింత బాధ పెడతానేమో అని నేను వూరుకునేవాణ్ణి.

ఒకరోజున కుర్చీమీద కూర్చుని మార్పుకోసం ఏదోనవల చదువుతున్నాను. ఇంటిలో తలుపు చప్పుడయింది. చూశాను. జానకి వచ్చింది. వచ్చీరావడంతోనే నాకాళ్ళను కౌగలించుకుని అదే ఏడవడం మొదలెట్టింది. కారణంచెప్పదు. నామనస్సు కరిగిపోయింది. కన్నీళ్ళు కార్చాను. ఇది బాగులేదని కన్నీళ్ళు తుడుచుకుని అనేకవిధాల ఆపిల్లను ఓదార్చడానికి ప్రయత్నించాను. ఊరుకోలేదు. చివరికి జానకి చెప్ప...

తూ చెప్పింది 'నన్ను మీరు పెళ్ళిచేసుకుంటేనే బతుకుతాను. లేకపోతే చచ్చిపోతాను' అని. నేను నిదానంగా అనేకసంగతులు చెప్పిచూశాను. మనస్సు మార్చడానికి ఎంతో ప్రయత్నించాను. కాని దేనికీ ఆపిల్ల ఒప్పుకోలేదు. ఒక్కటేమాట 'మీరునన్ను పెళ్ళి చేసుకుంటేనే బతుకుతాను.లేకపోతే నూతిలో పడిపోతాను' అని. నే నింకేమీ మాట్లాడలేదు. 'నీయిష్టం' అన్నాను. కన్నీటికళ్ళు చూడలేక ఆపిల్లకళ్ళు నా కండువాతో తుడిచాను. జానకి లేచి నిలబడింది. నామొహాన్ని ముద్దులు కురిపించి వెళ్ళిపోయింది.

వాళ్ళయింటిదగ్గిర చాలా అల్లగిజరిగిందిట. 'ఆయనకిచ్చి పెళ్ళిచేస్తేనే బతుకుతాను. లేకపోతే నూతిలో పడిపోతా' నని తండ్రితో నిశ్చయంగా చెప్పిందిట. తండ్రి నీయిష్టమన్నాడుట. తల్లిమాత్రం ఒప్పుగోలేదుట. కాని ఆమెకూడా చివరికి 'ఇది ఇంతపనీ చేసేమనిషే. మొండితనం చేస్తే లాభంలే'దని చెప్పి ఒప్పుకుందిట.

* * *

ఆదేయిదని చెప్పి నేను ప్రాణాలు నిలబెట్టుకున్నాను. అది పోయిన లోటుఏమీ కనబడనియ్యకుండా వుంది జానకి. ఆదేతిరిగి ఈరూపంలో వచ్చిందని నామనస్సుకు నమ్మకం కలిగింది. మాచంటిపిల్ల తనకు పుట్టినపిల్లే అని అందరితోనూ చెప్తూఉంటుందిట జానకి.

—టేకుమళ్ల కామేశ్వరరావు, బి. ఏ.

# మాతృవధ

[ఏకాంకరూపకము]

సాయంసంధ్యాసమయము : నదీతీరప్రదేశము.

[వినిర్మలనదీజలము ప్రశాంతముగ పారుచుండును. ఒకచో కొందరు జలక్రీడలొనర్చుచున్నట్లగపడుచుండును. ముఖవర్చస్సులబట్టి వారు గంధర్వులభాతి యగపడుచుందురు. ఆ వీచుచున్న మలయశైలమందమారుతానికి ఒడ్డున పిల్లఅలలు లేస్తూ తీరాన్ని ముద్దుబెట్టుకుని తిరిగి పోతూవుంటాయి. సమీపాన్నే జామదగ్న్యాశ్రమముండును. ఆశ్రమాభిముఖంగా ఓశీతలతరువుక్రింద జామదగ్ని పులితోలుపైన కూర్చునియుండును. దగ్గరగా కొమరులు నిల్చొని యుందురు. అనతిదూరాన్నే రేణుక యొకరాతిబండప్రక్కన కూర్చుని గిన్నె కడుగుచుండును.]

జామదగ్ని

(కంపితకంఠస్వరంతో) ఇదీ, నా ఆజ్ఞ...కోపానలంలో దహించుకుపోతూ యిచ్చిన నాఆజ్ఞ యిదీ. కనక, కోపోపశమనంకై యిచ్చిన నాయీయాజ్ఞను మీరు శిరసావహించి తీరాలి. ముమ్మాటికీ శిరసావహించాలి. లేకపోతే - ఆపర్యవసానం మీకే తెలుస్తుంది.

(ఎవరూమాట్లాడరు.)

జామదగ్ని

(కోపంతో) ఏవరూ మాట్లాడరుకదూ! ఎప్పుడూ లేని తిరస్కారభావం!...అవును. మాతకదా ఆనే హృద్బాధ. తమ్ము పెంచి పెద్దగాజేసిన తల్లిగదా అని ...ఒకప్పుడు తాము తప్పటడుగులు వేసుకుంటూ నదీతీరానికి సాయంసమయాలప్పుడు ఆడుకుందుకు వెళ్ళిపోయినప్పుడు ప్రేమాతిశయంవల్ల హృదయం కొట్టుకోవడంనుంచి వెతుక్కుంటూ ఆనదీతీరానికి చేరుకుని

రెండుచేతుల్లోనూ తీసుకుని తనహృదయానికి హత్తుకొన్న...ఒకప్పుడు, తాము పెంకితనంచేస్తే తన నయనాల్లో కోపాగ్నులు కురిపింప తాము రెండుచేతులూ మెడకు పెనవేసి రొమ్ముమీద శిరస్సు లానుకొని నవ్వుతూండడంనుంచి ఆకోపం అంతా మాయమైపోయి ఆనందబాష్పాలు రాల్చిన ఆ...జనయిత్రి - ఆ మహా పవిత్రదేవత - ఆదివ్యమూర్తి - ఆ తల్లికదా అని. ఆమె వుష్ణరక్తంలో ఖడ్గమును తడుపుటకు...మరి...ఆ రక్తంలో - ఆప్రేమపూరితరక్తంలో - ఆ...ప్రవిమలకీర్తి చంద్రికలు మెఱయు కవోష్ణరక్తంలో...మరి... మనసెందుకు ఒప్పుతుంది? ఒప్పదు. ఎన్నడూ ఒప్పదు. ఆమె విశాలహృదయకుహరంలో ప్రేమజ్యోతికి స్థానమున్నదని గ్రహించడంనుంచి, మరి-మనసొప్పదు. ఆమెహృదయం పవిత్రమైనది - ప్రేమమయము. అందుచాతనే అటువంటి పనిని - అటువంటి ద్రోహపుపనిని - అటువంటి...మూర్ధమును - మూర్ధమును ఖండించి... (అతనిహృదయం కొట్టుకుంటుంది వేగంగా. శరీరం కంపిస్తూంటుంది. కళ్ళలో నీళ్ళు మెఱుస్తాయి) అవును; బాగాగ్రహించారు. వాళ్ళు—ఆమె హృదయాన్ని బాగా గ్రహించారు. గ్రహించరూ మరి?...ఆమె రక్తంలోంచి—ఆమె పవిత్రరక్తంలోంచి—నిష్కలుష ప్రేమరుచులు మెఱిసే ఆమె వుష్ణరక్తంలోంచి వచ్చినవాళ్ళు గ్రహించరూ మరి...అటువంటప్పుడు - యీ నాయాజ్ఞను - యీ నాకోపానలము విజృంభించడంనుంచి యిచ్చిన యాజ్ఞను - యీ తమ తల్లి శిరస్సును - శిరస్సును...పవిత్రశిరస్సును - ఖండన (అతనికంఠంలో గద్గదిక) అన్యాయంగా ఖండన. ఛీ!- ఘోరపాపము. ఆమె హృదయము నిర్మలము. ఇటువంటి ఘోరమైన ఆజ్ఞ దురన్యాయము. తప్పే - నేనిచ్చిన ఆజ్ఞ తప్పే. ముమ్మాటికిని తప్పే. కాదూమరి...ఆమె- ఆ పవిత్రమూర్తి - ఆ, వారి మాతృదేవత - రేణుకకు యిటువంటి శిక్ష కూడదు. ఆమెను కళంకపరచినందులకు తిరిగి నాపైనే శిక్ష...(కొంతయోచించి) ఆఁ!- ఆఁ!- వెనుదిరుగుతున్నాను. ఆజ్ఞాపించిన శిక్షను తొలగిస్తున్నాను. నాహృదయంలో ప్రేమకు జాలికి స్థానమిస్తున్నా. ఇవ్వకూడదు. నాహృదయం శిలాపూరితమవాలి-కర్కశశిలాపూరిత మవాలి. ఆమెవధను నేను, నాయీకండ్లతో జూడాలి. ఈయాజ్ఞకు అడ్డులేదింక ...(పుత్రులవంకతిరిగి)...అదుగో, యింకను యెవరును మాట్లాడరు. తిరస్కారభావమేయిది. ఒక్కడును నా యీ యాజ్ఞను శిరసావహించువారు లేరా?...ఆఁ!- ఆఁ!- పరశురాముడుకూడనా - ఒకప్పుడు నా విషయమై తన కవోష్ణరక్తాన్ని సైతము ధారధారలుగ ప్రవహింపజేసికొనవలసిన నా - పరశురాముడుగూడనా - నా ముద్దుల పరశుడుగూడనా.

(ఇంతలో పరశురాముడు తండ్రిదగ్గరకు వచ్చును. పచ్చటిరంగుగల శరీరము. పుష్టిగలవాడు. విశాలనేత్రములు. విస్ఫారితకపోలములు. చెవులకు కుండలములు వ్రేలాడుచుండును. జడలుగలజుట్టు. బాలతాపసిలాగున అగపడుతాడు. కుడిభుజముపై నొక పరశువుండును. తండ్రిగారికి నమస్కరించును.)

పరశురాముడు

ఇదుగో, మీరు ఆజ్ఞాపించిన ప్రకారం నేను వెడుతున్నా. వెళ్ళి, మీహృదయానికి శాంతిని చేకూరుస్తా. మీకు కోపోపశమనము గావిస్తా. మీకళ్ళకు పర్వముగ ఉండేట్టు-ఆ, నా మాతృమూర్తిని - ఆదివ్యదేవతను - ఆ స్త్రీరత్నమును, క్షణంలోపోయి శిక్షిస్తా. ఈపరశువును - యీ తళతళామెఱిసే - యీ, చాలాకాలంనుంచి ఉడుకురక్తంలో స్నానంచేయని పరశువును - కళంకభూయిష్ఠమని మీకుతోచిన యామూర్తియొక్క రక్తధారల్లో తడుపుతా. అప్పుడూ మీకు హృదయశాంతి...

జామదగ్ని

తరువాత - ఆతుచ్ఛజీవులను...ఆ భీరులగు నీ సోదరులను వరుసగా...

పరశురాముడు

సెలవుతీసుకుంటూ. (తనలో) వరుసగా - అబ్బ! మాతృమూర్తి మూర్ధమును - మూర్ధమును యీ పరశువు

చేత ఖండించి, తరువాత - అన్నదమ్ములను...అప్పుడుట తనకు మనశ్శాంతి...

(మెల్లగాపోయి రేణుకను సమీపిస్తాడు. దగ్గరగా నుంచుని కన్నీరు కారుస్తాడు. నోటమాటరాదు. హృదయం కొట్టుకుంటుంది. శరీరం ఆపాదమస్తకం కంపిస్తూంటుంది. భుజంమీద నున్న పరశువు క్రిందపడి పోతుంది. వెళ్ళి 'తల్లీ' అంటూ ఆమె పాదాలమీద పడిపోయి భోరున ఏడుస్తాడు.

రేణుక

(ఆతురతతో) ఏంనాయనా? ఏం! ఏవొచ్చింది. ఎందుకిలా ఏడుస్తున్నావు. కారణంచెప్పు. మరేం భయంలేదులే. నాన్నగారేమేనా అన్నారా? నేనడుగుతానులే. చెప్పు.అలా కన్నీరు కారుస్తావెందుకు?(చిన్నపిల్లడులాగున బుజ్జగిస్తుంది.)

పరశురాముడు

(మాట్లాడబోతాడు కాని నోరాడదు. వెక్కివెక్కి ఏడుస్తూంటాడు. దుఃఖం ఆపుకోలేక ఆమె వొళ్ళో తలదాచుకొని ఏడుస్తాడు.)

రేణుక

ఫరవాలేదులే. చెప్పు. నీకేమైనా ఆపదవస్తే నేనడ్డుపడతాను. నాప్రాణాణ్ణి అర్పిస్తాను...చెప్పు.భయంలేదులే.

పరశురాముడు

(గొంతు సవరించుకొని) తండ్రిగారి యాజ్ఞ!... కోపాగ్నిలో దహించుకుపోతూ యిచ్చిన తండ్రిగారి యాజ్ఞ !...వింటే హృదయాన్ని కలతపెడుతుంది చెప్పను - చెప్పలేను.

రేణుక

(ఉత్కర్షతో) ఏవిటీ! ఆజ్ఞా?...ఏమని?—ఏవరిని? చెప్పు - భయంలేదు. నేనువహిస్తా నాశిక్షను. ఏడవకుండా చెప్పు (ఓదారుస్తుంది)

పరశురాముడు

(గద్గదికతో) చెప్పలేను—ఆయాజ్ఞను చెప్పలేను. ...ఆయాజ్ఞప్రకారం నిన్ను శిక్షించాలి...నిన్ను-తప్పుచేసినందుకు కఠినంగా శిక్షించాలి. తండ్రిగారి యాజ్ఞ చొప్పున నిన్ను...పవిత్రమూర్తివైన నిన్ను - ఒకప్పుడు యీపాపిష్ఠజీవి తప్పటడుగులతో నదీతీరానికిపోయి ఇంటపాత్రము లానదీజలంలో పడవేసి, మట్టిలో ఆడుకుంటూన్నప్పుడు మెల్లగావచ్చి యీ చేసిన పాడుపనికి కోపాతిశయంచేత కండ్లెఱ్ఱజేసినప్పుడు రెండుచేతులా మెడకు పెనవేసి కిలకిలా నవ్వడంనుంచి ఆ కోపం అంతా మాయమైపోయి, ఆనందంచేత శిక్షించకుండా ముద్దు పెట్టుకొన్న ఆనిష్కలుషప్రేమహృదయవగు నిన్ను - నిన్ను తప్పుచేసినందులకు తండ్రిగారి యాజ్ఞ ప్రకారం కఠినంగా - కఠినంగా శిక్షించాలి. ఈ మెఱుస్తూన్న - తళతళా మెఱుస్తూన్న నిశితపరశువును - నీ రక్తధారల్లో స్నానమాడించాలి. నిష్కలుషప్రేమ రుచులు మెఱిసే నీరక్తధారల్లో నిర్దాక్షిణ్యంగా హృదయం లేదనుకొని, కాఠిన్యాన్ని వహించి, యీ పరశువుతో నీ పవిత్రశిరాన్ని—పూతపవిత్రశిరాన్నే—ఖండించాలి (గట్టిగా ఏడుస్తాడు) నిర్దయతో ఖండించాలిట. అమ్మా! నేను ఎప్పుడూ అల్లాంటిపని చేయను. అల్లాంటిపనిని చేయ నెప్పుడూ. పవిత్రమూర్తివైన నిన్ను—సకలకష్టాలూపడి, కని, పెంచి పెద్దగాజేసిన నిన్ను ఎప్పుడేనా అలాంటి పరశువును ఎత్తి—ఎత్తి నీ శిరస్సును (ఆతడు తన రెండుచేతుల్లోనూ మొహాన్నిదాచుకుని ఏడుస్తాడు.)

రేణుక

ఏడవకు...తండ్రీ, ఏడవకు. గ్రహించాను నా తప్పును. తప్పుచేసేను గనక శిక్ష. అంచేత నేను అనుభవిస్తా. విచారమొద్దు. అంతేనా. ఒక్కనాకేనా ఆశిక్ష?

పరశురాముడు

అంతేకాదుట—ఒక్క అంతేకాదుట. వరుసగా తరువాత సోదరులందరినీ...(మరి నోటమాటరాదు)

రేణుక

పోనీ, నేను సిద్ధంగా ఉన్నాను. నన్ను శిక్షించు ...నేను అనుభవిస్తాను. కాని; - ఆ నాపుత్రుల్ని-నీ

సోదరులను మాత్రం రక్షించు. ఇదే నాకోరిక మరేమీ వద్దు. నాజీవప్రతిభాస్తమయసమయంలో నిన్ను అడిగే దీఒక్కటే. మనఃపూర్తిగా వేడుకొంటున్నాను.

పరశురాముడు

నేను పుత్రుడిని. నన్ను వేడుకోకూడదు. అయినా యిది తండ్రిగారి యాజ్ఞ. శిరసావహించి తీరాలి. లేకపోతే వీలులేదు. అంచాత, ఆలస్యం అయిపోతూంది. తండ్రిగారికి కోపంవస్తుంది. నిన్ను నేను శిక్షించలేను. ఇదుగో, యీపరశువు - యీ వాడైన పరశువు తీసుకొని, నా శిరస్సును ముందర ఖండించు. తర్వాత - నిన్ను నువ్వు చంపుకో...ఆలస్యం వద్దు...అలాగున చెయ్యవ్వూ?-పోనీ. లేనిధైర్యంతెచ్చుకుంటూ. భగవంతుణ్ణి శక్తినిమ్మంటా. లేకపోతే - ఆలస్యం అవుతే తండ్రిగారికి కోపంవస్తుంది. ఇదుగో ఎత్తుతున్నాను పరశువును —యీ నిశితపరశువును. నీమూర్ధమును ఖండించాలి. శక్తిలేదు. పరశువును ఎత్తలేకున్నాను. పరాత్పరా? శక్తినియ్యి. ఈ ఘోరపాపి తన మాతృదేవియొక్క శిరస్సును ఖరతరపరశువుతో ఖండించడానికి - శక్తిని చేకూర్చు. ఈ మాతృదేవిని - యీ స్త్రీరత్నమును - యీ తల్లిని - అదుగో, అప్పుడే నాహృదయంలో ప్రేమకు స్థానమిస్తున్నా. తప్పు. ఇవ్వకూడదు. (పరశువునెత్తుతాడు) ఆఁ!- ఎత్తాను. శక్తి - శక్తికావాలి... అదుగో, ఆఁ! ఆఁ! - జై, శంకర్! (పరశువుతో ఆమె మెడను కొడ్తాడు. వెంటనే ఎర్రని రక్తధారలు. తనచేతులు రక్తసిక్తమౌతాయి, వికృతంగా కనపడుతుం దారక్తమయమైన ప్రదేశమంతా. చేతులు వణుకుతూంటాయి, పరశువును కొంచెందూరంగా పారేస్తాడు. చేతులమ్మట కారేరక్తాన్ని తుడుచుకుంటూ ఆ ప్రక్కన పడిపోతాడు.)

(కంపితకంఠస్వరంతో) భయాన్ని కలుగజేస్తుందీదృశ్యం! ఉపద్రవమైనభయాన్ని కలుగజేస్తూంది. అవును; మరి—ఘోరపాపినై యీ నా మాతృమూర్తి శిరస్సును ఖండించా. మాతృభక్తిని వదలుకొని నిర్దాక్షిణ్యనిర్గ్రంథనమును జరిపివేశా. అవివేకినై జరిపివేశాను. జరిపితీరాలి. తండ్రిగారియాజ్ఞ కాబట్టి జరిపితీరాలి మహాద్రోహం చేశాను. దీనికి నాపైశిక్ష— అదుగో ఆ తళతళమెఱిసే పరశువే యీరక్తాన్ని చిమ్మించింది. ఆ పరశువే నా హృదయం లోతును కనిపెడుతుంది. ఇదుగో! (పరశువునుతీస్తాడు. రక్తసిక్తమైయుంటుంది. దాన్నిచూసి యించుకభయాన్ని వెలిబుచ్చుతాడు) ఈ పరశువు—నా రక్తధారల్తో తన దాహతృష్ణను తీర్చుకుంటుంది. ఇదుగో! (పరశువునెత్తబోతాడు. ఇంతలో తండ్రి జామదగ్నిపిలుపు వినబడుతుంది. వెనుదిరిగి జూస్తాడు)

అదుగో, తండ్రిగారు పిలుస్తున్నారు. నే చేసిన కృత్యాన్ని చూశారు. అంచాత నాకేదో వరం ప్రసాదిద్దామనికాబోసు పిలుస్తున్నారు. అలాగే కనబడుతూంది. వెళతా. వెళ్ళి, నే నిటువంటి ఘోరకృత్యాన్ని చేసినందుకు నాకు మరణంప్రాప్తించునట్లు వరం యిమ్మంటా. అఁహా-అదికాదు. అలాగవుతే లాభంలేదు. మంచి ఉపాయంతట్టింది. వెళ్ళి, మొదట్ల ఆ, నా సోదరులను శిక్షిస్తా. తర్వాత తండ్రిగారిని—అన్యాయంగా, యీ పరశువుతో యెవరి శిరమునైతే ఖండించానో, నిర్దయుడనై యీ గొడ్డలిని యెవరికవోష్ణరక్తంలో తడిపానో- ఆ, దివ్యదేవిని—నా మాతృమూర్తిని—నా పవిత్రజనయిత్రియైన రేణుకను, నా సోదరులను సజీవులనుగా జేయమని అడుగుతాను. ఇదుగో, యీ స్త్రీరత్నమునయనాల్లో కోమలస్మితరుచులు వెలుగుతున్నాయి. ఈమె వదనంలో వికసితభావాలు వెలయుచున్నాయి. పవిత్రచరిత—పూతపవిత్ర చరిత—అకలుషప్రేమహృదయ. అన్యాయముగా యీశిక్షకు పాలైంది. పాపిష్ఠజీవిని. కఠినకర్కశహృదయుడను. కాకపోతే యీ వికృతకృత్యాన్ని నెరవేర్చడానికీచేతులాడతాయా?

* * *

—చిట్టి సుందరరావు.

# పెళ్లిచెడగొట్టిన అవధాని

## ౧

అత్తా ఆడబిడ్డలపోరుకంటే ఎక్కువైంది నాకు అవధాన్లపోరు; సిగరెట్టు ముట్టించనీడు; కాఫీదేవాలయంలో అడుగుపెట్టనీడు; క్రాపింగు గొరిగించేసుకోమని రోజూలెక్చర్లే. ఒకనాడు కాలేజికి సూటువేసికొని వెళ్లేను. ఇంగ్లీషుక్లాసు అయిపోగానే అవధాని నా దగ్గరకు వచ్చి 'ఏందుకబ్బాయీ! ఇవ్వాళ ఇల్లాగు తయారయ్యావూ?' అన్నాడు.

'ఏదోకాస్త కులాసాపుట్టిందిరా' అన్నాను.

'నీముఖంకులాసా! వెంటనే ఇంటికిపోయి ఈ వేషంమార్చి శుభ్రమైన ధోవతి కట్టుకరా పో' అని నెట్టేడు.

ఇంటికి పోయిందాకా పీకతింటాడని నాకు తెలుసు. ఐనా 'ఇంటివద్ద ధోవతులు లేవురా. అన్నీ చాకలాడికి వేశా మొన్న' అని ఒక పుల్ల అడ్డంవేశా.

'ధోవతి లేకపోతే అంగవస్త్రం ఒకటి కట్టుకరా పో'

'అందరూ నవ్వరుట్రా!'

'ఇప్పుడు నవ్వడంలేదుటోయ్, నల్లదొరా!'

ఏంచెయ్యను! మళ్ళీ నోరెత్తకుండా ఇంటికి దారి తీశా. ఆనాడు స్కూలుకువచ్చి ఎగగొట్టి పోయినందుకు రూపాయి జరిమానా వేశారు. ఇచ్చుకోక తప్పిందికాదు. 'డబ్బుపోతే పోయింది. చదువురాకపోతే నష్టంలేదు. నీ మతంమాత్రం జాగ్రత్తగా కాపాడుకో' అని అవధాన్లు సమాధానంచెప్పేడు.

ఈ విధంగా నాస్నేహితుడు నన్ను చంపుకు తింటున్నాడు తన అధికారమంతా నామీద చలాయించుకుంటూ. ఏమికారణమో తెలీదుగాని నేనతన్ని ఎదిరించలేకుండా వున్నాను.

రోజూ స్కూల్లో బైబిల్ టీచరుకూ మావాడికీ హోరాహోరి పోరాటం జరుగుతూంటుంది. ఆయనంటాడుగదా: 'మా యేసుక్రీస్తేనయ్యా, ప్రపంచానికంతకూ మోక్షమివ్వగల జగద్గురువు' అని. దానితో అవధానికి వొళ్లు మండిపోయి 'అది సర్వాబద్ధం. అల్లాగైతే మీ యేసుక్రీస్తుకు మోక్షమిచ్చి నాయన ఎవరు?' అని అడ్డుప్రశ్న వేస్తాడు. ఇక వాళ్ళిద్దరకూ గంటకొట్టేవరకూ వాగ్యుద్ధం; మాకందరకూ వింటానికి బహు తమాషాగా వుండేది.

మొత్తంమీద మావాణ్ణిగురించి నేను చెప్పదలచిందేమంటే; అతడు సనాతనహిందూమతావలంబి. మిగిలిన మతాలన్నీ చిల్లరవని అతని వాదన. తన వుద్దేశాలను ఎవరూ ఖండించరాదు. ముఖ్యంగా తాను హిందూ మతోద్ధరణకు పుట్టినట్లు భావించుకుంటాడు.

నేను హిందూమతానికి చెందినా, నా మతాన్ని గురించి నా కంత 'కన్సర్వేటివ్' అభిప్రాయాలు లేవు. నా కసలు ఏమతంలోనూ నమ్మకంలేదు. మతమంటే మనదగ్గర్నుంచి సత్యస్వరూపం దగ్గరకు వేయబడ్డ రోడ్డు. ఈ మతాలన్నీ అనేక రాస్తాలు. అవన్నీ నిజంగా ఆ సత్యస్వరూపం దగ్గరకు దారి తీస్తాయో, లేక యే గోతిలోనైనా దింపుతాయో మనకు తెలీదు. "మనకు తెలియకపోతేనేం; ఆయా మతస్థాపకుల అనుభవమే మనకు నిదర్శనం" అంటారు. కాని ఆ మతస్థాపకులైనా సత్యాన్ని పూర్తిగా గుర్తెరింగిన వారేనా? అని నా ప్రశ్న. వాళ్ళు పూర్తి

గా పరమావధిని చేరుకున్న వాళ్లయితే వారిచే స్థాపించబడిన మతమే ప్రపంచాన్నంతా తన పిడికిలిలోకి తీసికునేది. అలా కాకుండా ఇన్నిమతాలు ప్రపంచంలో ప్రబలిపోయిన కారణంచేతనే ఏ మతమూకూడా సత్యస్వరూపానికి దారికాదని తేలుతున్నది. వీటన్నిటినీ మించి సర్వోత్కృష్టమైన ఒక్కటే మతానికి మనమందరమూ చెందియున్నాము. ఇప్పటికీ భిన్నమతస్థులమైనా మనందరకూ ఆ సత్యమే పరమావధి. అందుచేత ఏనాటికైనా భిన్నాభిప్రాయాలు నశించి ప్రపంచమంతా ఒక్కటే జెండా క్రింద ఏకము కాగలదని నాకు పూర్తి నమ్మకంవుంది. కనుక నా కీబాహ్యాచారాల మీద నమ్మకంలేదు. అస్పృశ్యత నమ్మను. మతాంతరులతో సంబంధము నా కిష్టమే. అందుచేతనే క్రీస్తు మతానికి చెందిన సుందరంగారి కూతురు మీదికి నా మనస్సు పోయింది.

## ౨

కళ్యాణీబాయి మాతోకూడా మొన్న బి.ఏ. పరీక్షకు కూర్చున్నది. ఆమె నిజంగా చాల అందగత్తె. ఆసౌందర్యాన్ని మాటల్లో ఇముడ్చటం చాల కష్టం. ఆమె కన్నులు విశాలంగావుండి చెవులకేసి పరుగెత్తుతూంటవనీ, జడ పొడుగ్గా నల్లత్రాచువలె వ్రేలాడుతూ పిరుదులమీద నాట్యం చేస్తూంటుందనీ, ఉన్నతవక్షోభాగం సన్ననినడుముమీద మనోహరంగా ఆధారపడి వుంటుందనీ, పెదవులు దొండపడువలె ఎర్రగా చూస్తే ముద్దెట్టుకోవాలనిపిస్తుందనీ నేను చెప్పుతే మీరు విని గుటకలు మింగేకంటే ఒక్కసారి మీరు మా వూరువచ్చి ఆ దేవతాసందర్శనం చేసికొనిపోతే తీర్థయాత్రాఫలం గలుగుతుంది. ఆమె క్లాసులో చంద్రబింబం లాగా వెల్తురు చిమ్మేస్తుండేది. నా కండ్లెప్పుడూ అటుకేసేవుండేవి, చెప్పొద్దూ. టీచరు పాఠాలు చెపుతూవున్నప్పుడు ఆమె టేబిల్ మీదికి వంగికూర్చుని నోట్సు వ్రాసుకుంటూంటే అప్పుడప్పుడు పైట జారిపోతూవుండేది.మళ్ళీ సర్దుకుంటూ వుండేది.

ఆ అమ్మాయిని పెండ్లి చేసుకుందామని నాకెంతైనా కులాసాగావుంది. ఎందుచేతనంటే —చదువుకున్నపిల్ల; మంచి అందంగలది. ఏ ఎడ్డె దాన్నో కట్టుకుంటే జీవితమాధుర్యమేమి ఆస్వాదించగలం?.

ఈ ఉద్దేశంతోనే అనేకసార్లు కళ్యాణితో మాటలు కదిపేను. పుస్తకమనీ, అదనీ వంకెట్టుకుని వాళ్ళింటికి చాలసార్లు పోయ్యాను. సుందరంగారు కూడా చాల వరకు పరిచయమయ్యారు.

ఆనాడు సాయంత్రం సుందరంగారింటికి పోయి రెండుమూడుగంటలు కులాసాగా గడిపి వద్దామని 'ప్లాను' వేశాను. అందుకోసం బాగా ముస్తాబవాలిద్గా!. మొదటిపని: 'సేఫ్టీ రేజరు' తెచ్చి సబ్బురాసి గడ్డం చేసుకోవడం మొదలు పెట్టేను. కుడివేపు పని పూర్తి అయింది. ఇంతలో తలెత్తి చూద్దును గదా! ఎదురుగా నిలబడివున్నాడు వినాయకుడులాగా మా అవధాన్లు. నా గుండెల్లో రాయి పడ్డది. చేతులో 'రేజరు'లాక్కున్నాడంటే ఈ సగం గొరిగిన గడ్డంతో నలుగురులోకి పోయే ఇది వుండదు. నన్ను చూచే చూడ్డంతోనే అందుకున్నాడు:

'ఎక్కడ పుట్టేర్రా మీ వెధవలంతా? గొరుక్కోవడానికి వేళాపాళాలేదు; అమావాస్యగానీ, భోజనాత్పరంగానీ, రాత్రిగానీ...'

'అదికాదు, అవధానీ! నీవేచెప్పేవుగా ఒకసారి నాకు: నటకులకూ, జైల్లోనుంచి

వచ్చిన వాళ్ళకూ క్షవరవిషయంలో తిథుల పట్టింపువుండదని. 'అలాగే నిరుద్యోగులు ఉద్యోగంనిమిత్తం పైయధికారులను చూడ బోయేటప్పుడుకూడా క్షవరానికి ముహూర్తం వెతుక్కోనక్కరలేదు' అనే 'ఎమెండుమెంటు' పెట్టుదామనుకున్నా. అది నీ వంగీకరింపకపోవని తలచాను.'

'వెధవ 'ఎమెండుమెంటు' లన్నీ పనికిరావోయి నాయనా !'

'ఎల్లాగు చెప్పమరి. మా బామ్మ నాకు పెండ్లి చేసేయాలని పట్టుపట్టింది. ఇక ఆగేటందుకు వీల్లేదుట. నా ప్రవర్తనవిషయంలో ఆమె కేదో అనుమానం తోచినట్లుంది. ఆ ముసలిదానిపట్టు ఎల్లాంటిదో నీవు ఎరుగుదువుకదా. ఏ పిల్లనో తెచ్చి మెడకు కట్టేస్తుంది. ఆ అమ్మగారు కాపురానికి వచ్చేలోపుగా ఏదైనా వుద్యోగంలోవుంటే మర్యాద దక్కుతుంది కాని లేకపోతే భార్యకుకూడా చులకనై పోవాలసి వస్తుంది. ఎరుగుదువుగదా సుమతీశతకంలో కందం : 'గడనగల మగనిజూచిన. . .'.

'అయితే ఇప్పుడు నీకు ఉద్యోగం ఎవరిస్తానంటున్నారోయ్, పిచ్చినాన్నా'

'ఉండు, మరి. చెప్పనీ; దొరగారి పుగాకు కంపెనీలో ఏదోఖాళీ వుందని తెలిసింది. ఆయనగారిని చూడబోతున్నా నిప్పుడు. మా సినగడ్డంతో పోతే—అందులో దొరదగ్గరకు—బావుంటుందా చెప్పు? అందుకనే నేనే తంటాలు పడుతున్నా రేజరుతో.'

'హరహరా! బి. ఏ చదివి పుగాకుకంపెనీలో పనిచేయడమా చివరకు.'

'అది నాకంత గౌరవహానిగా తోచడం లేదుకాని ఒక్క అనుమానంవుంది. ఏమంటే, బ్రాహ్మణులకు పుగాకు నిషేధవస్తువుగదా! ఆ ఆఫీసులో నాకు పనిదొరికితే ఎప్పుడూ ఘాటుగల ఆ వాసనలోనే వుండవలసి వస్తుంది. కనుక మన మతవిషయికంగా ఈ వుద్యోగం స్వీకరించడమా? వూరు కోవడమా? అని. ఆ సమస్య నీవే తీర్చాలి'.

'వాసనే గనుక పరవాలేదులే. శాస్త్రిగార్లూ, పండితులూ నశ్యరూపేణా పుగాకును ఆస్వాదిస్తూనే వుంటారు. సరే, దొరదగ్గరకు వెళ్ళిరా. నేనుపోతా. ఇకనెప్పుడూ మాత్రం అకాలంలో క్షవరం చేసికోకు. ఇంకోసంగతి: ఒకవేళ పుగాకుకంపెనీలో వుద్యోగం దొరకినట్లాయన అవకాశం దొరికిందిగదా అనీ, సిగరెట్టు ఖర్చులేకుండా పోతుందనీ, అక్కడ తేరగా పడుండే పుగాకును చుట్టలు చుట్టి తగలేయకు సుమా'.

'ఎబ్బే. లేదు, లేదు'.

వినాయకావధాని వెళ్ళిపొయ్యాడు, అధునిక పద్ధతులమీద నాముస్తాబు తయారైంది.

సుందరంగారుఊళ్ళో పేరుపడ్డ డాక్టరు. ధనాశ ఎక్కువగా లేనందుచేత బీదలకుకూడా అందుబాటులో వుంటాడు. అందరకు మల్లే తలనొప్పికి కూడా 'ఇంజక్షన్లు' చేయడు కనుక 'ప్రాక్టీసు' జాస్తిగావుంది; మంచి పలుకబడీ వుంది.

నేను వాళ్ళింటిముందుకు పోయే సరికి హాల్లో కూర్చునియున్న తండ్రీ, కూతురూ నా దృక్పథంలో పడ్డారు. 'హాలో కమాన్' అంటూ సుందరంగారు ఆహ్వానించారు. కళ్యాణిసహజమందస్మితంచేత గౌరవింపబడ్డాను.

తిన్నగా బూటుకాళ్ళతో గచ్చు నేలమీద టకటకా చప్పుడు చేసుకుంటూ సరాసరి హాల్లోకిపోయి ఒకకుర్చీ కళ్యాణికి దగ్గరసాలాక్కుని కూర్చున్నాను. కొంతసేపటివరకూ

మా సంభాషణ మొన్న మొన్ననే ముగిసిన పరీక్షలను గురించి జరిగింది. తరువాత సుందరంగారు కళ్యాణియొక్క భావిపరిస్థితులను గూర్చి కొంచెంగా ముచ్చటించారు. ఎం. ఏ క్లాసు చదివించడమా, లేక యే 'ప్రొబేషనరీ డిప్యూటీ ఇన్స్పెక్ట్రెస్ ఆఫ్ గరల్సు రేంజి' వుద్యోగానికైనా ప్రయత్నించడమా అని ఆలోచించారు. నేను మాత్రం కళ్యాణిని ఏ వుద్యోగంలోనూ ప్రవేశపెట్టకండని సలహా యిచ్చాను. ఎందుచేతనంటే వుద్యోగవిషయమైన లాయిలాసాలకు శిరీషకుసుమకోమలమైన ఆమె శరీరం తగింది కాదన్నాను.

ఇంతలో కళ్యాణి 'టీ' తో నింపబడిన ఒక కప్పు, సాసర్ నాముందు పెట్టింది. అప్పు డామె ముంజేతిమీది గాజులు కొద్దిగా చప్పుడు చేసినై. ఆ ధ్వని నా హృదయంలో తీయని సంగీతంగా మార్మ్రోగింది.

'టీ' రెండుమూడు గ్రుక్కలు త్రాగి తలెత్తి చూద్దునుగదా! ఎవరో ఒక ముసలాయన తలగుడ్డ చుట్టుకుని తిన్నగా లోపలకు వచ్చేస్తున్నాడు. వచ్చి సుందరంగారికి ఒక సలాంపారేశి, టేబిల్ దగ్గర కుర్చీలో కూలబడ్డాడు. ఇంతసేపునుంచీ సోఫాలో పడుకుని వున్న సుందరంగారు లేచి కూర్చున్నారు. నూతనపురుషుడు ఒక్కసారి నాకేసి తీక్ష్ణంగా చూచి, డాక్టరుగారికేసి తిరిగి 'అయ్యా! నాపేరు ఏకదంతశర్మ; మీ దర్శనానికే వచ్చాను; శుద్ధి యుద్యమంలో పనిచేస్తూంటాను' అన్నాడు.

సుందరంగారు ఆయనకేసి కొంచెం పరీక్షిస్తున్నట్లుగా అవలోకించి: 'శుద్ధి యుద్యమమా! ఔను విన్నాను. ఈ మధ్య తద్విషయికములైన వ్యాసాలు కొన్ని పత్రికల్లో చదివేను. ఒకాయన 'శుద్ధియుద్యమతత్వము' అనే శీర్షికక్రింద కొన్ని వ్యాసాలు రాస్తూ ఒకదానిలో 'స్త్రీల ఆకర్షణ' అనే ఉపశీర్షిక తగిలించి, క్రీస్తుమిషనరీలు క్రైస్తవ స్త్రీలను ప్రచారకురాండ్రుగ తయారుచేసి పురుషులను ఆకర్షిస్తున్నారని వ్రాశారు. ఆధారములేని అట్టివ్రాతతో క్రైస్తవస్త్రీల సౌశీల్యానికి కళంక మాపాదించారు' 'ఎవరో బాధ్యతలేని వాళ్ళవ్రాతలకు మేము సమాధానం చెప్పుకో నవసరంలేదు. కాని ఈ మిషనరీలు హిందూసంఘానికి పెద్ద అపకారం చేస్తున్నా రన్నమాట ఒప్పుకుని తీరాలి'.

'ఎందుచేతనండీ బాబూ! మీచేత నిరసింపబడి బహిష్కరింపబడిన ఒకజాతిని ఉద్ధరించారనా?'

'ఉద్ధరించలేదు. మతభ్రష్టులనుచేసి మోక్షానికి దూరంగా చేశారు.'

'బాగా ఆలోచించండి! మీమతం విడిచి క్రైస్తవమతంలో చేరినవాళ్ళు చాలమంది మీచేత పంచములూ, ఛండాలురూ అని పిలుపబడినవాళ్ళు. వాళ్ళు మీ మతంలో వుండి ఏమిసుఖం అనుభవించారు? వాళ్ళను మీరు కుక్కలూ, పందులూ మొదలైన నీచ జంతువులకంటే అసహ్యంగా చూచారు. అంటరానివాళ్ళని ఇరుగు పొరుగునుంచి తోలేశారు. వాళ్ళ అభివృద్ధికి మీరేమీ పాటుపడ్డట్లు లేనేలేదు. వాళ్ళకని మీరేర్పరచిన పాఠశాలలేమీ లేవు. మీ మతరహస్యాలు వాళ్ళు తెలుసుకోగలిగినంత బుద్ధివికాసం కలుగజేయలేదు. పైగా మీ మతగ్రంథాలు వాళ్ళు వినకూడదనికూడా శాసించారు. ఈవిధంగా మీచేత నిరసింపబడి ఊరిచివర గుడిసెలువేసుకుని అర్థాన్నంతో మలమల మాడుతూ రోదిస్తున్నారు. ఎప్పుడైనా మీ ఎంగిలికూటికికూడా ఆసించి మీయిండ్ల

ముంగలికివస్తే 'ఛీ, అవతలకుపొండ'ని తరిమేస్తున్నారు. దైన్యమావరించిన ముఖాలతో, డొక్కల కంటుకుపోయిన పొట్టలతో మాలగూడేల్లోవున్న వీళ్ళవద్దకు పోయి, 'మీరంతా అధైర్యపడి నిరాశపడొద్దు. రండి; మా యేసుక్రీస్తు మిమ్మల్ని రక్షిస్తాడు' అని చేతులుచాచి పిలిచారు మిషనరీలు. వాళ్ళ కోఅకు కాలేజీలుపెట్టరు; ఆసుపత్రులు నిర్మించారు. ముక్తికి ఆధారమైన భుక్తి కల్పించారు. నేడు అనేకమంది పంచములు విద్యాధికులై వున్నారంటే అదంతా మిషనరీల ప్రసాదం.'

'అంత విలువగల మానవసేవ చేశారంటే ఉత్కృష్టమైన పని. కాని అది వాళ్ళను మత భ్రష్టులను చేయకుండా సాగించవలసింది'

'హిందూమతంలో వుండిమాత్రం వాళ్ళు ఆధ్యాత్మికాభివృద్ధి ఏమి పొందగలుగుతారు? మీ దేవాలయాల్లోకి వాళ్ళను రానీయక పోయింతర్వాత; మీ మతగ్రంథాలు వాళ్ళు వినగూడనప్పుడు.'

'..............'

'అదీ కాక—ఇప్పుడు మీరు మంత్ర జలంతో శుద్ధిచేసి ఈ క్రైస్తవులను మీ ఆర్యసమాజంలోకదా కలుపుకుంటారు? అందుకు అంగీకారంలేని సనాతనులు వాళ్ళకు 'సంకరజాతి' అనే పేరుపెట్టి, ఆరోకులం వొకటి కల్పిస్తారు. మీరు తలపెట్టిన ఉద్యమం మంచిదికాదనను. కాని అది కొనసాగాలంటే మీ ప్రతిహిందువుడూ తనతోడ్పాటు ఇవ్వాలి. ఆర్య, బ్రహ్మమొదలైన సమాజాలతో హిందూమతం ఛిన్నాభిన్నమై పోతూవుంటే ఈ శుద్ధియుద్యమం మీకు మరీ చెరుపుతెస్తుంది. కనుక ముందుగా మీలో మీకున్న ద్వేషాలు, కక్షలూ మానేసికుని ఒకటే పంథామీద నిలబడివున్నప్పుడు మీ శుద్ధి యుద్యమము ఉన్నతాదర్శాలతో సాగించండి'

ఈ మాటలతో ఆ ముసలాయనకు కోపం వచ్చినట్లుంది, ఏదో మాట్లాడబొయ్యాడు గాని మళ్ళీ శాంతంవహించి ఎందుకో మీసం కుడిప్రక్క సవిరించుకున్నాడు. నాకు అనుమానం వేసింది; అది అతికించుకున్న మీసం లాగుందే!

ఏకదంతశర్మగారు సుందరంగారి దగ్గర సెలవుతీసికుని వెళ్ళిపోయాడు. నాకు కలిగిన అనుమానంచేత ఆయనెవరో తెలుసుకుందామనుకుని నేనూ బైటకువచ్చేశాను, చిరునవ్వుతో కళ్యాణిని సెలవడిగి,

రోడ్డు మలుపు తిరగ్గానే ఆయన్ను కలుసుకున్నాను. నాకు చిరపరిచితుడువలె నా భుజముమీద చెయివేసి 'సుందరంగారు మంచి గట్టివాడు సుమా!' అన్నాడు.

'ఆయనకూతురుఖమాత్రం పనసతొనలాంటిది మీరు చూచారుగా' అని నేనన్నాను.

'ఓహో, ఆ పనసతొన కోసమేగా నీ వక్కడికి వచ్చిందీ, నాకుతెలుసునులే మీ లాంటి వెధవన్నల వుద్దేశాలూ. వుగాకుదారదగ్గరకు పోతా నన్నావుగదూ' అంటూ తలగుడ్డ తీసేసి మీసం వూడబెరికేశాడు. మా అవధాన్లే నా ముందు నిలబడివున్నాడు. ఇంటికి వచ్చింతర్వాత సంగతంతా మా బామ్మతో చెప్పి ఆమెచేత చివాట్లు వేయించాడు; తానూ ఒకపెద్ద 'లెక్చ్చె' రిచ్చేశాడు.

నాటినుంచి ఇప్పటివరకూ మళ్ళీ సుందరంగారింటికి ఎప్పుడు సందుదొరికితేపోతానో అని కాపలా కాస్తునేవున్నాడు, పడుచుభార్యను అనుమానగ్రస్తుడైన ముసలాడువలె.

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.ఏ.

# దోమ తెర వచ్చిన నాటి రాత్రి

ఈ ముప్పంతా నాకు తెచ్చిపెట్టిన పెద్ద మనిషి, మా యింటెదరాయన-సుబ్బారావు. నిజంగా చెబుతున్నాను. నేను ఏ పాపం ఎరగ నంటే నమ్మండి. అలా అంటే ఎలా కుదురుతుంది. ఆశే పాపంకదూ! ఆశతో కోరికలు అతిశయించుతాయి. కోరిక కొనవేర్చుకోటానికి కోటిపాట్లు పడాలి. సదరు కార్యక్రమంలో కావలసినంత పాపం మూటకట్టాలి. దానివల్ల వచ్చేఫలితాన్ని యింకొకరెలా అనుభవిస్తారూ? 'కట్టి కుడుపక విడచుచే, కర్మఫలము' అని కాదండీ, పెద్దలవాక్యము?

దోమతెర ఉంటేనేకాని, నిద్రపట్టదూ! దోమలబాధంటారామరి! మనపూర్వులు కళ్లు చిల్లులు పడేట్టుగా, ఏదో యింత పొగరాజి, తలుపులు, కిటికీలు గట్టిగా మూతేసి, ఒక్క క్షణం తర్వాత తెరిచేసరికి, ఎక్కడ జంతువు లక్కడే బిగుసుకు పోయేవి, వడిలిపోయి.

పోని ఏదో కోరికఉందనండి. యింకెందుకు దాగుడుమూతాలు. ఉత్పత్తిలోనే ఫలాన్నిచ్చేదా అనుకున్నా. ఆ మొనగాడు పట్టుకొచ్చి నా ముందర పడేశాడు గభీల్న. నేనే కాదు, మాయింట జనంఅంతా ఒక్కసారే మురిసిపోయాము.

సన్యాసిపెళ్ళికి జుట్టుదగ్గరనుంచి ఎరువేకా! తెర దొరికింది. అమర్చడానికి పందిరో? అంతవరకూ వచ్చేస్తే వ్యవహారం మిగిలింది ఆగుతుందా? మొత్తంమీద నాటి సాయంకాలం 6 కొట్టేసరికి మా యింట్లో దోమతెరతో కూర్పబడ్డ ఓ మంచం తయారైంది. అసమర్థుణ్ణేకాని, ఆ పందిట్లో లోనికి ఆనేట్టు అథమం అయిదేనా 'వెల్ట్రీ' బలుబులు అతికించాలని ఉండేది, పిల్లలాడుకొనే పాలవెల్లికి లోపల పాదరసపుబుడ్లు వ్రేలాడ తీసినట్టు! ఆ విషయమే మా మొనగాడు నొక్కినొక్కి చెప్పాడు కూడాను. అయినా ఏం చెయ్యను? అంతటి దాత సలహానికూడా త్రోసి రాజన వలసివచ్చినందుకూ చాలా విచారించాము మా యావత్తు జనమున్నూ కూడాను.

* * *

వంటకూడా పెందలకాడే అయిపోయింది. కుర్రాళ్ళు హడావిడిగా పరుగెత్తుతున్నారు, నా ఆజ్ఞకోసం. వాళ్ళతో చెప్పేశానుక దూమరి, నాశెలవులేకుండా, నా మంచంమీదకు ఎక్కడానికి వీల్లేదని, (నా పిల్లలే కదూ మరి! నామాట తీసెయ్యరు).

* * *

'అన్యథాచింతితంకార్యం దైవమన్యత్ర చింతయేత్'. కాలభేదంవల్ల, కడుపులో చల్లబడేసరికి గజ్జెలతల్లి నెత్తెక్కి తాండవించడం మనవిషయంలో రిజిస్టర్డు. పైగా ఆవేళ, నా తాలూకు 'స్పెషలు ఎంగేజిమెంట్సు' కూడా ఉందాండి! ఎంత ఉబలాటపడితేనేం, కక్కుర్తైనా తీరకుండా, కావలసినన్ని భంగాలు.

ఈ పెద్దమనుష్యులనేవాళ్ళు, ఒక్కొక్కప్పుడు యమదూతలు సుమండీ!. ఎలాగో రెండు మెతుకులు కొరికి చెయ్యికడిగి తుడుచుకుంటున్నాను. అప్పుడే తయారు అరుగుమీద మామేళం. అక్కడికీ, సంతోషిస్తారుగదా అని 'మా తెర చూశారూ!' అన్నా లోపల సంతోషాని, పైకి, ఓ పాతికమాత్రమే ప్రకటిస్తూ. వాళ్ళు నా ఆనందాన్ని ధ్వంసంచెయ్య

టానికి వచ్చేరు కాని, దాన్ని గుణించడానికి దయచేశారు కనుకనా.

* * *

బ్రిడ్జిఆటలో చాలా బిజీగా ఉండి పోయాను. లోపల ఆవిడ పనులన్నీ చక్కబెట్టుకొనో, మరి రేపటి కోతోపుల్తోసో, చంటాణ్ణి పక్కనేసుకుని—ఆవిడకి నా ఆజ్ఞతో పనేముంది? మనమే హోముడిపార్టుమెంటుకు ఒబీడియంట్ సర్వెంట్సు మైతే—నా అనుభవం నిమిత్తం ఏర్పరుపబడ్డ ఆ వస్తువును అనగా సదరుమంచం వగైరాలను, అవకాశాన్ని దొరకబుచ్చుకోని, అధీనంలోకి తెచ్చుకుంది. ఆ ఆనందంలో కామోసు, నే త్రాలతలువుల్ని గడియ వేసేసింది: పగలంతా వంచినసడ్డి ఎత్తకుండా చాకిరీ చేయటంచేత కాబోలు పిలిచినా పలకని మొద్దునిద్రలో మునిగిపోయింది. ఇవ్వన్నీ తలుచుకుంటూ, నేను అసూయాపరుణ్ణి అయితేమాత్రం, ఆవిడ కేమి భయం? నాగోల మిగిలిన వాళ్ళకి ఎట్లా ఎరుక. 'ఈ సమయంలో ఆచంటాడు లేవకుండఘా, ఏదో వంకతో లోపలికి పో వచ్చును,' అనుకుంటూ ఉండగానే, భగవంతుడు ఉన్నాడన్నట్టు, మాశాస్త్రుల్లు స్థాయి హెచ్చిస్తూ శారుమన్నాడు: ఇంక వెనకా ముందూ ఆలోచించా లేదు, చూడా లేదు. రివ్వున రామబాణంలాగా లోనికి జారాను కాదంటోయ్ దూకాను. అంతగా బిగ్గరగా పక్కలో పిల్లాడు ఏడుస్తూంటే ఆ తల్లికి మెలకువలేదు. మరి ఎలాగ? కన్నతండ్రి నయాక చూస్తూను, వింటూను, ఊరుకోవడ మెట్లా. ఇంతకీ లోపలకి వెళ్ళాను, ఎవరేమనుకుంటూంటే ఇహ నాకెందుకూ?.

ఆలా వెళ్ళినవాణ్ణి అయి, నేను చేసిన పొరపాటు చూడండి, నాకు జరిగిన...వినండి. —'పిల్లవాడు లేచి గోల పెడుతున్నా, మెలకువ లేదూ' అంటూ తట్టి, యిల్లా అన్నాను, అంతే. అమాంతంగా— ఉలికిపాటుట అదిలేచి, 'బాబోయ్, దొంగ, దొంగ! అని రంకెలు మొదలెట్టిందండీ? 'నేనే, నేను, నేనోయ్, ఏయ్, నేనే అంటూంటే' అని ఎన్ని నేనులు అంటున్నా సరే, వినిపించుకో వద్దండీ ఆమె. వళ్ళుమండింది. మరిమండదూ. అవతల వాళ్ళు, నేను లోనికివచ్చిన సందర్భం, యింకేమీ ఆలోచనావద్దూ !.........బిలబిల్లాడుతూ అవతలవాళ్ళు చరచరా లోనికి వచ్చేస్తున్నారు, భార్యాభర్తలున్న గదిలోకి రాకుండదనే 'ఎటికెట్టే'నా గమనించకుండా. మహామంటెత్తింది నాకు. అయినా ఆపత్కాలం—వాళ్ళు అప్తులు. అన్నీ అలా సరిపోయాయి. అందుచేత అయ్యవారిమాటలు కట్టబడ్డాయి. ఇంతలోకీ ఆవిడగారు కళ్ళు విప్పేరు, నోరుమూశారు. పైటచెంగుతో మొగం కప్పుకొని అదే నవ్వటం ముసిలి ముసిలిగా. యీ అడావిళ్ళో పిల్లలు మిగిలిన వాళ్ళు లేచారు. కోలాహలం... ఫెళఫెళా... వెకిలినవ్వులతో విరగబడిపోతూ, మెల్లిగా జారారు ఎవరిళ్ళకి వారు.

'ఏమిటో మతి చెదిరింది' అంటూ ఆమె నిశ్శబ్దాన్ని భంగం చేసింది.

'పోదూ! తెలివితక్కువ మనిషివి. ప్రపంచజ్ఞానం కొంచమేనా తెలుసుకో వద్దూ ?'

'ప్రపంచజ్ఞానం, నేను బళ్ళోచదువుకొనే రోజుల్లో బోలెడు చెప్పేరు. కాని ఏంలాభం? నిద్రపొయ్యేవాళ్ళూ, చచ్చినవాళ్ళూ సమానం అంటారు ఎంచేతో!.

'పాపం! నయమే. మాటలేనా వచ్చును. నీ ధర్మమాఅంటూ తన్నులు తప్పాయి వచ్చిన

వాళ్ళచేత;.

పకపకా నవ్వాడు మాపెద్దాడు.

'అమ్మాయోయ్! అమ్మే...ఎంచ్చక్కా-నే...బలే దొంగని పట్టుకుంది. చూశావా!

'ఎందుకురా అబ్బాయీ అమ్మా అలా కేకవేసింది, నాన్నయింట్లో నే వుంటేను' అంది మారమణ.

'మీ అమ్మకి పిచ్చెత్తింది' అన్నాను నేను.

'అయితే మనల్ని కరవకుండా, ముందు ఆసుపత్రికి పంపెయ్య నాన్నా!' అన్నాడు పెద్దాడు వికటంగా.

'అమ్మ ఆసుపత్రికి వెడితే మనకి ఇంక అన్నం ఎవరు పెడతారోయ్?.

'నువ్వు వండిపెట్టలేవుటే? పొయ్యి నేను వెలిగిస్తాను!

'మరి చంటాడికి పాలో?'

'అమ్మే యిస్తుంది'

'అమ్మ పిచ్చిదికాదూ! చంటాడికికూడా పిచ్చెక్కితే?'.

'పోసీ! నువ్వే యియ్యరాదూ?'

'ఛా?. నేను అమ్మనా ఏమిటి?'

అందరం కలిసి ఓ మాంఓ విరగబడ్డాము.

'రేపడిశారు! వెధవమాటలూ మీరును, నోరు మూసుకు పడుకోండి' అంది వాళ్ళ 'అమ్మ' అదిరిస్తూ, అధికారంతో.

'బాబోయ్ పిచ్చిది కరుస్తుంది. అమ్మాయీ! రావే. పడుకుందాం!' అన్నాడు కొంటెతనంగా పెద్దాడు.

'ఉండు, నీ మంగళం రేపు పాడిస్తాను, మాస్టారితో చెప్పి, పిచ్చి కుదురుతుంది అప్పటికి; అని తల్లికూడా నవ్వింది.

'చెప్పి, చెప్పి నా కాళ్ళకి బంగారం చెప్పులు చేయించు—పిచ్చిదానిమాటలు ఎవరు వింటారు? నేనూ చెప్పేస్తా మేస్టారితో 'మేస్టాండి! మేస్టాండి! మా అమ్మకండి... మరేమోనండి...'

'ఛీ; నోరుముయ్యి: వెర్రిపుల్లయ్యా!'

'చెప్పరా! అబ్బాయీ తప్పకుండా నేను కూడా అన్నానండి అంటూ' అంది రమణ.

'పిచ్చిది పుల్లమ్మ,
మొగుణ్ణి ఏాంగంది' అని ఆశుకవిత్వం మొదలెట్టాడు.

'నాన్నా! యింక పడుకోండి' అన్నాను పిచ్చిఊహలతో కుదురులేనిమనసుతో.

* * *

నాలోకం అంతా పోగుచేస్తే ఆ దోమతెర చేత ఆవరింపబడ్డ కాస్త కాళీ స్థలమే. సద్దు అణిగింది యిల్లంతా. పిల్లల మోతలు, ఎలకల హడావిడి తప్ప యింక ఏ బాపతు చప్పుడు కూడా లేదు. వెర్రిమొర్రి ఆలోచనలతో కళ్ళుమూశాను. మాయింటి పక్కయింట్లోంచి గడియారం పన్నెండుకొట్టినట్టు స్పృహమాత్రమే. తరవాత నాకు ఏమీ వినిపించాలేదు, కనిపించాలేదు.

కాని, నేను ఓ పెద్దపట్టణంలో, ఓ పెద్ద షాపులో దోమతెరగుడ్డలు బేరమాడుతున్నాను. అదంతా స్త్రీలచేతనే నడపబడుతూంది. నేను అక్కడికిచేరి రకాలు చూస్తుండగానే, ఎక్కణ్ణుంచొచ్చారో, ఓజత మెల్లిగా నాపక్కకుచేరి 'ఏమండి! సార్! యీబట్ట తీసుకుంటున్నారా?' అన్నారు.


'యింకా ఏదీ సెటిల్ చేయలేదు.'

'ఇది దోమతెరలాగుందే?'

ఆమాటతో నాకు, నే చేయబోయేపని నేను అనుకున్నదేగదా అని నమ్మకం తోచింది. కాని ఆపని అమాంతంగా ముగించెయ్యాలిసొచ్చింది. ఆ జంటలోని స్త్రీవ్యక్తి అదోలోకంగా, నేను ఏదోరకం జంతువు



'కింగు ఫర్ ఎ డే' అను ఫిల్ములోని ఒక దృశ్యము.



లవ – కుశ ఫిల్ంలోని ఒక దృశ్యము.

నేమో అనుకొన్నట్లు నా కేసే చూస్తోంది. సరే నేనూ ఊరికే ఉన్నట్టుగానే ఉండి ఆవిడ ఏమిచేసిందనుకున్నారు? మొగుణ్ణి పిలిచి, 'చూడండి! యీాయన నా కేసి ఎగాదిగా ఎట్లా చూస్తున్నాడో? ఊరుకుంటారేం?' అంది. నేను నిర్ఘాంతపోయ్యానంటే ఆశ్చర్య మెందుకు?

ఆయన విసవిస నా దగ్గరకొచ్చి, నా చొక్కా కాలరు పట్టుకుని 'ఏమయ్యా! 'ఫీమేల్సు' వంక అట్లా 'బ్రూటిష్'గా 'బిహేవు' చేస్తే మర్యాదదక్కదు. జాగ్రత్త!' అని ఓంద్రబెట్టాడు. ఇంతిలో చుట్టూవున్న వాళ్ళు దగ్గరకి చేరారు.

'సార్! యేమిటండీ, తమరట్లా కాకపడతారు' అన్నాను.

'అరే! పిచ్చి పిచ్చిగా వదరబోకు – ఆడవాళ్ల కేసి—నా ఆడవాళ్ల కేసి, యెట్లో చూశావుటే! – యేమనుకున్నావు?'

'అయ్యా! నేను ఆమెవైపు చూశానని ఎట్లా నిర్ధారణ చేశారు; స్వామీ?'

'ఆమె చెప్పటంలే?'

'చిత్తం! ఆమెకెట్లా తెలియవచ్చింది సార్.'

'నేను చూడటంలేదూ? నీవాలకం!' అంది ఆమెచప్పున.

'ఇంక తగువేముంది? సార్! ఒకర్ని ఒకరు చూసుకున్నాము. ఇవి, స్త్రీకి, స్వతంత్రత యివ్వవలసినరోజులు. ఆమెను గౌరవించాలి. ఆమె నావైపు చూసినప్పుడు, నేను తిరిగి, ఆమెకు సమాధానం యివ్వకపోతే, పురుషుణ్ణి అవడంచేత, స్త్రీలోకానికి అపకీర్తి తెచ్చినట్లు కాదూ?'

'చాలా బలేజవాబు' అన్నారు చుట్టు మూగినమూక. కాని, అసలు నాయకురాలు, నన్ను తనచూపులతో స్నానం చెయ్యించేస్తోంది. ఆయనకి మంట లెక్కువౌతున్నాయి: ఓర్పువదులైంది. గర్జిస్తూ, నామీదికి ఉరికాడు. నేను ఆయన నిదానానికి గురితప్పించా. నాచెయ్యి గోడకి తగిలింది. మెలుకువొచ్చి ఉలికి పడ్డా.

* * *

టక్ టిక్ మంటూ కిటికీదగ్గర ఓశబ్దం. నా తెరలోంచే కళ్లు విప్పాను. కళ్లు చీకట్లు కమ్మాయి: ఎవడో కొంపముంచేశాడు. లేకపోతే ముంచెయ్యటానికి సిద్ధంగా ఉన్నాడు. ఎంత మగాణ్ణయినా, కొంచెం ధైర్యం సన్నగిలింది. ఒక్క మొగాణ్ణి, వాళ్లు ఎంతమందున్నారో? నాభరతం పట్టడాని కొచ్చారేమో! నాకొంప నట్టేట ముంచడాని కొచ్చారో! అదీకాకపోతే, నన్నుతన్ని, నాదోమ తెరని పూర్ణానుస్వారం చుట్టటానికే తగులడ్డారో! వీళ్ళ మొహంమండ! ఎంత ఓర్వలేని పీనుగులో!.......పెట్టిలాగుంది యిల్లు. యీ కిటికీక్రింద......దారి చేశారుకాబోలు ...అక్కడికి తొందరెందుకని నిదానించి, 'హూత్, హూత్' అన్నాను, ఏ నల్లపిల్లేనా ఆమూల శయనించిందేమోనని. దానిదుంప తెగ అది కదలదు. అప్పుడు ధైర్యం తెచ్చుకొని మంచం చప్పుడుచేశాను పోనీ లేచి పోతుందేమోనని: అబ్బే!......

నా ఆపాదమస్తకం ప్రవాహంకాలేదు కాని, పోనీ ఓడిగ్రీ తక్కువే అనండి: యింక 'మెస్మరిజము' దొరకబుచ్చుగుని, గుడ్లు మాత్రం అప్పచెప్పాను, ఆవైపుకు. ఊపిరి బిగపట్టాను. మొలనుంచి జారుతోన్న బట్టని గట్టిగా బిగిస్తున్నాను. కాని పదేపదే ఆపనే చెయ్యాలిసొస్తూంది. పరీక్షల్లో కాపీచేసినవాడి వైఖరి అంతా నాదగ్గరే ప్రత్యక్షం. ఆయుధం

అవసరం. కఱ్ఱ లేకపోతే గొఱ్ఱె కరుస్తుంది: అల్లాంటప్పుడు ఎదట ఉన్న కఱ్ఱకూడా కళ్ళ బడదు. ఇంత జాప్యంచేస్తే, ఫలం దక్కుతుందా? నేనొక్కణ్ణే యీ కార్యం సానుకూలం చెయ్యగలనా? కార్యం చక్కబెట్టిన, తరవాత జనాన్ని లేపితే, నాకు ఎంతో 'విలువ' ఉంటుంది. నాచరిత్ర ఆచంద్రతారార్కంగా వాళ్ళనోట, వాళ్ళనోట వింటూనే ఉంటాను:

ఎన్నో ఆలోచించాను. అంత ఆలోచనకి ఆవగింజంత కాలమేనా పట్టలేదు. ఏమి ఆలోచించినా దారి కనబడదు. సరే! ఒక్కణ్ణే పూనుకుంటూ ననుకోండి కార్యక్రమానికి. అవతల వైరి ప్రబలుడైతే, నన్ను చిత్తుచెయ్యడూ? నాకీర్తి అనవసరంగా గంగపాలు కాదూ? నామొగాడితనం మంట కలవదూ?

* * *

ఈసారి తెలివైన పని చేశాననుకుంటాను. ఓచేత్తో నోరుమూసి, మరోదానితో కదిపి లేపాను మా ఆవిణ్ణి. ఇదేమి ఘోరమనకండి. మొదట్లో మోసపొయ్యాను కాదండీ!

అడావిడిపడి అయితేనేం—గిజగిజ కొట్టుకునైతేనేమి, నోరు మెదపకుండా లేచింది ఆమె. రహస్యంగా చెవులో ఊదా యదార్థం – ప్రత్యక్షం. నన్నుచూసి, నాఅవస్థ తెలిసి, చాలా జాలిపడ్డట్టు అనుకోవలసి వచ్చింది. ఆవిడ లాంతరు పట్టింది. నేను వీరుణ్ణయ్యాను. ముందు ఎవరు అడుగుపెట్టడం అనేది ప్రశ్న యిప్పుడు. ఆమె నాభార్య! పుత్రవతి! నాకూ ఆవిడికి యిష్టం యెక్కువ. అందుచేత మనస్సు ఆవిణ్ణి యుద్ధానికి పంపటానికి అంగీకరింప లేదు.

* * *

వెనకనుంచి లాంతరుతో ఆమె. ముందు కఱ్ఱతో నేను. కిటికీదగ్గరకి వెళ్ళేసరికి, సరిగ్గా అయిదు అడుగులు పెట్టాను. లాంతరుకాంతి ఆమె పైటచెంగుతో కప్పబడిపోయింది. మాటలాడే సమయంకాదు: అలికిడి అయితే అవతల వ్యక్తి అంతర్హితం కావచ్చు: స్థలం నిర్దేశమైంది. 'అమ్మ! వీడమ్మకడుపు బంగారంగానూ' అనుకుంటూ వెనకనుంచివచ్చే ఆమెని, నాయెడంచేత్తో ఆపుతూ, కుడిచెయ్యి చాపి, కఱ్ఱతో చప్పుడుకాకుండా నేలతట్టాను. 'టక్' మనింది.

* * *

కన్నమైతే, కఱ్ఱ నేలమీద టక్ మంటుందా? కన్నం అడుగుపరపు, నేలమట్టం కంటే పల్లంగా ఉండదూ?

* * *

లాంతరు ముందుకుచూపి, నన్ను చేత్తో గభీలుమని ముందుకి తోసి, మధురవాణిలా, లంకించుకుంది నవ్వడం: తోసినవాడు యెవడో కూడా తెలియని స్థితిలో బుఱ్ఱ తిరుగుతోంది. నవ్వు, బాణంలాగాపోయి, హృదయంలో గుచ్చుకుంది. నెప్పిచేత తెలివివచ్చింది.

అయిందేదో అయిందని ఊరుకోవచ్చునా? యెంత చనువైతేమాత్రం! గభీల్న వెళ్ళి లేపిందండీ! పెద్దాడు లేచీ లేవడంతోనే యెప్పుడూ 'నాన్నా' అని పిలవటం అలవాటు.

అల్లాగే 'నాన్నా' అంటూనే లేచాడు.

'నాన్న దొంగతో యుద్ధంచేస్తున్నారు! యిప్పుడు మాట్లాడించకురా నాయనా!' యెంతో వెటకారంగానూ, వెకిలిగానూ అనేసింది.

'దొంగేమిటే? అమ్మా!'

'ఇదిగో! యెంత కన్నంతవ్వాడో చూడు! యిలారా'. అంది వాడు లేచి వచ్చి, అమ్మా! ఏదే కన్నం యిక్కడ?'

'ఇదుగో' అంటూనే మళ్ళీ పకపక – నావొళ్లు రపరపలాడుతూంది. అడుపాజ్జలలో

ఉండవలసిన ఆడది. హద్దుమీరనా ?'

'ఇదా! నా బోడిపలక ముక్కకాదుటే, బళ్ళోంచివచ్చి, మంచం బాగుచేస్తోంటే, నిలబడ్డాను. అప్పుడు నా నల్లలాగు, పలక ముక్కాను, యిక్కడెట్టి మరిచిపోయాను' అన్నాడు ఆ అమాయకుడు.

'పలకముక్క...'అంటూ విరగబడి ఆమె నవ్వటం.

'ఎంత అవమానం!' అని నాలోనేను అనుకోడం. యిందాక అమ్మ దొంగని పట్టుకుంది. యిప్పుడు నాన్న, వాడితో యుద్ధంచేసి నా పలకముక్క బద్దలుకొట్టాడు' అన్నాడు నా కొంటెకొడుకు.

ఈలోపులో రమణ లేచేసింది. చుట్టు ప్రక్కల కాపరాలు చేస్తున్నవాళ్ళే లేస్తే యింట్లోపిల్లలు లేవడానికేం?

'మెల్లాగరా! అబ్బాయీ! అమ్మకీనాన్నకీ కూడా పిచ్చెత్తిపోయింది' అని సాగదీసింది.

'నిజమేనమ్మా, పిచ్చెత్తి—పోయింది' అన్నాను.

'నాన్నా! ఇదుగో! వినుఅబ్బాయి; పొద్దున్నే బళ్ళోకి వెళ్ళాలి, నాపలక నాకు తెచ్చియ్యి.'

యేడ్పులోనే నవ్వువచ్చింది. యీ పిల్లలంటూ యిప్పుడు అడ్డంలేకపోతే స్వగతంగా నేను చెప్పుకు విచారించవలసిన విషయాలు చాలా ఉండిపోను.

ఈ అడావిడిలో పరుగెత్తుకొచ్చాడు సుబ్బారావు శనిగాడు.

'యేమిటంవో గ్రామఫోనుప్లేటు తగిలించారు యిప్పుడు.'

'యేమిటా (నావళ్ళు పొగలుకమ్ముతుంది) -నీ——తలకాయి!'

—కడియాల కామేశ్వరరావు.



# జిజ్ఞాస

## ౪౯. జాతకచక్రముల భిన్నఫలములు

ఒకేలగ్నమున పదినిముషముల వ్యవధితో జననమొందిన కవలసోదరులయొక్క జాతకచక్రము లొకే మాదిరిగా ఉన్నను, వారియొక్క ద్వాదశభావముల ఫలితములలో ఒకరికొకరికి వ్యత్యాసము కలుగుటకు కారణమేమి? ఇందులో ఒకడు ఐశ్వర్యవంతుడు. రెండవవాడు దరిద్రుడు. ఒకడు విద్యావంతుడు. రెండవ వాడు విద్యాహీనుడు. ఒకనివృత్తి వ్యాపారము. రెండవ వాడు గుమాస్తా—ఒకనిభార్య చక్కనిచుక్క. రెండవ వానిభార్య కురూపి—ఇట్లుండుటకు తగిన కారణములు జ్యోతిషశాస్త్రమున గలవా?

—బి సింహాచలము.

## ౫౦. సంభోగమునకు అర్హమగు కాలము.

స్త్రీ పురుష సంప్రయోగమునకు అర్హమగు కాలమేది? ఇట్టిదానికి దినమును పూర్తిగ నిషేధించిన మన ధర్మశాస్త్రవేత్తల అభిప్రాయములకు వ్యతిరేకముగా నవీనశాస్త్రవేత్త లేమైన చెప్పుచుండిరా!

—జి. సుబ్రహ్మణ్యశాస్త్రి.

## ౫౧. పొగచెట్టు ఓషధీగుణమును చెప్పుగ్రంథము.

అనేకములగు ఓషధులను గూర్చి వివరించు ధన్వంతరి రత్నమాల,అష్టాంగము మొదలగు ప్రాచీనాయుర్వేద నిఘంటులలో పొగచెట్టు ఓషధీగుణమును గూర్చిన వివరణములేదు. దీనినిగూర్చి వివరించిన ప్రాచీననిఘంటువు ఏది?

—వైద్యభూషణ పి. బ్రహ్మానందము.

## ౫౨. మిరపకాయల నిషేధము.

మనము నిత్యమువాడు మిరపకాయలను పైతృక కర్మలయందు వాడక వానికిబదులు మిరియములువాడు ఆచారములోగల అంతరార్థమేమి?

—పీశపాటి విశ్వనాథము.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౧౧౩. యాజ్ఞవల్క్య చరిత్రము

బ్రహ్మశ్రీ భాగవతుల లక్ష్మీపతిశాస్త్రిగారిచే రచింపఁబడిన కణ్వగురువాజసనేయయాజ్ఞవల్క్యచరిత్రము మా కార్యస్థానమునకుఁ జేరినది. అందుఁ గానవచ్చెడి విశేషవిషయములనుబట్టి శాస్త్రిగారు నూతనముగా రచింపఁబడిన పాశ్చాత్యపౌరస్త్యగ్రంథములనే కాక వైదికవాఙ్మయమును సాకల్యముగాఁ బరిశీలించినట్లు కానఁబడును. వేదములయొక్క కాని బ్రాహ్మణముల యొక్క కాని చరిత్రమును సంగ్రహముగాఁ దెలిసికొనవలయునన్న నింతచక్కఁగాఁజర్చించి వ్రాసిన గ్రంథము మఱియొకటిలేదని చెప్పినను జెప్పవచ్చు. ఆంధ్రుల కుపయోగపడునట్లుగా యాజ్ఞవల్క్యచరిత్రము నింత విపులముగను దేటగను సప్రమాణముగను జర్చించి వ్రాసిన గ్రంథము మఱియొకటిలేదు. యాజ్ఞవల్క్యుఁడు జనకమహారాజునకుఁ దెలిపిన తత్త్వముయొక్క రహస్యమును దెలిసికొనఁదలంచినచో నీగ్రంథమునే చూడవలయును. ఇది యాంధ్రదేశమునందు నివసించెడి ప్రథమ (కాణ్వ) శాఖీయులకే కాక తదితరులకును వైదికవాఙ్మయాది విషయములను దెలిసికొనుట కెంతో యుపయోగించును. క్రౌనుసైజున 350 పుటలు. చక్కని కాలికో బైండు. మూల్యము ౨-౦-౦ రు. వలయువారలు :— భాగవతుల లక్ష్మీపతిశాస్త్రిగారు, రామచంద్రపురము, ఈస్టు గోదావరి. అని వ్రాసికొనవలయును.

## ౧౧౪. ఆదర్శసుఖజీవనము

శ్రీ ఖుషీరామ్‌గారు ఆంగ్లమున రచియించిన గ్రంథమున కిది తెనుఁగుసేత. అనువాదకులు సుప్రసిద్ధాంధ్రగ్రంథరచయితలును ప్రశాంతజీవనులును అగు శ్రీయుత కూచి నరసింహముపంతులుగారు. మానవుఁడు నిరంతరము కోరుచుండు సుఖావాప్తియు దుఃఖనివృత్తియు సిద్ధించుటకు సాధనభూతములైన విషయము లనేకములు ఈ గ్రంథమునందు సయుక్తికముగా, సప్రమాణముగా ఉపదేశింపబడినవి. ఆ యుపదేశములకు పోషకముగా చక్కని చిన్నచిన్న చారిత్రకకథలును, మహనీయులసూక్తులును అచ్చటచ్చట ఎత్తివ్రాయబడియున్నవి. ఆరోగ్యము, విద్య : గ్రంథపఠనము, సంఘజీవనము, పని, ధనము, మనోనిగ్రహము, స్వస్వరూపజ్ఞానము, బ్రహ్మసాక్షాత్కారము, చేసి మఱి చింతింపకుము అను శీర్షికలుగల పదునాలుగు ప్రకరణములు ఇందుగలవు. 'అన్నిదేశముల స్త్రీ పురుషులకు, అన్ని మతములవారికి, అన్ని వర్ణములవారికి, అన్నివయసులవారికి సరిపడి సమాదరణీయములైన సత్యములు బోధించుట ఈ గ్రంథముయొక్క విశిష్టలక్షణము.' ప్రశాంతమనస్కతనుగోరు ప్రతివారును అవశ్యము పఠింపవలసిన గ్రంథము. అనువాదకశైలి మనోహరముగనున్నది. డెమ్మిసైజున 162 పుటలు. వెల ప్రతిఒక్కటికి ఒక్క రూపాయ. వలయువారు గ్రంథకర్తపేర పిఠాపురము (తూర్పుగోదావరిజిల్లా)నకు వ్రాయునది.

## ౧౧౫. వైద్యయోగరత్నావళి

ఇందు గవర్నమెంటువారిచే అంగీకరింపబడిన (1929-వ సంవత్సరపు 2411 నెంబరు జీ.వో) ఆయుర్వేదయోగములన్నియు సాంప్రదాయకపూర్వకముగ వివరింపబడినవి. పదునాలుప్రకరణములు గలవు. అవి క్రమముగా ఆసవములు - అరిష్టములు, చూర్ణములు, ఘృతములు, గుటికలు, క్వాథమూర్ణములు, లేహ్యములు, లేపములు, నేత్రరోగౌషధములు, పానకములు, సత్వములు, సర్జికలు, తైలములు, ప్రత్యేకౌషధములు, భస్మములు-సిందూరములు, రసౌషధములు, ద్రావకములు అను శీర్షికలుగలవి. ప్రతిప్రకరణమునకు తొలుత ఆయా



పండిత ములుగు రామలింగయ్యగారు.

ప్రకరణమున ప్రస్తరింపబడిన ఔషధములను చేయుటకు అవసరమైనసూచనలు గావింపబడినవి. ఒక్కొక్క ఔషధయోగమును అది ఏగ్రంథమునుండి గ్రైకొనబడినదో చెప్పబడుటయేగాక మూలమునందలి శ్లోకములతో కూర్చబడి ఆ యోగముచేయుటలో ప్రత్యేకము చూపవలసిన మెలుకువలును వివరింపబడినవి. ఒక్కొక్క ఔషధయోగము దిగువను ఆ ఔషధముయొక్క ప్రమాణము, దానిగుణము, అది ప్రయోగింపదగు వ్యాధులు, దానికివలయు అనుపానములు చక్కగ చెప్పబడినవి. మఱియు అవసరమైనచోట మలబారు మొదలగు ఇతరదేశపు పద్ధతులుగూడ వివరింపబడినవి. ఉదాహరణమునకు పిండతైలమును గూర్చిన ఈ గ్రంథమునందలి వివరణమును (పుట 162) చూడనగును. ఈపదునారు ప్రకరణములందును చెప్పబడిన ఔషధయోగములుగాక అనుబంధమున మరి నలుబదింటికిపైగా యోగములు వివరింపబడినవి. రోగులకు ప్రస్తుతకాలమున హార్లిక్సు మొదలగు విదేశీయములగు ఆహారములు విరివిగా వాడబడుచున్నవి. అట్టి విదేశీయములగు ఆహారములకు ప్రత్యామ్నాయముగ వాడదగు ఆయుర్వేదీయ ఆహారమొకటి ఈ గ్రంథమున చెప్పబడియున్నది. శోషహారమును, బల్యమును అగు ఈ ఆయుర్వేదీయ ఆహారము మంచి ప్రచారమునందు నేని విదేశీయములగు ఆహారముల అమ్మకమును అరికట్టగలదు. గణపరిభాష, మానపరిభాష, ద్రవ్యసారములు, అలబ్ధప్రతినిధులు, పంచవిధకషాయములు, విషప్రతివిషములు, శుద్ధులు మొదలగువాని పూర్తివివరములుగల ఈ గ్రంథమునందలి తుదిపుటలు గ్రంథముయొక్క వినియోగమునెంతయు హెచ్చించుచున్నవి. ఈ గ్రంథము బ్రహ్మశ్రీ పండిత ములుగు రామలింగయ్యగారిచే సంపాదితము. వారీపనికెంతయు తగినవారని చెప్పనగును. మద్రాసు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్ మెంబరగుటచే వారు ఆయుర్వేదముయొక్క నవీనములైన అవసరములను గుర్తింపగలిగిరి. మరియు వారు పండితులగుటచే ఈ గ్రంథమును నిర్దుష్టముగ సంపాదింపగలిగిరి. పలువత్సరములుగ ఔషధనిర్మాణవ్యాపారమున నున్నవారగుట వారికీవిషయమున విశేషానుభవము కలిగినది. ఈ గ్రంథమునకు పీఠక వ్రాయుచు గవర్నమెంటు ఇండియన్ మెడికల్ స్కూలు ప్రిన్సిపాలు శ్రీయుత వైద్యరత్న కెప్టెన్ జి. శ్రీనివాసమూర్తిగారు (బి. ఏ.బి.ఎల్., యం.బి.సి.యమ్) ఈ విషయమునే నొక్కి చెప్పియున్నారు. క్రౌను సైజున 368 పుటలుగల ఈ గ్రంథము వెల రు 2-0 0. దొరకుచోటు : ది ఇండియన్ మెడికల్ స్టోర్సు : తెనాలి.

# వరదానము

వింధ్యాచలపర్వత మర్ధరాత్రి యొక్క నిబిడాంధకారములో నల్ల దేవత విధమున నిలువబడియుండెను. అష్టభుజదేవి యొక్క మందిర శిఖరముపైన తెల్లజండాలు మందవాయుతరంగములవలన నల్లల్లాడుచుండెను. ఆ మందిరములో మిణుకుమిణుకు మను నొకదీపము.

అర్ధరాత్రి గడచెను. నిశ్శబ్దత. ఈ సమయమున నొక శ్వేతవస్త్రధారణియగు స్త్రీ అష్టభుజదేవియెదుట జేతులుగట్టుకొని నిలువబడి యుండెను. ఆమె ప్రౌఢముఖమండలము పసుపుపచ్చగానుండెను. భావములవలన నుచ్ఛ్వసితలము ప్రకటితమగు చుండెను. ఆమె శిరము వంచిఉంచి:

'తల్లీ ! నేటి కిరువది వత్సరములనుండి నీ చరణములమీద శిరమువంచని రోజులేదు. నీవు మహారాణివి. నేను నిన్నింత సేవించినప్పటికిగూడ నామనోభిలాష బూర్తికాలేదు. నేను నిన్ను విడచి యిప్పుడెక్కడకు బోవుదును?

తల్లీ ! నేను వందలకొలది వ్రతములాచరించితిని. దేవతలకు మ్రొక్కుకొంటిని. తీర్థయాత్రలు సేవించితిని. కాని మనోరథ మీడేరలేదు. అప్పుడు నీ శరణుజొచ్చితిని. ఇప్పుడు నిన్నువిడచి యెక్కడకు బోవుదును ? నీవు సదా నీభక్తుల గోర్కెలను దీర్చితివి. నేను నీ దర్బారునుండి నిరాశపడి బోవుదునా యేమి?'

'సుహామా' యీప్రకారము జాలసేపటివరకు బ్రార్థించుచుండెను. అకస్మాత్తుగా ఆమె హృదయమునకు దివ్యజ్యోతి కనిపించినది. ఆమెకండ్లు మూసుకొనిపోయినవి. చెవిలో శబ్దము వినబడెను.

'సుహామా! నేనుజాల సంతోషించితిని యేమడిగెదవో అడుగుము.' 'సుహామా' రోమాంచిత యయ్యెను. ఆమె హృదయము వణక నారంభించెను. నేటికి ఇరువదివత్సరముల దరువాత మహారాణి యామెకు దర్శనమిచ్చెను. ఆమె వణకుచు చెప్పెను!—

'మహారాణీ ! నే నేదైతే యడుగుదునో యది యిచ్చెదవా?'

'ఇచ్చెదను.'

'నేను చాల తపమాచరించితిని గాన పెద్ద వరదాన మడిగెదను.'

'ఏ మడిగెదవు? కుబేరునిధనమా?'

'కాదు.'

'ఇంద్రునిబలమా?'

'కాదు.'

'సరస్వతి విద్యయా?'

'కాదు.'

'కాకపోయినచో నే మడిగెదవు?'

'ప్రపంచమునం దన్నిటికంటె నుత్తమ పదార్థము.'

'అది యేమి?'

'సుపుత్రుడు.'

'కులనామమును ప్రకాశింపజేయుటకా ?'

'కాదు.'

'మాతాపితలసేవ జేయుటకా ?'

'కాదు.'

'విద్వాంసుడు, బలవంతుడు యగుటకా?'

'కాదు.'

'ఇక నీవడిగిన సుపుత్రుడు యెట్టివాడు ?'

'నాదేశమునకు దాస్యవిముక్తి చేయగలవాడు.'

'నీబుద్ధికి ధన్యవాదము! వెళ్లు. నీకోర్కె ఫలింపగలదు.'

—రావు వెంకటరంగనాయకులు.

REGISTERED TRADE MARK: MESSRS REDDY & CO.

స్థాపితం. 1920.

# అత్యద్భుత కుష్ఠరోగనివారిణి

(రిజిష్టర్డు)

గుణములేదని ఋజువుచేయువారికి రు 500 లు బహుమానము.

18 రకముల కుష్ఠులు, శ్వేతకుష్ఠు, తదితర చర్మవ్యాధులు యెంతకాలమునుండి జీర్ణించి యున్ననూ గ్యారంటీగా బాగుచేయబడును. 'అత్యద్భుత కుష్ఠరోగనివారిణి' యను దివ్యౌషధమువలన అనేకవేల రోగులు పూర్ణారోగ్యమును బొంది సంసారసుఖము ననుభవించుచున్నారు. చిరకాలమునుండి ప్రసిద్ధికెక్కిన కంపెనీ రెడ్డికంపెనీయే. యింజక్షనులవలన ఫలితముపొందని రోగులనేకులు మాయొద్ద చికిత్సబొంది పూర్ణారోగ్యమును బడయుచున్నారు. పైవ్యాధులకేగాక శెగ, సవాయి, శుక్లనష్టము, మూర్ఛ, మూలశంక మొదలగువ్యాధులకు మాయొద్ద గ్యారంటీ ఔషధములున్నవి.

"నకలు మందులనుచూచి మోసపోకుడు"

పూర్తివివరములకు యీక్రింది యడ్రసునకు వ్రాయుడు.

గోపాలపురము పోస్టు
(వయా) కొత్తపేట,
తూర్పుగోదావరి జిల్లా.

## రెడ్డి అండ్ కో
(రిజిష్టర్డు)

బ్రాంచి ఆఫీస్ :
(కుష్ఠురోగచికిత్సానిపుణులు)
వాల్తేరు.ఆర్.యస్.పోస్టు.



# గోలకొండపత్రిక

దాదాపు అరువదిలక్షల ఆంధ్రులకు నెలవును, అనేకాంధ్రసంస్థానములకు ఉనికిపట్టును అగు నిజామురాష్ట్రమునందు విశేషప్రచారంగల ద్వైవారపత్రిక. ప్రతి సోమ గురువారములందు ప్రకటింపబడును. వ్యాపారప్రకటనలకు అనువైనది.

సాలుచందా రు 6. | అరుమాసములకు రు 3. | విడిపత్రిక ఒకఅణా.

# గోలకొండకవులసంచిక

30 చిత్రపటాలతో, 354 కవులరచనలతో నిండారిన 450 పుటలుగల ఉత్తమ సంచిక. బహుభాషావిదులు, ఆంధ్రభాషాసేవకులు అగు శ్రీసురవరం ప్రతాపరెడ్డిగారి ప్రజ్ఞాపరిశీలనమున వెలువడినది. సర్వాంగసుందరం—ఆనందకందం, గ్రంథాలయాలకు అమూల్యాలంకారం.

గోలకొండ చందాదారులకు ఒక్కరూపాయి—ఇతరులకు రెండురూపాయిలు, టపాఖర్చులు పది అణాలు ప్రత్యేకము.

చిరునామా :

గోలకొండపత్రికాకార్యాలయం, త్రూపుబజారు, హైద్రాబాద్, (దక్కన్).




యీ ట్రేడుమార్కును చూచిన మోసపోరు.

# అత్యాశ్చర్య కుష్ఠరోగ నిర్మూలిని

(రిజిష్టర్డు.)

గుణములేదని ఋజువుచేయువారికి రు. 1000 లు బహుమానము. 18 రకముల కుష్ఠులు, బొల్లి, సుఖరోగములు యేస్థితిలో యెంత కాలమునుండి జీర్ణించియున్నను గ్యారంటీగా బాగుచేయుదుము. మృత్యుముఖమునుండి అనేకవేల రోగులు రక్షింపబడిరి. యింజక్షనువలన ఫలితముగానని రోగులు మామందువలన పూర్ణారోగ్యమును పొందిరి. పూర్తి వివరములకు అన్నిభాషలలోను దొరకు మా కేట్లాగులకు యీ దిగువ యడ్రసుకు వ్రాయుడు.

## లక్ష్మీ అండ్ కంపెనీ (రిజిష్టర్డు.)

కుష్టు అండ్ సుఖరోగ చికిత్సా నిపుణులు,

అల్లిపురం మెయిన్ రోడ్డు, వాల్తేరు ఆర్. యస్ పోస్టు. విశాఖపట్టణము.

# ఐరావతి

లక్షా అరువదివేల బర్మాఆంధ్రుల క్షేమాభివృద్ధులకు ప్రతి శనివారము వెలువడు ప్రజాహిత పత్రిక. 7 సంవత్సరముల నుండి బర్మాఆంధ్రుల శ్రేయోభివృద్ధికై పాటుపడుచున్నది. ఇది ఆంధ్రులకు అండ కార్మికులకు పట్టుకొమ్మ. యువజనోద్యమమునకు ఉనికి. నిర్మోమాటముల నిప్పు. అన్యాయముల నంతరింపజేయుటకు బ్రహ్మాస్త్రము. ఆంతర్యమెరిగినవారికి హాయి, చదివినవారికి మిఠాయి.

సంవత్సరపు చందా రు 3. పై గ్రామస్థులకు రు 3–12–0.

చిరునామా :

ఐరావతి పత్రికా కార్యాలయము, 233 బార్ స్ట్రీట్, రంగూను. (బర్మా.)

# హెన్రీ ఫోర్డు

[ఫోర్డు మోటారుకారునామము విననివారెవరు? 1925-వ సంవత్సరమునాటికి ఫోర్డు ఒకకోటి ఏబదిలక్షల కార్లు నిర్మించి ప్రపంచమున త్వర ప్రయాణసౌకర్యములను పెంపొందించినాడు. ఆతని చరిత్ర ఈ దిగువను ప్రస్తరింపబడుచున్నది.]

అమెరికాసంయుక్త రాష్ట్రములకు చెందిన మిచిగన్ చెంతగల డియర్‌బారన్ నందలి ఒక వ్యవసాయక్షేత్రమున ఫోర్డు కుటుంబమున 1863-వ సంవత్సరము జూలై 30-వ తేదీని ఒకబాలుడు జననమందెను. అంతదనుక ఎవరును కనివిని ఎఱుగని అద్భుతవిషయములను ఆ బాలుడు పెరిగిపెద్దయై చేయుటచే ఆతడు అతిలోకుడైనాడు. ఫోర్డుతండ్రి వ్యవసాయదారుడు. తనవలెనే తన కొడుకుకూడ వ్యవసాయదారుడు కావలయునని ఆతండ్రి తలంపు. కావుననే తనయనంతరము తన కొమారుడు తన వ్యవసాయక్షేత్రపు యాజమాన్యము వహింపవలయునని నిర్దేశించినాడు.

తండ్రి యాదేశమునసుసరించి ఫోర్డు ఆ వ్యవసాయక్షేత్రపు యాజమాన్యమును వహించినాడు. కాని వ్యవసాయముచేసి గాదు. తాను కనుగొని తననామమే ఉంచిన మోటారుకారులనుచేయు ఫ్యాక్టరీని ఆ తావున నిర్మించి నూటఏబదిలక్షల కారులను తయారుచేసి విక్రయించి దానిని ఒకగొప్ప కర్మాగారమును గావించి.

పలువురు వణిక్పుంగవులకువలె ఫోర్డుకూడ తన జీవితారంభదినములలో పలుకష్టములకు నష్టములకు గురియైనాడు. కాని ఆతడు ఆత్మవిశ్వాసముకలవాడగుట ఆ కష్టనష్టములనెల్ల అతిక్రమించి బయటపడినాడు. ఇటీవల కొన్నివత్సరములవఱకు ఆతనిరాబడి వారమునకే నాలుగులక్షల పౌనులను మించియుండునది; ఏడాదికి ఫోర్డు ఫ్యాక్టరీలో ఇయ్యబడుజీతములు ఇరువదికోట్ల పౌనులను మించియుండునవి.

బాల్యమునుండియు ఆతనికి యంత్రములనిన సంబరముగానుండునది. పండ్రెండేండ్లు నిండుసరికి ఆతడు ఒక బుట్టెడు మరలు, స్క్రూలు అచ్చటచ్చట ఏరి కూర్చినాడు. అవి వట్టి నిరుపయోగమైనవి. కాని తాను పెద్దవాడైనతరువాత వానిని తగు ఉపయోగములోనికి తేగలనని ఆతడు నమ్మినాడు.

ఆతని పండ్రెండవయేట ఆతనిజీవితములో రెండు గొప్పవిషయములు జరిగినవి. గుఱ్ఱము మొదలగు జంతువులచేగాక బొగ్గు, ఆవిరి వీనిచే నడుపబడురోడ్డు యంత్రము నొకదానిని ఆతడు చూచినాడు. ప్రతి సామాన్యసంసారియు కొనగల అట్టియంత్రమును నిర్మించుటనుగూర్చి ఆతనితలపులు బారినవి. ఇక నేమి? బీజావాపముజరిగినది. ఆ వత్సరము జరిగిన రెండవ గొప్ప విషయమేమన ఆత డొకచిన్నగడియారమును పొందుట. ఆ చిన్నగడియారయంత్రము ఆతని కెంతయో ముదమును గొల్పినది. దానినంతయు విడదీసినాడు. తిరిగి కూర్చినాడు. గడియారము సరిగానే పనిచేసినది. ఉత్సాహముతో మిత్రుల గడియారములను బాగుచేయుటకు గడంగినాడు. పదునైదవవత్సరము నిండుసరికే ఆతడు గడియారములు బాగుచేయుటలో మంచి అనుభవము కలవాడైనాడు. ఆతడు అవి బాగుచేయుటలో ఉపయోగించిన పనిముట్లన్నియు ఆతడు స్వయముగ కల్పించుకొనినవే!

యంత్రములపైగల ఆతని ఈ మక్కువను తలిదండ్రులు నిరసించినారు. పదునేడవయేట పాఠశాలను వీడినతరువాత ఇక ఏమిచేయుట అనునది ఒక పెద్ద సమస్య అయినది. అప్పటికి ఎంజనీరింగువర్కుస్సులో

అప్రెంటిస్‌గా చేరెదనని ఫోర్డుపట్టు. ఎంతయో వాగ్వాదము జరిగిన అనంతరముగాని అతని తలిదండ్రులు దీనికి ఒప్పుకొనలేదు. మూడుసంవత్సరముల అప్రెంటిస్‌షిప్ అగుసరికే తడు గొప్ప మెకానిస్టుఅయినాడు. ఈ రోజులలోకూడ అతడు గడియారములు బాగుచేయుట విరమించలేదు. అతనికడ ఇప్పటికి మూడువందల రకముల గడియారములున్నవి. ఒకరూపాయి వెలలో చౌక గడియారములను తయారుచేయుటపై అతనిదృష్టి పోయినది. కాని తుదకతడు కారులను నిర్మించుటకే కృతనిశ్చయుడయ్యెను. చౌకకారులను నిర్మించి అతడు ప్రపంచములోనికెల్ల ప్రథమడు పేరుపడినాడు. చౌకగా గడియారముల నిర్మించుటకూడ విశేష ధనసంపాదనకు అనుకూలమైనదే అను ఫోర్డుతలపు సయితము లెస్స అయినదే. ఏమందురా? ప్రపంచమునందలి నేటి గడియారపు వర్తకులలో ప్రథమగణ్యుడైన అమెరికన్ వర్తకుడు సామ్యుయల్ ఇంగర్‌సాల్ చరిత్ర దీనిని రూపించుచున్నది.

అప్రెంటిస్‌షిప్ అయినతరువాత ఫోర్డు తాను చిన్నతనములో చూసిన రోడ్డుఇంజనులవంటి ఇంజనులను అమ్ము వెస్టింగ్‌హౌస్ కంపెనీ ప్రతినిధివద్ద పనికి కుదిరినాడు. అచ్చట ఆపనిలో అతనికి రోడ్డు ఇంజనులను మరామ్మతుచేయుటలో మంచి కౌశల్యములవడినది. అచిరకాలముననే యంత్రములు బాగుచేయుటలో ఫోర్డు విశేషప్రఖ్యాతినందినాడు.

పెట్రోలుతో నడుపబడు ఆట్టోఎంజినులకు అవి ప్రారంభదినములు. అట్టిఎంజను ఒకటి ఇంగ్లాండునుండి క్రొత్తగా అచ్చోటికి దిగుమతిచేయబడెను. అది సరిగా పనిచేసినదికాదు. ఎంజన్‌లను బాగుచేయుటలో పెద్ద పేరుసంపాదించియున్న ఫోర్డు చేతులలో బాగుచేయబడుటకుగాను ఆ ఆట్టోఇంజెను ఉంచబడెను. అందులో ఫోర్డు అదృష్టపురేఖ బయలుపడినదని చెప్పవచ్చును. పెట్రోలు ఇంజెనుయొక్క లోతుపాతులను కనుగొనుటకు అతనికి అవకాశముచిక్కినది. అత డాయవకాశమును పూర్తిగ వినియోగించుకొనెను. 1885-లో అతడు స్వయముగ అట్టి పెట్రోలుఇంజనును తయారుచేసెను. అది లెస్సగ తయారైనది.

కాని ఫోర్డు తండ్రిమాత్రము తన తనయుడు యంత్రములపిచ్చిలోపడి కాలమును వృధాచేయుచున్నాడనియే తలంచెను. కాగా అతనిని తన వ్యవసాయక్షేత్రమున కాహ్వానించెను. ఫోర్డు ఈ ఆహ్వానమునకు అంగీకరించెను. ఏమందురా? ఇంజనులు తయారుచేయు ప్రయత్నమున పరిశోధనలు గావించుటకు తీరిక యవసరము. మరియు తాను వివాహముగావించుకొన తలపెట్టియున్నాడు. ఈ కారణములచే అతడు తనతండ్రి ఆహ్వానము నంగీకరించినాడు. తన తనయుడు యంత్రముల పిచ్చినుండి విడుమరగాంచిన చాలునని అతడు ఫోర్డునకు నలుబదియకరముల పేకుఅడవిని ఇచ్చినాడు. ఫోర్డు అంపపుమిల్లు నేర్పఱచినాడు. వివాహితుడైనాడు.

ముప్పదిఒక్క చతురపుటడుగుల వైశాల్యముగల చిన్నఇంటిలో హెన్రీఫోర్డును అతని భార్యయు తమ వైవాహికజీవితమును ప్రారంభించినారు. ఏమాత్రమును ఆశాజనకముగలేదు. కాని తానొకనాడు చౌకగ కారులుచేసి అమ్మగలుగుదుననియే ఫోర్డు నమ్మియుండువాడు. కాగా దినమంతయు కలపవ్యాపారవ్యవహారములు నిర్వర్తించి తాను ఇంజెనులనుగూర్చి సంపాదింపగలిగిన పుస్తకములన్నియు రాత్రులు పఠించువాడు.

ఆ దినములలోనే తన సొంత ఉపయోగముకొఱకు అత డొక పెట్రోలుఇంజనుతో చిన్నకారును తయారుచేసినాడు. ఇట్లుండ డెట్రాయిట్ పట్టణమందలి ఎలక్ట్రిక్ కంపెనీవారికి ఇంజనీరు కావలసివచ్చెను. ఫోర్డుకు ఆహ్వానమువచ్చెను. భార్యతో అత డాపట్టణమునకు ప్రయాణమయ్యెను. ఈ సందర్భముననే 1893-వ సంవత్సరమున డెట్రాయిట్ పురజనులు రోడ్డుమీద ఫోర్డు తన మొదటి మోటారుకారును నడిపించుటను గాంచగల్గిరి.

డెట్రాయిట్ ప్రజలు ఆ మొదటి మోటారుకారును అది తమ పట్టణమునకు క్రొత్తప్రతిష్ఠను గూర్చుదానిగా

గుర్తింపలేకపోయిరి. నిజముగా ఆ మోటారు అప్పుడట్లే యుండెను. అది చేయుచున్న ధ్వని భూనభోంతరాళములు నిండునదిగానుండెను; గుఱ్ఱములు బెజారెత్తి పారిపోవునవి; జనుల బండ్లరాకపోకలు అరికట్టబడునవి. ఆ దినములలో ఫోర్డు తనకారును ఒక్కనిముసము వీధిలో ఉంచుచో విలాసముకొఱకు దానిని స్టార్టుచేయ ఎవరో ఒకరు ప్రయత్నించువారు. అగుటచే ఫోర్డు తనతో ఎల్లవేళల ఒక పెద్దగొలుసును తాళమును తీసికొని పోవుచు తనకారును ఏ లాంతరు స్తంభమునకో కట్టి పెట్టి తనపనిమీద పోవువాడు. డెట్రాయిట్ ప్రజల వలెనే డెట్రాయిట్ పోలీసులుకూడ ఆ మొదటి ఫోర్డు కారును సహింపలేకపోయిరి. ఆ పట్టణపు మేయరునుండి ప్రత్యేకమగు అనుమతి తెచ్చుకొనినగాని ఆ యంత్రమును రోడ్డుమీద నడపనీయమని పోలీసులుచెప్పిరి. కాగా మోటారురాజుఅయిన ఫోర్డు అమెరికాసంయుక్త రాష్ట్రములందు దీయబడిన మొదటి మోటారులైసెన్సునకు స్వానుదారుడయ్యెను.

నూటయేబదిలక్షల ఫోర్డు కారులకు పురోగామియైన ఈకారు ఫోర్డువద్ద రెండుసంవత్సరములు పని చేసెను. ఆ రెండుసంవత్సరములలో అతడును, అతని స్నేహితులును దానిమీద రెండువేలమైళ్ళు ప్రయాణము చేసిరి. అనంతరము దానినాతడు రెండువందల డోలర్లకు (సుమారు ఆరువందలరూపాయిలు) విక్రయించి ఆ డబ్బుతో మరియొక క్రొత్తకారు నిర్మించెను. ఇది మొదటిదానికంటె తేలికగనుండెను.

ఈ పరిస్థితులలో ఎలక్ట్రిక్ కంపెనీవారు అతడు యంత్రములతో కాలమును వ్యర్థముచేయుట మానుచో వారి కర్మాగారపు సూపరింటెండెంటుపనిని ఈయగలమనిచెప్పిరి. ఉద్యోగమా? వ్యాపారమా? అను సమస్య అతని నెదుర్కొనెను. అప్పుడు తానుచేసినపనిని గూర్చి అతడిట్లు చెప్పుచున్నాడు. 'సిద్ధమైయున్న ఉన్నతోద్యోగమును స్వీకరించుటా? తలపెట్టిన మోటారువ్యాపారమునకు ఉపక్రమించుటా? ఈ రెండింటిలో దేనిని గైకొనుట. నేను ఎంతయోకాలము ఆలోచింపలేదు. ఉద్యోగమును కాలదన్నితిని. మోటారు కారు వ్యాపారము చేకొంటిని. కార్లవ్యాపారము జయపథమంటి తీరునని నేను మొదటినుండియు నమ్మియే యుంటిని. కాగా 1899-వ సంవత్సరము ఆగస్టు 15-వ తేదీని నేను ఉద్యోగమునుమాని మోటారుకారు వ్యాపారమునకు ప్రారంభముచేసితిని.'

ఫోర్డు చేసినపని చాల ప్రమాదముతో కూడినదే. అప్పటి కాతనికి విశేషమైన రాబడిలేదు. కుటుంబపు వ్యయములకుపోను పరిశోధనలకు కొద్దిపాటిధనము మాత్రము మిగులుపరిస్థితులు. అట్టిపరిస్థితులలో ఫోర్డు సరియైన కారును చేయలేకపోయినా డనుకొనుడు. అంతతో ఆతనిపని మట్టుమేకదా! కాని ఫోర్డు ఇందుకు సంతోషపూర్వకముగ ఒప్పుకొన్నాడు. ఎట్లయిన ప్రయత్నించుటకే ఆతడు నిశ్చయించినాడు. ఆతని భార్య హెచ్చుగ ప్రోత్సహించినది. తనమగని బుద్ధి బలము, నిర్మాణకౌశల్యము ఆమెకు బాగుగ తెలియును. అతడపజయమందునేమో అను సంశయము ఆమె ఒక్కసారి కలలోఅయినను పొందలేదు.

కొందరు వ్యాపారస్థులు ఒకసంఘముగా కూడిరి. వలయు పెట్టుబడినికూర్చిరి. మోటారుకంపెనీ స్థాపింపబడినది. దానికి ఫోర్డు ప్రధానమైనఇంజనీరు. వాటాదారులందరును వర్తకులు. విశేషలాభముల నాశించియే వారీవ్యాపారమున కాలుబెట్టిరి. అగుటచే వారి ఉద్దేశము కొద్దికారులనుమాత్రము తయారుచేసి ఒక్కొక్కదానిమీదనే విశేషలాభము తీయవలయునని. ఫోర్డు తలంపు ఇందుకు పూర్తిగా వ్యతిరేకమైనది. పండ్రెండేండ్ల బాల్యమునుండియు అతని ఉద్దేశము కార్లను వేలకొలది తయారుచేసి ఒక్కొక్కదానిమీద కొద్ది లాభమును పొందవలయునని. తానీకంపెనీలోపెట్టిన పెట్టుబడి కొద్దిపాటిది. కావున తనమాటకు చెలామణీ యుండదు. అగుట కాలము కలసివచ్చువరకు వారు చెప్పినట్లే ఆతడు చేయవలసినవాడయ్యెను. కాలము కలసి వచ్చుటకు ఫోర్డుకు ఎన్నియోసంవత్సరములు పట్టలేదు. 1902-వ సంవత్సరము మార్చిమాసమున ఫోర్డు ఆ కంపెనీతో తనకుగల సంబంధమును వదులుకొన్నాడు. తన కొఱకే తాను పాటుపడుటకు కృతనిశ్చయుడైనాడు.

నాటినుండి ఇంకొకరి ఆర్డరుకు పనిచేయవలసియుండు పరిస్థితులలో నాతడెప్పుడును ప్రవేశింపలేదు.

1903-వ సంవత్సరమున ఫోర్డు మోటారుకంపెనీ స్థాపింపబడినది. ఈ కంపెనీయందు అధికారములన్నియు తనవి. తానే ఉపాధ్యక్షుడు, డిజైనర్, మెకానిక్, జెనరల్ మానేజర్. మూలధనములో నాలగవవంతు అతనిది. మొత్తము మూలధనమంతయు ఆరువేలపౌనులకు లోపు. కంపెనీ ఆర్జించిన లాభములను అపుడపుడు చేర్చుట తప్ప మిగతాకంపెనీ పెట్టుబడిఅంతయు ఈ ఆరువేలపౌనులే. ఆ ఆరువేలపౌనులను చిన్నవిత్తనము నుండియే ఫోర్డును ప్రపంచకోటీశ్వరులలో ప్రథమునిగాచేసిన ధనపుపంట అంతయు కల్గినది.

కంపెనీ యాజమాన్యమున తనకు ఇంకను అడ్డంకి లేకుండుటకుగాను 1906-లో కంపెనీ మూలధనములో సగమునకుపైగా తనదైయుండునట్లు తన వాటాధనమును పెంపొందింప అతడు నిశ్చయించినాడు. వలయు ధనమును అతడు ఆదాచేయగలిగినాడు. కావున మరియొక నాల్గవవంతువాటాల నాతడు కొనివైచెను. మరి పదమూడువత్సరములకు పిమ్మట హెన్రీ కొమారుడు ఎడ్సెల్ మిగతావాటాలను కొనివైచినాడు. అట్లు కొనుటలో అతడు విశేషధనమును వెచ్చింపవలసి వచ్చెను. కంపెనీ ప్రారంభములో 20 పౌనులు మాత్రముండిన ఒక్కొక్క వాటా ఎడ్సెల్ కొనువాటికి రెండు వేల ఐదువందల పౌనుల విలువగలదియయ్యెను. కంపెనీయొక్క మొదటి పెట్టుబడియగు ఆరువేలపౌనులలో కొంచెము కొరవగా సగము వాటాలను కొనుటకుగాను వారు నూటఏబదిలక్షల పౌనులను వెచ్చించిరి.

ఈ మోటారుకంపెనీ ఒకానొకవడ్లాబత్తునిదుకాణములో ప్రారంభమయ్యెను. కారుయొక్క పార్టులు అన్నియు ఇతరచోట్ల తయారగునవి. వానినితెచ్చి కూర్చి ఫోర్డు కారు తయారుచేయువాడు. మొదటి సంవత్సరములో అతడు 1708 కార్లను తయారుచేసి అమ్మివైచెను. మోటారుకారు వర్తకమున అప్పటికిది అద్భుతపూర్వము. రెండవసంవత్సరమున భాగస్వాముల మాట విని అతడు మరిరెండు క్రొత్తమాదిరికార్లను తయారుచేసెను. ఈ కారణమున హెచ్చుకార్లు తయారుకాలేదు; 1695 కార్లు మాత్రము అమ్మివైచినవి. అన్నివాటాలనుకొని 1906లో కంపెనీయొక్క సంపూర్ణాధికారమును ఫోర్డు పొందువరకును ఫోర్డుకార్లకు సరియైన గిరాకీ తగిలి వ్యవసాయదారుని కొమారుడగు ఫోర్డు నామము ప్రపంచము నలుమూలల వ్యాపింపలేదు 1906 లో మిక్కిలి చౌకధరకు అమ్ము ఒక్కటేమాదిరి కారును తయారుచేయుటకు ప్రారంభించినాడు. అనంతరము నడచిన వృత్తాంతములు ఫోర్డు ఆలోచన మహత్తరమైన దనుటను వెల్లడించినవి. ఒకేసారి నాలుగైదు మాదిరుల కార్లు తయారుచేయు పద్ధతి నవలంబించినవారు తమ లోపమును గుర్తించిరి. ప్రజామోదమునందిన ఫోర్డుకారు ఆ దినములలో 120 పౌనులకు అమ్మబడుచుండెను. కార్లలో అంతచౌకయైనది మరియొకటిలేదు. ఒక్కసంవత్సరములోపల ఎనిమిదివేల నాలుగువందల ఇరువదిమూడు కారులు విక్రయింపబడెను.

కార్లసృష్టి గాలప్పరుగుమీద సాగుచుండెను. 1908-వ సంవత్సరము మే మాసమున ఒకవారమునందు ఆరురోజులు మాత్రము పనిచేసి ఫోర్డువర్కర్సువారు 811 కార్లను కూర్చిరి. అదేవత్సరము జూనుమాసములో ఒక్కదినమున పనిచేసి నూరుకార్లను తయారుచేసిరి. సాయంకాలములందు పాతవి, పాడైపోయినవియగు గడియారములను బాగుచేయుచు దినములు వెళ్ళద్రోయుచుండిన ఆవ్యవసాయదారుని కొడుకు ఇప్పుడు మోటారువర్తకులలో ప్రథమగణ్యుడైనాడు.

1908-వ సంవత్సరము శీతకాలమున ఒకక్రొత్త మోస్తరు కారును ఫోర్డు మార్కెట్టులో పెట్టెను. వెనకటిదానికంటె ఇది తూకమున తగ్గినది. దీనితూకము పండ్రెండువందల పౌనులు మాత్రమే కంపెనీ ప్రారంభమై ఇప్పటికి మూడువత్సరములయినది. వడ్లాబత్తుని దుకాణములో చిన్నదిగా ప్రారంభింపబడిన దాని కార్యస్థానము రెండున్నర యకరముల ప్రదేశము నావరించిన ఫ్యాక్టరీగా అభివృద్ధినందినది. మొదట మూడువందల మంది పనివాండ్రతో ప్రారంభింపబడిన కర్మాగార

మిప్పుడు రెండవేలసుంది కార్మికుల పరిశ్రమను లోగొనుచుండెను. లాభములుకూడా ఈ రీతిగనే విశేషించెను.

ఫోర్డు ప్రవేశపెట్టిన క్రొత్త మాదిరికారులు ప్రజామోదమును అతిశీఘ్రముగ బడసెను. ప్రథమవత్సరమునసే పదివేల ఆరువందలయేడుకార్లు అమ్ముడుపోయెను. 1925-వ సంవత్సరమునాటికి ప్రపంచమున ఏ ప్రదేశమున అమ్ముడుపోయిననేమి ఈ మాదిరికారులు నూటఏబది లక్షలు చెలామణియయ్యెను. 1911 నాటికి ఫ్యాక్టరీ ఆవరణ రెండున్నర యకరములనుండి ముప్పదిరెండు యకరములకు పెరిగెను. కార్మికులసంఖ్య రెట్టింపు అయ్యెను. 1908 లో ఆరువేల కార్లను తయారుచేసిన కంపెనీ ఈ సంవత్సరములో ముప్పదియైదువేల కార్లను తయారుచేసెను.

ఈ కాలముననే ఫోర్డు తన కారును బ్రిటీషు దీవులలోనికి ప్రవేశపెట్టెను. ఐరోపా మహాసంగ్రామమున ఫోర్డు కారులు పెక్కుపనులకు విరివిగా ఉపయోగింపబడినవి. నాలుగువేల నాలుగువందల ఆరుఅడుగులఎత్తున ఉన్న బెన్ నెవిస్ శిఖరమునకు ఫోర్డుకారు జయప్రదముగ నడిపింపబడుటతో ఆంగ్లేయులకు ఫోర్డుకారుపై మోజు కుదిరినది. ఏడాదిలోపున ఆ దేశమున అతడు పదునాలుగువేల కార్లను అమ్మినాడు. అనంతరము ఫోర్డు ఆంగ్లేయుల కొరకు ప్రత్యేకముగా మాంచెస్టరులో ఒక ఫ్యాక్టరీని స్థాపించినాడు.

కొద్దికాలములో హెచ్చుకార్లను తయారుచేయుటయే ఆ దినములలో ఫోర్డు ఆలోచన నంతటిని గ్రసించియుండెను. 1913లో ఒక కారు తయారుచేయుటకు తొమ్మిదిగంటలన్నర పట్టుచుండెను. క్రొత్త మెలుకువలు కనిపెట్టి ఆరుమాసముల అనంతరము అయిదుగంటల ఏబదియారు నిముసములలోనే అతడు ఒక కారును తయారుచేయ గలుగుచుండెను. అనగా అదే పనివాండ్రు మునుపు ఒక కారును తయారుచేసిన కాలములో ఇపుడు రెండు కార్లను తయారుచేయుచున్నా రన్నమాట.

కాగా—కొనుగోలుదారులకు కారు ఖరీదును ఎంత మాత్రమును పెంచకయే తన ఫ్యాక్టరీలోని కార్మికుల జీతములను ఫోర్డు పెంచగలిగినాడు.

కాలమును కూడదీయు ఇట్టి పద్ధతుల నవలంబించుటచే నాతడు కార్మికులకాలమును సద్వినియోగమునకు దెచ్చి డబ్బుగా మార్చినాడు. అగుటచే 1914 లో ఫోర్డు రోజుకు ఎనిమిదిగంటల చొప్పున వారమునకు నలుబదిఎనిమిదిగంటలు పనిచేయు తన కార్మికులలో మిక్కిలి తక్కువజీతము తీసికొనువాడు సయితము దినమునకు ఒక పౌను వేతనము పొందునని ప్రకటించినాడు. ఇంతటి హెచ్చుకూలి మరియే ఒక పెద్ద కంపెనీయు ఇచ్చియుండలేదు. ఇట్టి వేతనముల ఏర్పాటు జరిగిన తరువాత అంతవఱకు ఏడాదికి రెండులక్షల నలుబది ఎనిమిదివేల కార్లను తయారుచేయుచుండిన ఫ్యాక్టరీ మూడులక్షల ఎనిమిదివేల కార్లను తయారుచేయ గలిగెను. కార్లు నూరుపౌనులలోపు ఖరీదుకే లభ్యమగునట్లు వాని వెలలు తగ్గింపబడెను. ఎంతటి విచిత్రమో! గమనింపుడు. నేలతుడుచు తక్కువ కూలివాడుకూడ వారమునకు ఆరుపౌనుల (అప్పటివిలువ దాదాపు డెబ్బదిరూపాయిలు) పెద్ద వేతనమును పొందు కంపెనీలో తయారుచేయబడిన కారు ఒక్కొక్కటి నూరు పౌనుల (అప్పటివిలువ పదునైదువందల రూపాయిలు) లోపువెలకే విక్రయింపబడుట. గారడీగా ఉండలేదా? ఈ గారడీ కంతకును ఫోర్డు బుద్ధికుశలత, నిర్మాణకౌశలము కారణములు. ఆకంపెనీలో పనిచేయు సమయములో ఒక రెప్పపాటుకాలముగాని, ఒక చిన్న చీమతలకాయయంత వస్తువుకాని వృథాగా పోరాదు.

కంపెనీలో సగము వాటాలను ఫోర్డు తన కొడుకుచే కొనిపించినాడని చెప్పియుంటిమి. అట్లు కొనిపించుట 1919 లో జరిగెను. అట్లు కొనుటలో అతడు విశేషధనమును వెచ్చించెననికూడ చెప్పియుంటిమి. నూటనలుబదిలక్షల పౌనులు అప్పుచేసికాని అతడా వాటాలను కొనలేకపోయినాడు. ఏడాదిలో డెబ్బది లక్షల పౌనులను తీర్చినాడు. ఇంకను డెబ్బదిలక్షల

పౌనుల అప్పు నిలచియున్నది. ఈ సమయమున ఆతని విరోధులు ఆతను అప్పులలో తలమునకలైనాడనియు ఆతని కర్మాగారము ఆర్థికముగ చిక్కులలో పడినదనియు అపవాదు పుట్టించి దానికి విశేషప్రచారమును కల్పించిరి. ఫోర్డుకంపెనీవంటి మోటారుకంపెనీలకు అట్టి అపవాదువలన కలుగగల నష్టమునకు మితిలేదు. కంపెనీ కొలదికాలములో రూపుమాసిపోయి స్పేర్ పార్టులు దొరుకుట కష్టమైపోవునను అనుమానము కలిగిన తరువాత ఎవరు ఆకంపెనీకార్లను కొందురు? అదియునుగాక అప్పు తెచ్చు పద్ధతికి ఫోర్డు మొదటినుండియు వ్యతిరేకుడే. అప్పుచేయుటచే తానొక ధనికుని చెప్పుచేతులలోనికి బోవలసివచ్చుననియు, వారు కంపెనీ వ్యవహారములలో తమ వ్రేలు జొనుపజూతురనియు ఆతని భయము, కావున ఆతడు సాధ్యమైనంత త్వరలో ఆ డెబ్బది లక్షల పౌనుల అప్పును తీర్చివేయుటకు కృతనిశ్చయుడైనాడు

ఫోర్డుచేసిన గారడీలలోకెల్ల ఇది విచిత్రతరమైనది. కారులు బట్వాడాచేసినతోడనే సొమ్ముయిచ్చు పద్ధతిమీద కార్లవర్తకులు పంపియున్న కంట్రాక్టులు దొంతలు దొంతలుగా ఉన్నవి. నేలకొలది కార్లకు ఆర్డర్లు. కాగా ఇప్పు డాతను చేయవలసినదియేమి? కార్ల ఉత్పత్తి హెచ్చుచేయుట. బ్యాంకులో డెబ్బదిలక్షలపౌనులును తాను కట్టవలసిన దినమునకు ముందుగానే ఆవిలువ మేరకు కార్లు తయారుచేసి బట్వాడా చేయుచో అంతయు సవ్యముగ చక్కబడును.

ఫోర్డు పనికి ప్రారంభించినాడు. ఖర్చును పెంచకయే ఉత్పత్తిని అతిశయింపజేయు ప్రతివిధానములు అవలంబింపబడినది. ఆఫీసుస్టాఫ్ సగమునకు సగము తగ్గింపబడినది. వారికి ఫ్యాక్టరీలో హెచ్చుకార్లను తయారుచేయుటలో సౌకర్యము కల్గింప పనులీయబడినవి. ఉపయోగింపబడు టెలిఫోనుల సంఖ్యకూడ ఖర్చు తగ్గించుటకొరకు తగ్గింపబడినవి.

పూర్వముకంటె ఇపుడు కార్ల ఉత్పత్తి అతిశయించినది. డెబ్బదిలక్షల పౌనులను కూర్చుటయు సులభమేయని యగుపడినది. కాని డెట్రాయిట్ - టొలిడో - ఐరాన్టన్ రైల్వేకంపెనీవారు ఫోర్డు కంపెనీవారికి కావలసిన ముడివస్తువులను కర్మాగారమునకు చేర్చుటలోను, కర్మాగారమునుండి తయారైన కారులను గొనిపోయి వర్తకులకుచేర్చుటలోను ఆలస్యముచేయుచుండుట ఫోర్డు కనిపెట్టెను. కార్లు వర్తకులకు బట్వాడా అయినకాని వారినుండి డబ్బురాదు. రైల్వేవారు కార్లను కొనిపోవుటలో ఆలస్యము చేయుచున్నారు. బట్వాడా త్వరత్వరగా జరిగినకాని తాను చేయుచున్న కృషి అంతయు బూడిదపోసిన పన్నీరగును.

ఫోర్డు ఈసమస్యనంతను ఆదిచూచినాడు నిముషములమీద తుదినిశ్చయమునకు వచ్చినాడు. రైల్వే కంపెనీనే తాను కొనివైచినాడు. తయారైన ఫోర్డు కార్లు శరవేగమున వర్తకులకడకు కొనిపోబడవలయునని ఒక్కటే ఆర్డరువేసినాడు. రైల్వేకంతకును తానే స్వామిదారుడాయెను ! ఫ్యాక్టరీకి ముడివస్తువులుకూడ మునుపటికంటె శీఘ్రముగ కొనిరాబడినవి. ఇదివరకు ముడివస్తువులు కొనుదినమునకును కారు తయారగు దినమునకును ఇరువది రెండు దినములు వ్యత్యాసముండునది. ఇపుడో! రైల్వే తనచేతులలో నుండుటచే ముడివస్తువులు కొనిన తరువాత ఎట్టి ఆలస్యమును లేక వానిని ఫ్యాక్టరీకి తెప్పించునాడు. ఈ కారణమున ఇప్పుడు ముడివస్తువులు కొనుదినమునకు కారు తయారగు దినమునకు పదునాలుగు దినములుమాత్రము వ్యత్యాసముండునది. ఈ కారణముచే కొద్ది స్టాకుతోడనే ఆతడు ఫ్యాక్టరీని నడిపింపగలుగువాడు. కొద్దిస్టాకు అనగా వస్తురూపముగా తక్కువసొమ్ముమాత్రమే నిలిచి ఉండుచున్నదన్నమాట. రైల్వేబట్వాడా కాలము మూడింట ఒకవంతు తగ్గించుటచే ఆతడు నలుబదిలక్షల పౌనుల విలువగల సరుకును రవాణాచేసినాడు. రవాణా చేయబడిన సరుకు విలువ అచిరకాలముననే బ్యాంకుకు చేరునది.

**1921**-వ సంవత్సరము జనవరి **1**-వ తేదీ ఏప్రియల్ **1**-వ తేదీ మధ్య హెన్రీ ఫోర్డునకు అప్పు తీర్చుటకైననేమి ఆదాయపుపన్ను కట్టుటకైననేమి, జీతములపై

ఈయవలసిన బోనసులకైననేమి నూట ఇరువదిలక్షల పౌనులు కావలసియుండెను. జనవరి 1-వ తేదీకి ఫోర్డు కంపెనీ అక్కౌంటున బ్యాంకులో నలుబదిలక్షల పౌనులు మాత్రముండెను. సమయముననే కార్ల శీఘ్ర నిర్మాణము ప్రారంభమయ్యెను. నాలుగుమాసముల యనంతరము బ్యాంకులో ఫోర్డు కంపెనీవారికి నూట డెబ్బదిలక్షల పౌనులుచేరెను-బాకీఉన్న ప్రతి చిన్నపైసాయు ఇచ్చివేయగా ఇంకను కంపెనీవారికి ఏబదిలక్షల పౌనులు మిగిలెను. మార్కెట్టులోనికిబోయి అప్పుతేకుండుటకుగాను వణిక్పుంగవుడు ఫోర్డుదొర చేసిన గారడీ ఇది. ఈ గారడీలోని విశేషమే మన ఆర్థికముగా అలజడిగా నున్నప్పుడే అతడు విశేషధనమును వెచ్చించి ఒకరైల్వేనంతను కొనివైచుట. అది నిజముగా మొక్కవోని ధైర్యసాహసకృత్యము. ఉద్యోగమును కాలదన్ని తనకొఱకు కార్లు తయారుచేయుటను చేకొనిన సమయమున ఫోర్డు చూపినయట్టి ధైర్యసాహసములనే ఇప్పట్టున కూడ అతడు చూపెను. ఇంతటి చొఱవలేని మతి యొకమనిషి అట్టి పరిస్థితులలో ఏమి చేసియుండును? రైల్వేకంపెనీవారికి వారు చేయుచున్న అనుచితమగు ఆలస్యమునుగూర్చి ఒక ఉత్తరమును వ్రాసి కార్యము చక్కబడుటను ఆశించియుండును ఫోర్డు పద్ధతి అది కాదు ఉత్తరము వ్రాయుచు అతడొక్క నిముసమైన వృథపోనీయలేదు. రైల్వేనే కొనివైచి తన సరుకుల బట్వాడా సుకరమొనర్చుకొనినాడు.

ఇందుతో అతని వ్యాపారము సకల కాలమునకును స్థిరపడిపోయినది. ఆ వ్యాపారమున అతనిని సవాల్ చేయగలవాడు మరి లేకపోయెను. ఇటీవల ఫోర్డు తన కారు మోడల్ మార్చినాడు. అప్పటి కాతడు నూట ఏబదిలక్షల కార్లను అమ్మెను. 1922-వ సంవత్సరము నుండియు అతని మోటారువర్కుస్ ఏడాదికి ఇరువది లక్షలకార్లవంతున తయారుచేయుచుండెను. మోటారు ప్రపంచమున ఇది అశ్రుతపూర్వము. 1925-వ సంవత్సరము నాటికి పనివాండ్రకు జీతములక్రింద ఏడాదికి ఆ కంపెనీ ఐదుకోట్ల పౌనులను వెచ్చించుచుండెను.

సామాన్యుడగు కర్షకబాలునికృత్య మిది అంతయు.



# మణిమాల

## క్షౌరపుఖర్చు దినమునకు మూడువేలు

అందముగా ఉండుటకుగాను హిందూదేశీయులు ఏడాదికి పదునారుకోట్ల రూపాయిలను వెచ్చించుచున్నారని అంచనా వేయబడినది మన దేశమున పాశ్చాత్య నాగరికత కొంత ప్రబలుచుండకపోలేదు అయితే మన స్త్రీలింకను సౌందర్యపోషణవిషయమున ఐరోపాయను స్త్రీలంత దుబారాఖర్చులకు అలవడలేదు. కావుననే హిందూదేశపు పట్టణములలో హెచ్చుగ పాశ్చాత్య నాగరికతలో మునిగిపోయిన బొంబాయివంటి పట్టణమున కూడ ప్రత్యేకము సౌందర్యపోషణశాలలు లేవు. సుభగంకరణమునకైన వస్తువులను విదేశములనుండి మనము నూటఇరువదియైదులక్షల విలువగల వానిని ఏటేట దిగుమతి చేసికొనుచున్నాము. హిందూదేశముననే తయారుచేయబడుసబ్బులు, మొగము మెఱుగులు, పౌడరులు, సుగంధద్రవ్యములు మొదలగువానిని కొనుటలో మనము వెచ్చించుధనమునుకూడ అంచనావేసి దానికికలిపితిమేని ఈ సుభగంకరణసామగ్రి కొఱకు మనము ఏటేట వెచ్చించుమొత్తము ఇంకను పెద్దది కాగలదు. కాని ఈవిధమగు ఖర్చులో పట్టణములందు నివసించెడివారికిని పల్లెలందు నివసించువారికిని చాలవ్యత్యాసమున్నది. ఒక నిదర్శనము చూపెదము. బొంబాయి మహానగరములోని జనులు తమక్షౌరపుఖర్చులకుగాను దినమునకు మూడువేలరూపాయిలను వెచ్చించుచున్నారు. ఒట్టి పెండ్రుకలకుగాను ఎంతటిఖర్చో? సబ్బులు మొదలగు ఇతర సుభగంకరణముల కొఱకు ఆపట్టణ మెంత వెచ్చించుచున్నదో నూటిగ తెలియదు. కాని అంచనావలన ఆ ఖర్చు ఏడాదికి ఇరువదిలక్షలకు లోబడియుండదని ఊహింపబడుచున్నది. భారతదేశపు పల్లెలయందు ఈ వస్తువులకింతటి చెలామణీ ఉండదు. ఉండుటకు అవసరము కాని, అవకాశము కానిలేదు. ఇపుడిపు డిట్టి విషయములందు పల్లెలలోకూడ వ్యామోహము పెరుగుచుండుట కాంచు

చున్నాము. పెచ్చు పెరుగకుండ దానిని ప్రారంభమునసే ప్రబోధమువలన త్రుంచివేయుట మంచిది.

*—Amruta Bazar Patrica.*

* * *

## సబ్బుల కంపెనీల లాభములు

ఆర్థికమాంద్యమువలన ఎన్నికంపెనీలు దెబ్బతిననను సబ్బులను తయారుచేయు కంపెనీలుమాత్రము కొంచమేని నష్టపడలేదు. పైగా మంచి లాభమును గడించుచున్నవి. సుప్రసిద్ధిగాంచిన సన్‌లైట్‌మార్కు బట్టల సబ్బులను తయారుచేయు లీవరు కంపెనీవారు 1934-వ సంవత్సరమున 6568844 పౌనుల లాభము గడించిరి. దాదాపు తొమ్మిదికోట్ల రూపాయిలన్నమాట. కంపెనీ ప్రారంభించిన తరువాత ఇంతటి పెద్దలాభమును వారెప్పుడును పొందియుండలేదని తెలియుచున్నది. ఆర్థికమాంద్యము తీవ్రముగ పెరిగియున్న ఈ రోజులలో ఇంతటిలాభమును పొందగలుగుట నిజముగా ఆశ్చర్యమైనదే. లీవరు కంపెనీవారు భారతదేశమునకూడ తమకంపెనీ వర్కుషాపునొకదానిని తెరచియున్నారు. ఇచట వారు వారమునకే డెబ్బదిటన్నుల బట్టలసబ్బును తయారుచేయుచున్నారు. వీటిఅన్నిటిని బట్టిచూడగా పైవత్సరము ఈ కంపెనీవారి లాభము లింకను విశేషించియుండగలవని ఊహింపవచ్చును. 1910-వ సంవత్సరమున ఈ కంపెనీవారి లాభములు 6 37,329 రూపాయలుమాత్రమే. 1934-వ సంవత్సరమున 65,68,844 లాభమును గడించిరి. ఎంతటి అభివృద్ధియో గమనింపుడు. సబ్బులను తయారుచేయు కంపెనీలలో సుప్రసిద్ధమైన మరియొక కంపెనీ పామ్‌ఆలివ్‌కంపెనీ. 1933-లోకంటె 1934-లో ఈ కంపెనీవారు పదిరెట్లు లాభమును సంపాదించిరి. 1933-లో లాభము 74,680 పౌనులుమాత్రమే. 1934-లో 7,59000 పౌనులు.

*—The Indian Soap Journal.*

## పెళ్ళికాకముందే పిల్లలనుగను దంపతులు

ఫ్రాన్సుదేశమున 'ట్రయల్ మారేజ్' పద్ధతి విస్తారముగ అభిమానింపబడుచున్నది. వివాహము గావించుకొను ప్రతి ఐదుగురు దంపతులలోను ఒకజత వివాహమునకు పూర్వమే కనీస మొక్కసంవత్సరమైన దాంపత్యధర్మము నవలంబించికాని పెళ్ళికంట్రాక్టు చేసికొనుటకు అంగీకరించుటలేదు. ఈ పద్ధతి ఇటీవల హెచ్చుగ అభిమానింపబడుచున్నది. వివాహానంతరము తాము సుఖముగ దాంపత్యధర్మమును నిర్వహింపగలమో నిర్వహింపలేమో నిశ్చయమునర్చుటకు గాను ఒక యువకుడు యువతి కనీసము ఒక్క సంవత్సరమైన భార్యాభర్తధర్మమున తగిలియుందురు. యువకులలోనేగాక ఇది వృద్ధులలోకూడ ప్రబలుచున్నది. ఈపద్ధతి విస్తరించుటలో విడాకులు తగ్గిపోవుచుండుట కనుగొనబడినది. ఈట్రయల్ మారేజిపద్ధతి ఫ్రాన్సుదేశమున ఒక్క ఆ దేశీయులందుమాత్రమే కాక ఆదేశమున వలసనెలకొన్న బ్రిటీష్ మొదలగు ఇతర జాతీయులందు కూడ పాదుకొనుచున్నది. ఈట్రయల్ మారేజీలలో దంపతులు ఒండొరుల అర్హతలు అనర్హతలు కనుగొనుటకు తీసికొను కనీసపు కాలము తఱుచు ఒక్కసంవత్సరముగా ఉంటున్నది. ఈకాలమే ఒకొక్కప్పుడు ఐదుసంవత్సరములుగా ఉండుటయు అరుదుకాదు. ఈ దంపతులు నిరభ్యంతరముగా పిల్లలను కనవచ్చును. పిల్లలను కన్న తరువాత ఆదంపతులు వివాహము చేసికొనుచో ఆ పిల్లలు సక్రమసంతానముగనే పరిగణింపబడుదురు. స్కాట్లండులో వలెనే ఫ్రాన్సులోకూడ పెళ్లికి పూర్వము పుట్టిన పిల్లలు ఆదంపతుల వివాహానంతరము సక్రమసంతానముగ పరిగణింపబడుచట్టము గలదు. సంవత్సరము ప్రయత్నించికూడ ఆట్రయల్ మారేజి దంపతులు సంతానోత్పాదనమును గావింపజాలనిచో వారు నిరభ్యంతరముగా విడిపోవచ్చును. వివాహములు రిజిష్టరు చేసికొనక మార్వమే ఇట్టి దంపతులు ఇద్దరు ముగ్గురు పిల్లలనుకనుటగూడ గలదు.

*—The Matrimonial Review.*

# ఇన్స్యూరెన్సు విషయములు

## భీమా చేయుట ప్రతివానికిని విధ్యుక్త ధర్మము

నిత్యమును మృత్యువు సన్నిహితమై యున్నది. అది చెప్పిరాదు. ఆకస్మికముగను, అకాలముననుఅది సంభవింపవచ్చును. అట్టిచో నీ ఆలుబిడ్డల ఆర్థికస్థితిని పదిలముచేసి బద్రపరచుటకు ప్రధానమైన ఆధారమొక్కటేగలదు. అది జీవితభీమాయే. నీకుటుంభము తనభావిసుస్థితికి నీపై ఆధారపడి యున్నది. అగుటచే నీకుటుంబవ్యక్తుల భావిసుఖమునకై చేయగలిగినయంత పెద్ద మొత్తమునకు నీవు వెంటనే నీ జీవితమును భీమాచేయుట నైతికముగా నీముఖ్యధర్మమగుచున్నది. అట్లు జీవితమును భీమాచేయక చనిపోవుచో నీవు మానవసంఘము యెడలను, దేవునియెడలను ఘోరపాతకము చేసినవాడవగుచున్నావు. బ్రతికి యున్నంతకాలమును నీకుటుంబమును సుఖమయమొనర్చి నీ ఆకస్మికమరణముచే ఆ కుటుంబవ్యక్తులను వీధులలో అనాథలగ విడిచిపెట్టుట ఘోరపాతకముగాక మఱి యేమగును?

నిత్యకృత్యములతోడనే నిముసము తీరక లేకుండుటచే జీవితభీమానుగూర్చి ఆలోచించుటకే అవకాశము లేదని నీవు ఊహింపవచ్చును. అట్టిఊహయే నీకుండుచో నీ యిప్పటి ప్రస్తుత నిత్యకృత్యములముందు నీ కుటుంబముయొక్క భావిసుఖస్థితి అంతముఖ్యముకాదని నీవు తలంచుచుంటి వన్నమాట. ఇది ఇట్టిదే యగునేని నీ విప్పుడు యెవరిలాభముకొరకు కష్టపడుచుంటివి అనుప్రశ్న ఉదయించును. స్వార్థసుఖమును ఒక్కటియేకోరి నీ విప్పుడిట్లు కష్టపడి పనిచేయుటలేదు. మతిమంతు డెవ్వడును అట్టి అభిప్రాయముతో ఉండజాలడు. నీ కుటుంబముయొక్క సాముదాయకసుఖమును దృష్టియందుంచుకొనియే నీ విప్పుడిట్లు కష్టపడి పనిచేయుచున్నాడవనుట నిశ్చయము. ఎన్ని అంతరాయములు వచ్చినను వానినుండి నీ కుటుంబమును కాపాడి దానికి సాముదాయక సుఖమును కలిగించుటకు సమర్థమైనది నీవు జీవితమును భీమాచేయుట ఒక్కటియే.

జీవితభీమా నీకు ఎవ్విధముగను లాభప్రదమై యుండజాలదని అంధప్రాయముగ నీవు అనుకొనవచ్చును. దూరదృష్టినిచ్చి మితవ్యయముపుటలవాటులను మానవునకు నేర్పునది—వృద్ధాప్యమున కలుగగల అనేకములగు కష్టములనుండి రక్షణ కూర్చుకొనుటకు వలయుధనమును నిర్బంధముగా కూడబెట్టచేయునది ఒక్కజీవితభీమాయే అనుసత్యమును నీవు గుర్తింపవలసియున్నది. నీవు విశ్రాంతిగొను కడకాలమునకూడ జీవితభీమా నీ రాబడికొక ఆధారముగా నుండవచ్చును. లేదా నీవు మరణించువో అది నీ ఆలుబిడ్డల ఉపజీవికకు మంచి ఆధారమగును. నీవు అకాలమున మరణించువో—నేటిప్రపంచమున అకాలమరణములు అరుదుకాదు—బ్యాంకులు నీవు కూడబెట్టిన ధనమును మాత్రము నీవారల

సులకు ఈయగలుగును. భీమాకంపెనీలు అట్లుకాదు. నీవు యెంతధనమునుకూడ బెట్ట వలయునని అభిలషించితివో అంతధనమును భీమాకంపెనీలు నీ వారసులకు ఇచ్చును. ప్రస్తుతములో నీవు తృప్తికరమగు ఆర్జనలోనే ఉండిఉండవచ్చును. కాని ఆ ఆర్జననుండి నీవు కూడబెట్టగలిగినది నీవు అనంతరకాలమున ఒకపెద్ద ఆస్తిని సంపాదించుటకు సమర్థమై యుండకపోవచ్చును. ఆ గడనగల రోజులలో అట్టి పెద్దఆస్తి సంపాదించుటకు వలయు మొత్తమునకు నీవు భీమాచేయుదువేని ఆ పట్టా పరిపక్వమైనతోడనే ఆ ఆస్తిని నీవు సంపాదింపగలుగుదువు. జీవితభీమా నిన్ను పెట్టుబడి పెట్టుటకు సమర్థునిగా చేయుచున్నది. మరణమువలన అన్నివిషయములు అనిశ్చయములగుచున్నవి. కాని నీకు హెచ్చు విలువను నిశ్చయముగా ఇచ్చునది ఒక్కటియే ఉన్నది. అది జీవితభీమాయే.

నీ ఆర్జన యెంతకొద్దిపాటిది యగుగాక! నీ ఆలుబిడ్డల భావిసుఖవిషయమున నీకు గల నైతికబాధ్యతనుగూర్చి లెస్సగ ఆలోచించితివేని నీపై ఆధారపడియున్నవారి రక్షణనిమిత్తమైన భీమాపట్టాకొఱకుగాను మాసము మాసమును కొన్నిరూపాయిలు నిశ్చయముగ నీవు వెనుక వేయగలవు. అది నీకొక కష్టమనిపించదు. నేడు నీవు ఆరోగ్యవద్దేహుడవై జీవితమును భీమాచేసి పట్టాపొందుటకు అర్హుడవు అయి ఉండవచ్చును. కాని రేపు ఆకస్మికముగ నిన్ను ఆమయము అంటవచ్చును. అంచుతో జీవితమును భీమాచేసి పట్టాపొందుటకు నీకుగల అర్హత తొలగిపోవచ్చును. కావున భీమాచేయు విషయములో ఎంత శీఘ్రముగనైన అంత శుభము. నేడు చేయదగినదానిని రేపటికి వాయిదావేయుట ఏ విషయములోనైనను దోషమే. అందును అది భీమాచేయు విషయమున క్షమింపరాని మహాదోష మగుచున్నది. నీ ఆలుబిడ్డల అనంతరసుఖమునకు ఆధారభూతమగు భీమావిషయమున ఆలస్యము చేయుటలో నీవొకమహాపాపమును చేయుచుంటివనినమ్ముము. కావున యువకుడవు, ఆరోగ్యవంతుడవు అయిఉన్నప్పుడే జీవితమును భీమాచేసి దానివలన కలుగగల విశేషలాభములను పొందుము. వాయిదాలు వేయకుము. ఒక సంవత్సరము అనంతరము చేయుదానికంటె నేడే చేయుటచే కట్టవలసిన ప్రీమియము తక్కువయగును. అనగా ఏమి? భీమాపట్టాను చౌకగా కొనుచున్నావన్నమాట. హెచ్చువెలయిచ్చి ఆలస్యముగ కొనుటకంటె చౌకధరకు పెందలకడనే కొనుట మంచిదికాదా?

బ్రతికియున్నంతకాలమును పలువురు తమ ఆలుబిడ్డలను చక్కగ పోషింతురు. కాని వారి మరణానంతరము ఆ ఆలుబిడ్డలు అనాథలుగ చేయబడుచున్నారు. వారు తమ జీవితములో సరియైనకాలమున భీమాపట్టాను పొందియున్నచో స్థితి ఇట్టిదిగా ఉండకుండునుగదా! మనము నిత్యానుభవములో ఇట్టిదృశ్యముల నెన్నిటినో చూచుచున్నాము. భీమాపట్టాయను నిశ్చితమైన రక్షణ యుండియుండగా ఇట్టి పరిస్థితులు కలుగుటకు అవకాశమిచ్చుట వారు గావించిన పెద్దపాపములలో మొదటిది యగుచున్నది. భీమాపట్టాకొఱకు ప్రతిసంవత్సరమును నీరాబడిలో కొద్దిపాటిధనమును ప్రత్యేకించుచు వచ్చుచో నీ ఆలుబిడ్డలకు హృదయవిదారకమగు ఇట్టి శోచనీయపరిస్థితులు కలుగకుండనుండును.

—యస్. జి. పి. నాయుడు.

*—The Indian PolicyHolders' Review.*

# సంపాదకుని విన్నపములు

### రెండు అణాలు చేసిన తరువాత :—

రెండుఅణాలు చేసినతరువాత ఆంధ్రభూమి విడికాపీల అమ్మకము విశేషించినదని చెప్ప గలుగుటకు చాల ఆనందితులమగుచున్నాము. గతమాసపు సంచికలను అందుకొనిన మరు నాడే తెనాలి, భీమవరము, గుంటూరు, అనకాపల్లి మున్నగు గ్రామములందలి ఏజెంట్లు తిరిగి అదనపు కాపీలకు ఆర్డరు లిచ్చిరి. కాపీలు హెచ్చుగను త్వరగను అమ్మకమైపోయిన కారణమున ఆ ఏజెంట్లలో కొందరికి అదనపు కాపీలను పంపజాలకపోయితిమి. ఇందుచే నిరుత్సాహపడిన ఆంధ్రభూమిపాఠకులు మమ్ము మన్నింపగలరని నమ్ముచున్నాము. ఈ మాసము అదనపుకాపీలు ముద్రించి ఏజెంట్లకందఱకును విరివిగా సరఫరాచేసితిమి. ఇదివఱకు ఆంధ్రభూమికి పదునాలుగుతావులలో మాత్రము ఏజెంట్లుండిరి. ఇపుడు మఱి యేడుతావులయందు నూతనముగ ఏజెంట్లు ఏర్పడినారు. విడిసంచిక నాలుగుఅణాలు ఉన్నప్పటిలో అమ్మకము నిరుత్సాహముగ ఉన్నదనుకారణమున ఏజెన్సీ విరమించుకొనినవారిపుడు తిరిగి ఏజెన్సీ ఇప్పించవలసినదిగా వ్రాయుచున్నారు. ఈ రీతిని ఆంధ్రభూమి విశేషజనామోదమును బడయగలిగినందులకు మిక్కిలి సంతోషించుచున్నాము.

### క్షమాపణ :—

చేర్పులు మార్పులు చేసిపంపుడుమనిన కొన్ని ప్రకటనలు సకాలమున మా కార్యాలయమునకు చేరనికారణమున వానిని ఈ సంచికయందు చేర్చలేకపోయినాము. ఇందుకు ఆ కంపెనీయజమానులు మమ్ము మన్నింతురనియు, ఎప్పటిరీతిని వారు ఆంధ్రభూమిపై ఆదరాభిమానములను చూపుచుందురనియు నమ్ముచున్నాము.

### వణిక్పుంగవుల చరిత్రలు :—

పాశ్చాత్యవణిక్పుంగవుల చరిత్రలను సేకరించి ఆంధ్రభూమిలో మాసక్రమమున ప్రచురించుచున్నాము. కాని ఈ నడుమ కొద్దిమాసములు కారణాంతరములచే వానిని ప్రచురింప జాలకపోయితిమి. తిరిగి ఈసంచికనుండియు అట్టి చరిత్రల ప్రచురణమునకు దొరకొంటిమి. ఈవ్యాసములు ఆంధ్రభూమికి ప్రత్యేకతగూర్చు శ్రేణికి చెందినవగుట విడువక ప్రచురింపదగినవనియు, ఇవి గ్రంథరూపమున కూడ కూర్పబడుట వాంఛనీయమనియు పలువురు వ్రాయుచున్నారు. ఇకముందుకూడ ఆంధ్రభూమియం దిట్టివ్యాసములు ప్రచురించుచుందుమనియు, అవకాశమువెంట వీనిని గ్రంథరూపమున వెలయింపగలమనియు వారికి మాచేయుమనవి.

### విపంచి :—

తమ మృదుమధురరచనములచే నవ్యాంధ్రభారతిని సేవించుచున్న యువకవులలో నొకరగు శ్రీయుత బొడ్డు బాపిరాజుగారు తాము అపుడపుడు వివిధవిషయములను గూర్చి తెనుగుపత్రికలలో ప్రకటించుచువచ్చిన ఖండకావ్యములలో కొన్నిటిని 'విపంచి' అను నామమున గ్రంథరూపమున ప్రకటించియున్నారు. ఆ గ్రంథమును గూర్చిన విపులవిమర్శనము పై మాసపు ఆంధ్రభూమిసంచికలో ప్రకటింపబడును.

**౯. భీమాతత్త్వబోధినీకరపత్రములు :—**

భీమాతత్త్వప్రచారవిషయమున ఆంధ్రభూమిపత్రిక గావించుచున్న కృషి పలువురి మన్ననల నందగలిగినదని నివేదించుకొనుటకు ఆనందితులమగుచున్నాము. వ్యక్తులకు పొదుపు యను సుగుణము నలవఱచునదియు, కుటుంబములకు నిరాశామేఘములనిడనైన సోకకుండ చేయునదియు, దేశమునకు దారిద్ర్యబాధను తొలగింప సమర్థమైనదియునగు భీమాను ఆంధ్రభూమిలో ఆ విషయమునుగూర్చిన వ్యాసములను ప్రచురించుటకుతోడు ప్రత్యేకము కరపత్రములను వెలువరించియు ప్రచారముచేయ తలపెట్టినాము. భీమావిషయకవ్యాసరచయితలును, భీమాకంపెనీల యజమానులును మాకీవిషయమున తోడుపడుదురని ఆశించుచున్నాము.

**౯. ది తెలుగుటాకీస్ లిమిటెడ్ :—**

పాశ్చాత్యదేశములతో పోల్చి చూచితిమేని భారతదేశము టాకీలనిర్మాణవిషయమున వెనుకబడియున్నది. అట్లు వెనుకబడియున్న భారతదేశమందలి బొంబాయి, కలకత్తా మున్నగు రాజధానులలోనే మన ఆంధ్రదేశము ఈ టాకీల నిర్మాణవిషయమున మిక్కిలి వెనుకబడినదగుచున్నది. ఈ లోపము సవరింపబడుటకు ఇపుడు తెలుగుమాగాణిలో కొంత ప్రయత్నము కావింపబడుచున్నది. ఈ ప్రయత్నమునకు ప్రథమఫలముగా 'ది తెలుగుటాకీస్ లిమిటెడ్' జననమొందినది. శ్రీ చల్లపల్లి రాజావారు ఈ కంపెనీకి ప్రధానపోషకులుగా నుండుట కంగీకరించినారు. ఈ కంపెనీజయమున కిది యొకశుభసూచకము. ఈ కంపెనీ కార్యస్థానము ప్రస్తుతము మదరాసునందలి మౌంటురోడ్డు పోస్టుకు చెందిన 1/4 ఉడ్సురోడ్డులో నెలకొల్పబడినది. కంపెనీనిగూర్చి వివరములు తెలిసికొనగోరువారు ఆ చిరునామాకు వ్రాసికొనవచ్చును. ఈ తెలుగుసంస్థ జయమందుగాక యని ఆంధ్రభూమి మనఃపూర్వకముగ కోరుచున్నది.

**౯. ఈస్టు ఇండియా ఫిలింకంపెనీవారి రెండు క్రొత్త తెలుగుటాకీలు :—**

తెలుగుటాకీలలో అగ్రగణ్యమైనవానిని కొన్నిటిని తయారుచేసి ఆంధ్రుల కృతజ్ఞతకు పాత్రులైన కలకత్తాలోని ఈస్టుఇండియాఫిలింకంపెనీవారు ప్రస్తుతము 'సతీ - అనసూయ', 'సతీ - సులోచన' అను రెండు తెలుగుటాకీలను తయారుచేయుచున్నారు. సుప్రసిద్ధాంధ్ర నాటకకర్తలును, కవితాకళానిధిబిరుదాంచితులును అగు శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతము గారు కథారచయితలుగా నున్నారు. 'సతీ - సావిత్రి', 'లవ - కుశ' టాకీలను అద్భుతముగా డైరెక్టుచేసి తెనుగువారి మన్ననలనందిన శ్రీ సి. పుల్లయ్యగారు కళాభిజ్ఞులైన నటీనటులను ఏర్చికూర్చి ఈ రెండు క్రొత్త తెలుగుటాకీలను డైరెక్టుచేయుచున్నారు. అత్యద్భుతములైన సెట్టింగులకు పేరుకెక్కిన ఈస్టిండియా ఫిలింకంపెనీవారు పరిపక్వమైన డైరెక్షనుతోడను, అసదృశమైన సంగీతముతోడను వీనిని బయల్పరుప పూనుకొనుచున్నారు. ఆంధ్రులీ రెండు క్రొత్తటాకీల శుభాగమనమును నిరీక్షించుచున్నారు.

---

Printed at The Andhrabhumi Printing works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao B.A.